వీక్షణం

Veekshanam Fortnightly

ఆర్థిక, సామాజిక పక్ష పత్రిక

సంపుటి : 2 సంచిక : 3,4

ఫిబ్రవరి 1-28, 2005

Spl. Invitation Price

Rs.10/- Only

అనంతపురం రాజకీయార్థిక చిత్రం

బడ్జెట్ ఫోకస్

వై ఎస్ చైనా పర్యటన

సార్క్-ఇండియా వైఖరి

వస్త్ర పరిశ్రమ భవిష్యత్తు

వీక్షణం పక్ష పత్రిక,

సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రీసెర్చి అండ్ కమ్యూనికేషన్,

101, మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నం. 3, హిమాయత్‌నగర్, హైదరాబాద్- 500029

లోవలి పేజీల్లో...

చందా దారులకు విజ్ఞప్తి

వీక్షణం చందాదారులలో చాలామంది వార్షిక చందా డిసెంబర్ 2004 సంచికతో అయిపోయింది. అయినా తిరిగి చెల్లిస్తారనే నమ్మకంతో ఈ సంచిక కూడా పంపుతున్నాం. సంవత్సర చందా రు. 150 వెంటనే పంపించి తమ చందాలను పునరుద్ధరించుకోవలసిందిగా చందాదారు లందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం.

- సం.

ఉత్తరాలు:

మీరు ప్రచురిస్తున్న ప్రత్యేక సంచికలు చాలా బాగా వస్తున్నాయి. ఈ సంచికలకు ప్రతిస్పందన ప్రత్యేకంగా బాగా ఉంటున్నదని ఆశిస్తున్నాను.

-డా.డి. నాగయ్య,
గుంటూరు

వీక్షణం పత్రికను పట్టుదలగా నడిపిస్తున్నందుకు అభినందనలు, రాబోయే సంచికలో అంశాన్ని ముందుగానే సూచించి స్థిరపరచడం వల్ల ఇతర అంశాలకు స్థానం ఉండదేమోననే ఆలోచన వస్తుంది. దాని గురించి ఆలోచించి, అవసరమైన మార్పు చెయ్యండి. ఇతర అంశాలు మామూలే అని ఒక మాట అవసరమేమో...

-డా. మానేపల్లి,
ఎలమంచిలి

స్వీకారం:

కళంకిత సావర్కర్- బిజెపి, సంఘ్ పరివార్! -వ్యాసాలు- డాక్టర్ ఎబికె ప్రసాద్, ప్రజాపంథా ప్రచురణలు, 1/8 డెమీ, 36+iv పేజీలు, రు. 12

కాన్‌కున్, జెనీవా కపట నాటకాలు - వ్యాసాలు - వేములపల్లి వెంకట్రామయ్య, ప్రజాపంథా ప్రచురణలు, 1/8 డెమీ, 18+ii పేజీలు, రు. 8

అభివృద్ధికి దూరంగా ఆంధ్రప్రదేశ్ గిరిజనులు - కెచ్చెల రంగారెడ్డి, సిపిఐ (ఎం-ఎల్) న్యూ డెమోక్రసీ, ఖమ్మం జిల్లా కమిటీ ప్రచురణ, 1/8 డెమీ, 202+vi పేజీలు, రు. 40 ఈ మూడు పుస్తకాలూ ప్రతులకు: ప్రజాపంథా, మార్క్స్ భవన్, 658, విద్యానగర్ 7వ లైన్, హైదరాబాద్ - 500 044

పార్లమెంటరీ ప్రజాస్వామ్యం-ప్రజలు, నార్లస్మారకోపన్యాసం 2004 - వి. హనుమంతరావు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రచురణ, 1/8 డెమీ, 22+iv పేజీలు, వెల లేదు. ప్రతులకు సార్వత్రిక విశ్వవిద్యాలయం, రోడ్ నం. 46, జూబ్లీహిల్స్, హైదరాబాద్ - 500033

విడి ప్రతి: రూ॥ 12/-
వార్షిక చందా:రూ॥150/-లు

వీక్షణం

ఆర్థిక, సామాజిక పక్షపత్రిక
సమతా పబ్లికేషన్స్, సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రీసెర్చ్ అండ్ కమ్యూనికేషన్ ప్రచురణ

సంపుటి: 2 సంచిక: 3,4 ఫిబ్రవరి 1-28, 2005

సంపాదకీయం:

బడ్జెట్ల రుతువు

రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశం మొదలయింది. ఆర్థికమంత్రి రోశయ్య బడ్జెట్ సమర్పించారు. ఈ పత్రిక మీరు చదివే సమయానికి కేంద్ర ఆర్థికమంత్రి చిదంబరం కూడ బడ్జెట్ సమర్పించి ఉంటారు. ఏటేటా రుతుచక్రం తిరిగినట్టుగా రాష్ట్ర, కేంద్ర బడ్జెట్లు రావడం, వాటిని పత్రికలు, ఆర్థికవేత్తలు విశ్లేషించి హడావుడి చేయడం మినహా నిజంగా బడ్జెట్లు ఏ సామాన్య జీవి నిత్యజీవితం పైన ప్రభావం చూపాలో ఆ సామాన్యజీవికి ఏమన్నా ఒరుగుతున్నదా? అసలు సగటు మనిషి బడ్జెట్ గురించి ఏ మాత్రమైనా ఆసక్తి కనబరుస్తున్నాడా? అలా ఆసక్తి కనబరచకపోతే, ఇంత ముఖ్యమైన ఆర్థిక రంగ కసరత్తుకు అర్థం ఏమిటి?

బడ్జెట్ ఇంత నిరాసక్తంగా తయారు కావడానికి అనేక కారణాలున్నాయి. వాటిలో కొన్ని నూతన ఆర్థిక విధానాల కన్న ముందే ప్రారంభమైనవి. మరికొన్నిటిని నూతన ఆర్థిక విధానాలు తీసుకొచ్చాయి. మొత్తం మీద బడ్జెట్ అంటే కొన్ని దశాబ్దాల కింద ఎంతటి ఆసక్తి ఉండేదో, బడ్జెట్‌లోని అంకెలకు, హామీలకు ఎంత పవిత్రత, ప్రామాణికత ఉండేదో ఇటీవలి కాలంలో అవన్నీ దిగజారిపోయాయి.

బడ్జెట్ అంటే జాతీయోత్పత్తిని వివిధ వర్గాల మధ్య పునఃపంపిణీ చేసే సాధనం అని రాజకీయార్థశాస్త్రం నిర్వచిస్తుంది. కాని ఇటీవలి కాలంలో బడ్జెట్ ఆ పునఃపంపిణీ బాధ్యతను పక్కనపెట్టి, ఇదివరకు ఫలాలు అందిన వర్గాలకే కొత్తగా ఏ ఫలాలను ఎట్లా అందించదలచుకున్నదో, అందుకోసం ఇదివరకు కొల్లగొట్టిన వర్గాలనే ఎట్లా కొల్లగొట్ట బోతున్నదో తెలిపే వివరణ పత్రం అయిపోయింది.

నూతన ఆర్థిక విధానాల కన్న ముందే మన బడ్జెట్లు తూతూ మంత్రంగా మారిపోయాయి. గత సంవత్సరం బడ్జెట్‌ను తీసుకొని దానికి ఏ ఐదు శాతమో, పదిశాతమో పెంచి కొత్త అంకెలు తయారు చెయ్యడం, బడ్జెట్ ప్రవేశపెట్టేటప్పుడు ఇస్తున్న హామీలకు, చేస్తున్న కేటాయింపులకు కట్టుబడి ఉండాలనే నియమం లేకపోవడం, ప్రజాసంక్షేమ రంగాలకు కేటాయింపులను కూడ సరిగా ఖర్చు పెట్టకపోవడం, దుబారా రంగాలలో కేటాయింపుల కన్న ఎక్కువ ఖర్చు పెట్టడం ఆనవాయితీ అయిపోయింది. మంత్రివర్గాలలో, రాజకీయ నాయకత్వంలో బలం ఉన్నవారికి అనుకూలంగా బడ్జెట్లు తయారుకావడం మొదలయింది. పేద, మధ్యతరగతి వర్గాల మీద ఎక్కువ పన్నులు, రాయితీల తగ్గింపు అమలు కాగా, ధనిక వర్గాల మీద తక్కువ పన్నులు, రాయితీల హెచ్చింపు సర్వ సాధారణమైపోయాయి. బడ్జెట్ అంటే కాకులను కొట్టి గద్దలకు వేసే తంతుగా మారిపోయింది.

ఇక నూతన ఆర్థిక విధానాలకు, వాటి వెనుక ఉన్న ప్రపంచీకరణకు ప్రజాస్వామిక పాలన అంటేనే కంటగింపు గనుక ఈ మాత్రపు ప్రజాస్వామిక బడ్జెట్ చర్చ కూడ వాటికి ఇష్టం లేకపోయింది. అందువల్ల ప్రజాజీవితం మీద, ఆర్థిక రంగం మీద కీలక ప్రభావం వేసే నిర్ణయాలన్నిటినీ బడ్జెట్‌తో సంబంధంలేని ప్రభుత్వ విధాన ప్రకటనలుగా మార్చివేసి, బడ్జెట్‌ను కేవలం మొక్కుబడి తంతుగా మార్చారు. ఇప్పుడిక బడ్జెట్‌లో అంకెల గారడీ తప్ప రాజకీయార్థిక విధానమే మిగల లేదు.

కాలాలు మారిపోయి, వర్షాభావమే సాధారణంగా మారిపోయినా, తొలకరితో వర్షాలకోసం ఎదురు చూసినట్టు, ఫిబ్రవరి రాగానే బడ్జెట్ల కోసం ఎదురు చూడడం, అవి ఎంత నిరుపయోగమైనవయినా వాటిని విశ్లేషించడం కన్న మనం చేసేదేమీ ఉన్నట్టు లేదు.

ఆ నేల మాఫియాలనెందుకు కంటోంది?
అనంతపురం రాజకీయార్థిక చిత్రం

-ఎన్. వేణుగోపాల్

అనంతపురం పట్టణం నడిబొడ్డున తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఆవరణలో, చుట్టూ కొన్ని వందలమంది తెలుగుదేశం పార్టీ కార్యకర్తలుండగా, డజనుకు పైగా సాయుధ రక్షణ సిబ్బంది ఉండగా, పెనుగొండ శాసనసభ్యుడు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పరిటాల రవీంద్ర హత్యకు గురయ్యాడు. ఆ హత్యతో, హత్యానంతరం రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన విధ్వంసంతో, నెలరోజుల తర్వాత కూడ రాష్ట్ర రాజకీయాలలో ఆ హత్యా ప్రతిధ్వనులు వినిపిస్తుండడంతో అనంతపురం హంతక ముఠాల రాజకీయాలు మరోసారి చర్చలలోకి వచ్చాయి. అసలు మొత్తంగానే రాయలసీమ అనగానే ఫాక్షన్ రాజకీయాల నిలయం అని మాట్లాడే మధ్యతరగతి ఈ అనంతపురం హత్యాకాండను చూపి, అనంతపురం వాసులు, రాయలసీమ వాసులు పచ్చిరక్తం తాగే నరహంతకులన్నట్టు వ్యాఖ్యానిస్తోంది. రాయలసీమ ముఠాతగాదాల గురించి ఇప్పటికే ఎంతో చర్చ జరిగింది. గనుక ఆ చర్చలోకి వెళ్ళనవసరం లేదు. కాని ఈ సందర్భంగానైనా రాయలసీమలోని, అనంతపురంలోని ఏ ప్రత్యేక రాజకీయార్థిక పరిస్థితులు, చారిత్రక కోణాలు ఇవాళ్టి దుస్థితికి దారి తీశాయో అర్థం చేసుకోవలసి ఉంది. ముఠాతగాదాలను ఉత్పత్తి చేసి, పెంచిపోషిస్తూ, ముఠాలలోకి ఎప్పటికప్పుడు కిరాయి హంతకులను, సైనికులను భర్తీ చేస్తున్న సామాజిక కారణాలేమిటో అర్థం చేసుకోవలసి ఉంది. వ్యవసాయం, పరిశ్రమలు మొదలయిన ఉపాధికల్పనా అవకాశాలన్నీ రద్దయిపోతూ, కుంచించుకు పోతూ ఉన్న నేపథ్యంలో ఏకైక ఆదాయ వనరుగా, ఉపాధికల్పనగా ముఠా రాజకీయాలు ఎట్లా ఉనికిలోకి వచ్చి విస్తరిస్తున్నాయో అర్థం చేసుకోవాలి.

అనంతపురం రాజకీయార్థిక చిత్రం ద్వారా ముఠా రాజకీయాలను అర్థం చేసుకోబోయే ముందు తప్పనిసరిగా వదులుకోవలసిన దురభిప్రాయాలు కొన్ని ఉన్నాయి.

మొట్టమొదటిది, అనంతపురం జిల్లా గాలిలోనో, నీళ్ళలోనో హింసా స్వభావం ఉన్నదనే దురభిప్రాయం. అక్కడి మనిషి అనగానే హింసా ప్రవృత్తితో, హంతక స్వభావంతో, కయ్యానికి కాలుదువ్వేలా ఉంటాడనే దురభిప్రాయం. ఇది ఎంత మాత్రం నిజం కాదు. ఆ జిల్లాలోని ముప్పైఆరులక్షల జనాభాలో ముఠానాయకుల అనుచరులుగా నిత్యం పనిచేసేవారు వెయ్యిమందికి మించరు. ఇతరేతర కారణాల వల్ల గ్రామాలకు గ్రామాలు మొత్తంగానో, ఒక గ్రామంలో రెండు ముఠాలుగా విడిపోయో జిల్లాస్థాయి ఫాక్షన్‌కు అనుబంధంగా ఉన్నట్టు కనబడవచ్చు గాని ఆ మద్దతు తప్పనిసరిగా హింసకు దారితీయాలని ఏమీ లేదు. మొత్తంగా జిల్లాలో ఐదారు కుటుంబాల మధ్య చారిత్రకంగా గాని, ఆదాయ వనరుల మీద ఆధిపత్యం వల్లగాని, అధికార ప్రాబల్యంకోసం గాని కక్షలు, కార్పణ్యాలు ఏర్పడి ఉన్నాయి. ఈ కక్షల వల్ల అవతలి నాయకుడు ఒక రాజకీయ పార్టీని ఆశ్రయిస్తే, ఇవతలి నాయకుడు ప్రత్యర్థి పార్టీని ఆశ్రయించడం, పరస్పరం పార్టీలు మార్చుకోవడం కూడ ఆనవాయితీ అయిపోయింది. అందువల్ల ఈ ముఠాలను హింస ప్రధానమైనవిగా మాత్రమే కాక అధికారం, డబ్బు, రాజకీయం, ప్రాబల్యం ప్రధానమైనవిగా కూడ చూడవలసి ఉంటుంది. అలా చూసినప్పుడు వాటి మౌలిక స్వభావంలోనే తేడా కనబడుతుంది. అప్పుడు అన్ని జిల్లాలలో ఉన్నట్టే అనంతపురంలో కూడ రాజకీయ అధికార, ధన సంపాదనా కార్యక్రమంలో వైరి వర్గాలున్నాయని, కాకపోతే అనంతపురంలోని కొన్ని ప్రత్యేక చారిత్రక, రాజకీయార్థిక కారణాలవల్ల ఆ వైరివర్గాల మధ్య హింస పాత్ర మిగిలిన చోట్ల కన్న ఎక్కువగా ఉందని అర్థమవుతుంది.

మరొక పొరపాటు అభిప్రాయం ఈ ముఠానాయకులను రాజకీయ నాయకులుగా గుర్తించడం. ఆయా నాయకులు పేరుకు ఏదో ఒక రాజకీయ పార్టీలో ఉన్నట్టు కనబడవచ్చు. ఎన్నికల రాజకీయాలలో పాల్గొంటూ ఉండవచ్చు. ప్రజాస్వామ్యం గురించి ప్రగల్భాలు పలుకుతుండవచ్చు. కాని ఈ నాయకులెవరికీ రాజకీయం అనే మాట ఉచ్చరించే అర్హత లేదు. ప్రజా సమస్యలకు సృజనాత్మకమైన, ఆచరణ సాధ్యమైన పరిష్కారాలు కనిపెట్టే ప్రక్రియే రాజకీయం అని నిర్వచనం చెప్పుకుంటే ఈ నాయకులందరూ రాజకీయాల పేరుమీద అమలు చేస్తున్నవి అరాజకీయాలు. ప్రజాస్వామ్యానికి మౌలిక పునాది అయిన భిన్నాభిప్రాయాన్ని గౌరవించడం అనేది వీళ్ళకు చుక్కెదురు. భిన్నాభిప్రాయాన్ని అణగదొక్కడం, గ్రామం నుంచి వెళ్ళగొట్టడం, వేధించడం, వారి ఆస్తులు ధ్వంసం చేయడం, చివరికి వారిని భౌతికంగా నిర్మూలించడం-ఇవీ ఈ నాయకులకు తెలిసిన వనులు. అందువల్ల వారు ఎన్నికలలో పాల్గొంటున్నా, శాసనసభ్యులుగా, మంత్రులుగా అధికారం చలాయిస్తున్నా, బహిరంగ వేదికల మీద ప్రజాస్వామ్యం గురించి ఎంత గంభీరోపన్యాసాలు చేస్తున్నా, జిల్లాకు చెందిన ఈ ఐదారుగురు బడానేతలు, కొన్ని

డజన్లమంది వారి అనుచరులు రాజకీయవాదులు కారు. ప్రజాస్వామిక వాదులు అసలే కారు. అన్నదానాలో, సామూహిక వివాహాలో, ధర్మాలో ఎన్ని చేసినా ప్రజా సమస్యలను తీర్చగల ప్రజానాయకులు వారిలో ఏ ఒక్కరూ లేరు.

మరి, వారు కేవలం తమ ఆస్తి పోగు చేసుకోవడానికి, బలప్రయోగం ద్వారా తమ రాజ్యాలు నెలకొల్పి విస్తరించడానికి మాత్రమే ప్రయత్నిస్తుంటే, వారిని రాజకీయ నాయకులుగా, ప్రజా నాయకులుగా గుర్తించడం ఎందుకు జరుగుతోంది? వారి వెనుక వేలమందో, లక్షలమందో ఉన్నట్టు భ్రమలు ఎట్లా కల్పించ గలగుతున్నారు? అనంతపురం ప్రజలలోని ఏ దారిద్ర్యం, ఏ దౌర్భాగ్యం, ఏ వెనుకబాటుతనం ఈ హంతక ముఠా నాయకులకు పెట్టుబడి అవుతోంది?

మన సమాజంలో స్థూలంగా డబ్బుకు, హింసకు, అధికారానికి, దౌర్జన్యానికి ఉన్న ఆకర్షణ, ప్రాబల్యం ఈ ముఠానాయకుల పెరుగుదలకు కారణాలు కాగా, అనంతపురం చరిత్రలోను, వర్తమానం లోను జరిగిన, జరుగుతున్న కొన్ని పరిణామాలు ఈ ముఠానాయకులు బలిసిపోవడానికి దోహదం చేశాయి.

అనంతపురం జిల్లా రాష్ట్రంలోని జిల్లాలన్నిటిలోనూ అతి ఎక్కువ వైశాల్యం గల జిల్లా. ఈ జిల్లా విస్తీర్ణం 19,13,492 హెక్టేర్లు (47,83,800 ఎకరాలు) కాగా జనాభా 37 లక్షలు. జనసాంద్రత తక్కువగా ఉన్న జిల్లాలలో ఈ జిల్లా ఒకటి. అంటే తలసరి భూవైశాల్యం రీత్యా చూసినా, జనసాంద్రత రీత్యా చూసినా ఈ జిల్లా వ్యవసాయరంగం సక్రమంగా ఉండి ఉంటే ప్రజాజీవనం సుభిక్షంగా ఉండి ఉండేది. నిజానికి విజయనగర సామ్రాజ్యంలో భాగమైన ఈ ప్రాంతం వందల సంవత్సరాల పాటు సువిశాలమైన చెరువుల కింద ఉపయోగకరమైన వ్యవసాయం సాగించింది. సగటు వర్షపాతం మిగిలిన ప్రాంతాల కన్న తక్కువ గనుక రక్షిత నీటిపారుదల వనరులుగా చెరువులు ఉపయోగపడ్డాయి. కాని విజయనగర సామ్రాజ్యపతనం తర్వాత ఈ ప్రాంతం వెంట వెంటనే వేరు వేరు పాలనల కిందికి, స్థానిక యుద్ధ ప్రభువుల వంటి పాలెగాళ్ళ కిందికి రావడం వల్ల, ఆ తర్వాత బ్రిటిష్ పాలన కిందికి రావడం వల్ల ఈ సురక్షితమైన నీటిపారుదల సౌకర్యాలు విచ్ఛిన్నమైపోయాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అటు చిన్నతరహా నీటిపారుదల సౌకర్యాలను, చెరువులను, కుంటలను పునరుద్ధరించలేక పోయింది. ఇటు భారీ, మధ్యతరహా నీటిపారుదల సౌకర్యాలను కల్పించి వ్యవసాయాన్ని రక్షించ లేకపోయింది. ఇటువంటి మానవ తప్పిదాలకు తోడుగా, ప్రకృతిలోను, పర్యావరణంలోను జరిగిన మార్పుల వల్ల వర్షపాతం ఇంకా తగ్గిపోవడం, పెన్న, చిత్రావతి వంటి జీవనదులు వట్టిపోవడం జరిగింది.

ఈ పరిణామాలన్నిటి వల్ల జిల్లాలో వ్యవసాయం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కోవడం మొదలయింది. జిల్లాలోని దాదాపు నలభై ఎనిమిది లక్షల ఎకరాల్లో నికర సాగుభూమి ఇరవైఐదు లక్షల ఎకరాలకు ఎప్పుడూ మించలేదు. దాదాపు ఐదు లక్షల ఎకరాల అడవి, ఎనిమిది లక్షల ఎకరాల సాగుకు లాయకు కాని పోరంబోకు భూములు, వ్యవసాయేతర వినియోగంలో ఉన్న భూములు తీసేసినా కనీసం పదిలక్షల ఎకరాల భూమి సాగుకు యోగ్యమై కూడ బీడు పడి ఉంటున్నది. జిల్లాలోని నికర సాగుభూమిలో కూడ కేవలం మూడున్నర లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీటి సౌకర్యం ఉంది. మరొక లక్ష ఎకరాలలో రెండో పంటకు అవకాశం ఉందనుకుంటే మొత్తం సాగునీటి సౌకర్యం ఉన్న భూమి నాలుగున్నర లక్షల ఎకరాలవుతుంది. అయితే అందులోనూ కేవలం డెబ్బై ఐదువేల ఎకరాలు మాత్రమే కాలువల కింది సాగయ్యే భూమికాగా మిగిలినదంతా చెరువులు, గొట్టం బావులు, ఇతర బావుల కింద సాగయ్యేదే.

అంటే జిల్లాలోని సంపన్నమైన భూవనరులను పెద్ద ఎత్తున దుర్వినియోగం చెయ్యడం జరుగుతోంది. జిల్లాలోని అననుకూల ప్రకృతి వల్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టి నీటిపారుదల సౌకర్యాలు కల్పించి మరింత ఎక్కువ భూమిని సాగులోకి తీసుకురావడానికి కృషి చేయవలసింది. కాని యాభై సంవత్సరాలుగా ఏ ఒక్క ప్రభుత్వమూ ఆ పని చేయలేదు.

ఉన్న భూవనరులను వినియోగించుకోవడంలో వైఫల్యం, జల వనరుల కొరతలతో జిల్లా గ్రామీణ, వ్యవసాయరంగం సంక్షోభంలో పడింది. వ్యవసాయం జూదంలా మారిపోయి గ్రామీణ శ్రామికులకు, రైతులకు రక్షిత ఉపాధి కల్పించలేని పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితి వల్లనే ఎక్కువ నీటిపారుదల, ఎక్కువమంది శ్రామికులు అవసరంలేని పంటలవైపు, పళ్ళ తోటలవైపు పెద్ద రైతులు మళ్ళగా, చిన్న రైతులు పట్టు పురుగుల పెంపకం వంటి ప్రత్యామ్నాయ ఉపాధివైపు చూశారు.

మొత్తం మీద అనంతపురం గ్రామ సీమలలో ముమ్మరంగా వ్యవసాయ పనులు లేక, ఖాళీగా ఉండే, ఏదో ఒక ఆదాయ వనరు కొరకు చూసే యువజనుల సంఖ్య పెరిగిపోయింది. జిల్లాలో పాఠశాలలకు వెళ్ళే వయసు గల పిల్లలలో సగం మంది మాత్రమే పాఠశాలలలో చేరడం, మళ్ళీ అందులో సగానికన్న ఎక్కువ మధ్యలోనే చదువు వదిలివేయడం చూస్తే, ఈ గ్రామీణ నిరుద్యోగ యువత ఇతర ఉపాధి అవకాశాల కొరకు ప్రయత్నించే అవకాశం కూడ లేదని తెలుతుంది.

జిల్లాలో వ్యవసాయం, గ్రామీణ ప్రాంతాలు ఈ దుస్థితిలో ఉన్నప్పుడు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పనలో భాగంగా భారీ పరిశ్రమలను గాని, గ్రామీణ ప్రాంతాలలో చిన్న పరిశ్రమలను గాని

తానే ఏర్పాటు చేయడమో, స్వతంత్ర పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడమో ప్రభుత్వం బాధ్యతగా భావించవలసింది. గత యాభై సంవత్సరాలుగా ప్రభుత్వాలు ఆ బాధ్యతలను కూడ విస్మరిస్తూ వచ్చాయి.

అనంతపురంలో డైనమైట్, ఇనుప ఖనిజం, సున్నపురాయి, అభ్రకం, బరైటిస్, కార్బొరండం, వజ్రాలు, బంగారం వంటి ఖనిజాలెన్నో ఉన్నాయి. ఈ ఖనిజాలను వెలికితీయడం, ప్రాసెస్ చేయడం వంటి పరిశ్రమలను స్థాపించి ఉపాధి కల్పనకు అవకాశాలు ఇవ్వవచ్చు. జిల్లాలో వేరుశనగ, ఇతర నూనెగింజల ఉత్పత్తి ఎక్కువే గనుక నూనెమిల్లులను తెరవవచ్చు. లేపాక్షి, పెనుగొండ వంటి చారిత్రక ప్రదేశాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్ది ఉద్యోగ కల్పన చేయవచ్చు. సౌళి కేంద్రంగా అభివృద్ధి చెందిన హిందూపురం నమూనాలో జిల్లాలో మరికొన్ని చోట్ల నూలు, పట్టు వస్త్ర పరిశ్రమను పెంచవచ్చు. మల్బరీసాగు, పట్టుపురుగుల పెంపకాల మీద మరింత శ్రద్ధ పెట్టి వాటి ద్వారా ఉపాధి అవకాశాలు పెంచవచ్చు. ప్రత్యామ్నాయ అవకాశాల అన్వేషణలో రైతులు స్వయంగా కనిపెట్టిన బత్తాయి, నిమ్మ తోటల లాగ పండ్లతోటల పెంపకాన్ని ప్రోత్సహించ వచ్చు. వాటి ప్రాసెసింగ్ పరిశ్రమలను ఏర్పాటు చేయవచ్చు. ధర్మవరం లాంటి చేనేత నైపుణ్య కేంద్రాన్ని, గుత్తి, గుంతకల్లు లాంటి రైల్వే కేంద్రాలను ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధి చేసి మరికొన్ని వేల ఉద్యోగాలు కల్పించవచ్చు.

ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు గాని, అటు జిల్లా అధికార యంత్రాంగం గాని, జిల్లాలోని రాజకీయ నాయకులు గాని ఆ ప్రాంత ప్రజల సర్వతోముఖాభివృద్ధి కోసం చేపట్టవలసిన వ్యవసాయ, పారిశ్రామికాభివృద్ధి వ్యూహాల గురించి ఎంతమాత్రం ఆలోచించలేదు. ప్రజల ఒత్తిడి ఫలితంగానో, అక్కడి కరవు గాథలు దయనీయంగా వినిపించడం వల్లనో అప్పుడప్పుడు చేసిన గంభీరమైన ఔదార్య ప్రకటనలు కూడ వాస్తవరూపం ధరించలేదు. గత రెండు దశాబ్దాలుగా ప్రభుత్వం ప్రకటించిన సహాయాలు, ప్యాకేజీలు అన్నీ సక్రమంగా అట్టడుగు ప్రజలదాకా చేరి ఉంటే అనంతపురం ప్రజల జీవన స్థితిగతుల్లో కొంతయినా ఉపశమనం ఉండి ఉండేది.

ఇలా వ్యవసాయ, గ్రామీణ, పారిశ్రామిక, ఉపాధికల్పనా రంగాల్లో కొనసాగిన సంక్షోభం కొన్నివేల కుటుంబాలను తమను ఆదుకునే దాతలెవరా అని ఎదురు చూసేట్టు చేసింది. కొన్నివేల మంది యువజనులు నిరాశా నిస్పృహలతో ఏమార్గంలోనైనా సరే భుక్తి గడిస్తే చాలునని ఎదురు చూసేలా చేసింది.

సరిగ్గా ఈ భౌతిక వాస్తవికతే అనంతపురంలో మాఫియాల విజృంభణకు పునాది. ఇటువంటి పరిస్థితులే రాష్ట్రంలో మరికొన్ని ప్రాంతాల్లో ఉన్నప్పటికీ అక్కడ మాఫియాలు పుట్టి పెరగక పోవడానికి, అనంతపురంలో అలా జరగడానికి కనీసం ఐదు ప్రత్యేక కారణాలున్నాయి. అవి పాలెగాళ్ళ చరిత్ర, అభివృద్ధి నిధులు, ఆదాయ వనరులు, కులం, పంచాయితీలు.

విజయనగర సామ్రాజ్య పతనం తర్వాత తలెత్తిన స్థానిక ప్రభువుల మధ్య ఘర్షణలలో ఒక సుస్థిర పాలన లేకుండా పోయింది. సుస్థిర పాలన లేని స్థితిలో పాలకుల బొక్కసాలు నింపుకోవడానికి కనిపించిన ఏకైక మార్గం ఎక్కడికక్కడ కప్పం వసూలు చేసి, 'శాంతి భద్రతల' ను కాపాడే బాధ్యతను పెత్తందార్లకు అప్పజెప్పడం. ఏ గ్రామానికి ఆ గ్రామంలోనో, కొన్ని గ్రామాలకు గుత్తగానో ఏర్పాటయిన ఈ పెత్తందార్లు 'పాలెగాళ్ళ' నే పేరుతో కర్కోటక యుద్ధ ప్రభువులుగా మారిపోయారు. సంపద పోగు చేయడం, అందుకోసం ఎంత హింసకయినా పాల్పడడం తప్ప మరే పాలనా బాధ్యతలు లేని వ్యవస్థ ఇది. గ్రామంలో అటువంటి దోపిడీదార్లు, దౌర్జన్యపరులు ఉండడం, వారి ప్రాపకంలో ఉండడం మినహా ప్రజలకు మరో గత్యంతరం లేకపోవడం అనంతపురం జిల్లా గ్రామాలకు కనీసం మూడువందల ఏళ్ళుగా అలవాటయిపోయింది. పాలెగాళ్ళ వ్యవస్థను అణచివేశానని బ్రిటిష్ ప్రభుత్వం చెప్పుకున్నా అది అప్పటికి అదృశ్యమై ఇటీవల మళ్ళీ తలెత్తింది.

పాత పాలెగాళ్ళు ప్రజల నుంచి దౌర్జన్యపూరితంగా సంపద పోగుచేసుకోవడంలో సిద్ధహస్తులు కాగా, కొత్త పాలెగాళ్ళకు కొత్త సంపద పోగుచేసుకునే మార్గంగా అభివృద్ధి నిధులు కనబడ్డాయి. తమకు గ్రామాల్లో ఉన్న ప్రాబల్యం వల్ల రాజకీయ నాయకులుగా కూడ ఎదిగిన ఈ కొత్త పాలెగాళ్ళు అనంతపురం దుస్థితిని చూపి ప్రభుత్వాల నుంచి అభివృద్ధి నిధులు సేకరించడం మొదలు పెట్టారు. ఈ అభివృద్ధి నిధులు పేదరికం నిర్మూలన, వ్యవసాయాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి, పనికి ఆహారం, కరవుపీడిత ప్రాంతాల అభివృద్ధి, ఎడారీకరణ నిరోధం, సామాజిక అడవుల పెంపకం, రహదారుల నిర్మాణం, తాగునీటి సౌకర్యాల కల్పన, వృద్ధాప్యపింఛన్ వంటి డజన్ల కొద్దీ పేర్లతో తరలి వచ్చాయి. ఏటేటా కొన్ని వందల కోట్ల రూపాయల చొప్పున ఇప్పటికి కొన్ని వేల కోట్ల రూపాయలు వచ్చి ఉంటాయి. ఈ నిధులలో ఎనభైశాతం తమ సొంతం చేసుకోవడం, ఏ ఇరవై శాతమో తమ ముఠా సభ్యుల, అనుచరుల కుటుంబాలకు ఇవ్వడంతో మాఫియా ముఠాల నాయకులు ఇబ్బడిముబ్బడిగా ఆస్తులు కూడబెట్టుకున్నారు.

పాత పాలెగాళ్ళ రోజుల్లో భూమి మాత్రమే ఆదాయ వనరుగా ఉండేది గనుక వాళ్ళు సాధారణంగా భూస్వాములే అయ్యారు. కొత్త పాలెగాళ్ళకు మాత్రం భూమితోపాటు ఇతర ఆదాయ వనరుల చాల వచ్చాయి. దేవాదాయ, ధర్మాదాయ భూములు, అటవీ భూములు, గ్రామ ఉమ్మడి భూములను ఆక్రమించుకుని, తమ సాయుధ బలగాల సాయంతో ఆ భూమి మీద అధికారం స్థిరపరచుకుని, దాన్ని ప్రధాన ఆదాయ వనరుగా ఉంచుకోవడం ఒక ఎత్తు. కొత్తగా

ఆదాయ మార్గాలను కనిపెట్టడం మరో ఎత్తు. ఉన్నకొద్ది పరిశ్రమలలో ట్రేడ్ యూనియన్ల మీద నాయకత్వం చలాయించి, పరిశ్రమాధిపతులను బెదరించి సొమ్ము చేసుకోవడం, జిల్లాలో ప్రభుత్వ కార్యక్రమాలన్నిటికీ మరెవరూ టెండర్లు వేయకుండా దౌర్జన్యంగా అడ్డుకొని తామే ఆ కాంట్రాక్టులు చేయడం లేదా కాంట్రాక్టు చేసేవారి నుంచి కమిషన్లు పొందడం, జిల్లాలో వాహనాల, సరుకుల అమ్మకాల డిస్ట్రిబ్యూషన్లు, ప్రైవేటు రవాణా వ్యవస్థ నడపడం, పట్టణాలలో కేబుల్ టివి వ్యవస్థను తమ గుప్పెట్లో పెట్టుకోవడం వంటి అనేక రంగాలలో జోక్యం ద్వారా ఈ కొత్త పాలెగాళ్లు తమ సంపదను పెంచుకుంటున్నారు. ఆ సంపదలో ఏ కొద్ది భాగాన్నో తమ అనుచరులకు, సాయుధ అంగరక్షకులకు విదిలిస్తూ తమ సామ్రాజ్యాన్ని కాపాడుకుంటున్నారు. ఇన్ని ఆర్థిక రంగాలలో ఆధిపత్యం ద్వారా, రాజకీయ పార్టీల అండదండల ద్వారా మొత్తంగా సామాజిక రంగస్థలంలో కూడ వీరే ప్రధాన పాత్రలుగా కొనసాగుతున్నారు. జిల్లాలో ప్రముఖులుగా ఎదిగిన మాఫియా ముఠానాయకులకూ, జిల్లాలో 'ఆధ్యాత్మిక గురువులు' గా చెప్పుకుంటున్న అక్రమ సంపదను సక్రమ సంపదగా మార్చే ద్రవ్య వ్యాపారులకూ కూడ సన్నిహిత సంబంధాలున్నాయి.

పాత పాలెగాళ్ళ రోజుల నుంచీ కొనసాగుతూ, కొత్త పాలెగాళ్ళు కూడ కొనసాగిస్తున్న సంప్రదాయం కులం బలం. పాత పాలెగాళ్ళు సర్వసాధారణంగా రెడ్డి లేదా వ్యవసాయ కుటుంబాల నుంచి వచ్చారు. బ్రిటిష్ పాలనా కాలంలో ఆ పాలెగాళ్ళ ప్రాబల్యం తగ్గిన తర్వాత మరిన్ని వ్యవసాయ కులాల నుంచి, ముఖ్యంగా కమ్మల నుంచి కొత్త పాలెగాళ్ళు పుట్టుకు రావడం మొదలయింది. అటూ ఇటూ రెడ్లే ముఠానాయకులుగా, కాంగ్రెస్‌లోనే వైరి పక్షాలుగా కొనసాగిన చరిత్ర మారిపోయి వైరుధ్యం రెడ్లకూ కమ్మలకూ మధ్య పెరిగిపోయి ఒక పక్షానికి కాగ్రెస్ ఆశ్రయమిస్తే, మరో పక్షానికి తెలుగుదేశం ఆశ్రయమిచ్చే పరిస్థితి తలెత్తింది. అటూ ఇటూ కూడ బోయలో, ఇతర వెనుకబడిన కులాలో, దళితులో అనుచరులుగా ఉండడం మొదలయింది.

1950ల నుంచీ బలమైన కమ్యూనిస్టు పోరాట సంప్రదాయం ఉన్న అనంతపురం 1970లలో నక్సలైటు రాజకీయాల ప్రభావంలోకి కూడ వచ్చింది. 1980ల నాటికి ఆ ప్రభావం వెనుక పట్టుపట్టగా పాలెగాళ్ళ సంస్కృతి మాజీ నక్సలైట్లను తనలోకి స్వీకరించింది. పాలెగాళ్ళ దౌర్జన్యం, మాజీ నక్సలైట్ల సమరశీలత కలిసి 1980ల తర్వాత జిల్లాలో విధ్వంసక ముఠాలు పుట్టుకొచ్చాయి. జిల్లాలో కనీసం డజను మాఫియా ముఠాలు తమను తాము ఎం.ఎల్. అనే విశేషణం తోనే పిలుచుకోవడం మొదలు పెట్టాయి. కులం, హింస, దారితప్పిన సమరశీల రాజకీయాలు కలగలిసిన ఒక విధ్వంసక పదార్థం అనంతపురంలో తయారయింది.

అనంతపురం మాఫియా ముఠాల బలంలో మరొక ముఖ్యమైన అంశం పంచాయితీలు. గ్రామీణ స్థాయిలో ప్రజల మధ్య వైరుధ్యాలను, ఘర్షణలను పరిష్కరించడానికి, పరిష్కార క్రమంలో ఇరు పక్షాల నుంచి ఎంతో కొంత రుసుముగా స్వీకరించడానికి పరిమితమవుతుండిన పంచాయితీలు క్రమక్రమంగా వాటి స్థాయిలోను, భౌగోళిక పరిధిలోను, చెల్లించవలసిన రుసుములోను విపరీతంగా పెరిగిపోయాయి. పాత భార్యాభర్తల తగాదాలు, ఇంటి సరిహద్దు, పొలం సరిహద్దు తగాదాలు, అన్నదమ్ముల ఆస్తి పంపకాలు వంటి ఘర్షణల స్థానంలో వందలకోట్ల రూపాయల ఆస్తులకు సంబంధించిన వివాదాలు ముందుకొచ్చాయి. అనంతపురం నగరం పెరిగిపోయి రియల్ ఎస్టేట్ తగాదాలు పెద్దవయ్యాయి. మాఫియా ముఠానాయకులు ఈ వివాద పరిష్కారాలను తమకు అతి పెద్ద ఆదాయ వనరుగా భావించారు. పరిటాల రవీంద్ర నడిపిన 'వెంకటాపురం పంచాయితీ' రాష్ట్ర వ్యాప్తంగా పేరుపొందింది. క్రమంగా అనంతపురం మాఫియా నాయకుల వివాద పరిష్కారాలు అనంతపురం నుంచి, రాయలసీమ నుంచి హైదరాబాద్ దాకా ఎదిగాయి. అక్రమంగా సంపాదించిన వందల కోట్ల రూపాయలతో వీరు ఇటు హైదరాబాద్, అటు బెంగళూరు, చెన్నైలలో స్థిరాస్థులు కూడ బెట్టడంతో వీరికి ఆ నగరాలలో కూడ మాఫియా కార్యకలాపాల విస్తరణ అవసరం వచ్చింది. ఆ రకంగా ఒక కరవు జిల్లా గ్రామాలలో పెత్తందార్లుగా మొదలయిన ఈ నాయకులు కనీసం మూడు రాష్ట్రాల మాఫియా ముఠా నాయకులయ్యారు. వారి అంగరక్షకులుగా, సైనికులుగా జీవనోపాధి సాధించుకుంటూ, కరవు నుంచి తమ కుటుంబాలను కాపాడుకోవడానికి అది ఒక్కటే మార్గమనుకున్న అనుచరులు కనుసైగతో కోట్లు సంపాదించుకోగల చోటా డాన్‌లయ్యారు.

అనంతపురం నుంచి, రాయలసీమ నుంచి, మన సామాజిక జీవితం నుంచి ఈ హంతక ముఠాలను తొలగించాలంటే ఈ భౌతిక వాస్తవికతను తొలగించాలి.

"మత వేదన వాస్తవ వేదనకు వ్యక్తీకరణే. అదే సమయంలో అది వాస్తవ వేదనపట్ల నిరసన కూడ. మతం అణచబడ్డ జీవి నిట్టూర్పు. హృదయంలేని ప్రపంచపు హృదయం. ఉత్సాహం లేని పరిస్థితుల ఉత్సాహం. అది ప్రజలకు మత్తుమందు" అని మార్క్స్ మతం గురించి చెప్పిన మాటలు అనంతపురంలో మాఫియాకు పూర్తిగా వర్తిస్తాయి. ఇక్కడ మతం అని ఉన్న చోటల్లా మాఫియా అని చదువుకుంటే, ఇవాళ ప్రజల భ్రమాజనిత ఉపాధిగా, ఆనందంగా, అవకాశంగా ఉన్న మాఫియాను రద్దు చేయాలంటే, దాన్ని పెంచిపోషిస్తున్న వ్యవస్థను రద్దు చేయవలసి ఉంటుంది. *

అనంతపురం అభివృద్ధి వెలుగునీడలు

-ఎన్. వేణుగోపాల్

ఒక సాహిత్యవిమర్శ పుస్తకం ఆవిష్కరించడానికీ, స్థానిక కథాశిక్షణా శిబిరంలో మాట్లాడి, యువ కథకుల కథల మీద అభిప్రాయాలు చెప్పడానికీ జిల్లా రచయితల సంఘం ఆహ్వానం మీద అనంతపురం వెళ్ళి రెండు రోజులు గడిపాను.

అనంతపురం చాలవేగంగా మారుతున్నది. చంద్రబాబునాయుడు మాట్లాడే భాషలో చెప్పాలంటే అభివృద్ధి పథంలో ముందుకు పోతున్నది. నగరంలో ఎక్కడ చూసినా భవన నిర్మాణ కార్యక్రమాలే కనబడి ఆశ్చర్యపోయాను. అన్ని ముఖ్యమైన కూడళ్ళలోను పాత భవనాలను కూల్చివేసి కొత్త కొత్త బహు అంతస్తుల హార్మ్యాలు నిర్మిస్తున్నారు. ఎన్నో ఏళ్ళుగా నాకు పరిచయమైన కూడళ్ళన్నీ పోల్చుకోవడానికి వీలులేని కొత్త అలంకారాలు చేసుకున్నాయి. ఊళ్లో ఒకే ఒక్క పాత రైల్వే ఓవర్‌బ్రిడ్జి మినహా ఫ్లైఓవరు రాలేదనేగాని, మిగతా దృశ్యమంతా హైదరాబాద్‌లాగానే ఉన్నది. హైదరాబాద్‌ను చూసి అమాయకులూ, చూపెట్టి నాయకులూ మాయకులూ 'అభివృద్ధి' కీర్తనలు పాడుతున్నట్టుగానే అనంతపురాన్ని చూసీ పాడుకోవచ్చు.

ఈ 'అభివృద్ధి' వెలుగుకి అనంతపురంలో అందరికీ తెలిసిన నీడలున్నాయి. ఏ భవనాన్ని ఏ రాజకీయ నాయకులు ఎట్లా ఆక్రమించారు, రాజకీయ నాయకుల పేరుమీద సాగుతున్న మాఫియా ముఠాల నాయకులు ఏయే భవనాల సొంతదార్లను ఎట్లా బెదరించి ఖాళీ చేయించారు, ఎవరి డబ్బులతో ఎవరి బేనామీగా వేరెవరు ఆ ఆకాశ హర్మ్యాలను లేపుతున్నారు-అనంతపురం వీథుల్లో బహిరంగ రహస్యంగానే ఉన్నాయి. హింస, దౌర్జన్యం, ఆక్రమణ, సినిమా, రియల్ ఎస్టేట్, వ్యాపారం, రాజకీయం కలగలిసిన పునాదిమీద అక్కడ బహు అంతస్తుల కాంప్లెక్సులు లేచి నిలుస్తున్నాయి.

ఈ ఆడంబరమూ ఆర్భాటమూ అరాచకమూ అనంతపురం నగరాన్ని ముట్టడిస్తుండగానే, ఆ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల నుంచి రోజుకొక బలవన్మరణపు పాడె లేస్తున్నది. ఒకవైపు అనంతపురం నగరం రంగురంగుల అనంతస్వప్నాల్ని కంటుండగానే, చుట్టూ పల్లె సీమల నుంచి కాలిపోయిన కలల కమురు వాసనలు చుట్టుముడుతున్నాయి. ఒక వంక నగరం నవనవోన్మేషమవుతున్నట్టు రంగులు అద్దుకుంటుండగానే జిల్లా మొత్తం ఎడారి అయిపోయే దిశగా పరుగులు పెడుతున్నది.

గత ఏడు సంవత్సరాలుగా రాష్ట్రంలో ఏలినవారు ప్రకటిస్తున్న 'అభివృద్ధి' అన్ని చోట్లా ఇట్లాగే వున్నది. నగరాలు, జిల్లా కేంద్రాలు, పట్టణాలు తళతళలాడే రోడ్లు తెచ్చుకున్నాయి. ఫ్లైఓవర్లు వచ్చాయి. పాత భవనాలు కూలగొట్టడం, పట్టణాల నడిబొడ్డుల్లో బహు అంతస్తుల వాణిజ్య కేంద్రాలు, అపార్ట్‌మెంట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. ప్రతి పట్టణంలోనూ బహుళజాతి సంస్థల సరుకులు అమ్మే ఆకర్షణీయమైన, మిరుమిట్లుగొలిపే దుకాణాలు పుట్టుకొచ్చాయి. ప్రతిపట్టణంలోకీ కొత్త కొత్త రకాల కార్లూ ద్విచక్ర వాహనాలూ తరలివచ్చాయి. ప్రతి పట్టణంలోనూ ఈ కొత్త సౌకర్యాలను, విలాసాలను అనుభవించే సంపన్న, మధ్యతరగతి వర్గాలు పుట్టుకొచ్చాయి. ఈ కొత్త విలాసావసరాలు తీర్చుకోవడానికి అక్రమ ధనార్జనా మార్గాలు పెరిగిపోయాయి. ఈ అభివృద్ధి అంతా రియల్ ఎస్టేట్, ఫైనాన్స్, మాఫియా వ్యాపారాల చుట్టూ తిరగడం మొదలయింది.

అట్లని నగరాలలో యావన్మందికీ ఈ సౌకర్యాలు అందుతున్నాయని కాదు. తళతళలాడే రోడ్లు ప్రధాన రహదారుల్లోనూ, వ్యాపార కూడళ్ళలోను మాత్రమే ఉంటాయి. ఆ రోడ్డు దిగి పక్క సందులోకి మళ్ళితే గతుకులూ కంపూ పెంట కుప్పలూ మనకు తెలిసిన దృశ్యం యథావిధిగానే పలకరిస్తుంది. అదే నగరపు తళుకు బెళుకుల బహుళజాతి సంస్థల సరుకుల అంగళ్ళలో వేలూ లక్షల రూపాయలు అలవోకగా ఖర్చు పెట్టే మహానుభావులుండగానే, కూతవేటు దూరంలో పావలాకూ అర్ధకూ ప్రాణాన్నీ ఆత్మాభిమానాన్నీ తాకట్టు పెట్టగల దారిద్ర్యం తాండవిస్తోంది. రోడ్లమీద అభివృద్ధి వెలుగులు ప్రవహిస్తుండగా, ఆ వెలుగులు ఏ ఐదు శాతం మందికో, పదిశాతం మందికో సకల భోగాలు కల్పిస్తుండగా, రోడ్డు దిగితే నగరాలలో కూడా అభివృద్ధి చీకట్లు విస్తరిస్తున్నాయి. నూటికి తొంబైమందికి ఆకలిరోగం దుఃఖం అజ్ఞానం తప్పడం లేదు సరికదా పెరిగిపోతున్నాయి.

ఈ అభివృద్ధి చీకటి ముసురుతున్న దృశ్యం గ్రామీణ ప్రాంతాలలో మరింత ఎక్కువ కనబడుతుంది. ఒక్క అనంతపురం జిల్లానే తీసుకొంటే 2000-01 సంవత్సరాలలో మొత్తం రాష్ట్రంలో ఆత్మహత్య చేసుకున్న రైతులలో అనంతపురం రైతుల వాటా దాదాపు మూడోవంతు. ఆ రెండు సంవత్సరాలలో రాష్ట్రంలో మొత్తం మీద 315 రైతులు ఆత్మహత్య చేసుకున్నారనుకుంటే, కేవలం అనంతపురం జిల్లాలో 95 మంది ఆత్మహత్య చేసుకున్నారు. ఈ లెక్కలు నిజానికి జరిగిన అన్ని ఆత్మహత్యలనూ పరిగణనలోకి తీసుకొన్నవి కావు. నిజంగా జరిగిన రైతుల, వారి కుటుంబసభ్యుల ఆత్మహత్యలలో ఏ సగమో, ముప్పాతికో నమోదయి ఉంటాయి.

ఈ సంవత్సరం మూడునెలలు గడవకుండానే అనంతపురం జిల్లాలో బలవన్మరణాల పాలయిన రైతుల సంఖ్య 22 నుంచి 69 దాకా ఉంటుందని పరిశీలకులు ప్రకటిస్తున్నారు. వీటిలో

కనిష్టసంఖ్యనే పరిగణనలోకి తీసుకున్నా పరిస్థితి ఈ సంవత్సరం మరింత దారుణంగా ఉన్నదని అర్థమవుతుంది.

అనంతపురం జిల్లాలో వర్షపాతం తక్కువ కావడం వల్లనే *ఎడారిగా మారిపోతూ ఈ వ్యవసాయరంగ దుస్థితి సంభవిస్తున్నదని* తప్పంతా ప్రకృతి మీదికి నెట్టివేసే ఒక ప్రయత్నం చాలా కాలంగా జరుగుతున్నది. పాలకవర్గాలూ, ప్రభుత్వమూ చేస్తున్న ఈ ప్రచారాన్ని మేధావులూ, అమాయకులూ కూడా ఎంతో కొంత నమ్ముతున్నారు. అనంతపురం వ్యవసాయ సంక్షోభంలో ప్రకృతి పాత్ర లేదనికాదు. కాని ప్రకృతి వైపరీత్యానికి ఎన్నోరెట్లు ఎక్కువగా పాలకవిధానాలు అనంతపురాన్ని కరవు కోరల్లోకి నెట్టాయి. గ్రామీణ ఆర్థిక జీవనాన్ని అతలాకుతలం చేశాయి. రైతులను ఆత్మహత్యలవైపు తోశాయి. మరీ ముఖ్యంగా గత పది సంవత్సరాల నూతన ఆర్థిక విధానాలు అనంతపురం రైతుల ఆత్మహత్యలకు బాధ్యత వహించవలసి ఉంటుంది.

విజయనగర సామ్రాజ్యకాలంలో లెక్క లేనన్ని చెరువులతో పంటలసాగు సాగిన అనంతపురం జిల్లా ఏయే పాలకుల నిర్లక్ష్యానికి ఎట్లెట్లా బలి అయిపోయి చిన్న తరహా నీటి పారుదల సౌకర్యాలు పోగొట్టుకున్నదో చరిత్ర తవ్వి లెక్కలు తీయాలి. సముద్రాలు అని పేర్లు పెట్టుకున్న ఆ చెరువుల గ్రామాలన్నీ ఇప్పుడు పేరుకు సముద్రాలుగా మిగిలిపోయి బీడు భూములయిపోయాయి. ఇంకొక కొత్త చెరువు తవ్వడానికి వీలులేని పద్ధతిలో సమగ్ర అవగాహనతో చెరువులు నిర్మించారని ఘనతకెక్కిన విజయనగర ప్రభువుల పాటి వివేకాన్ని కూడా ఆ తర్వాతి పాలకులు పాటించకపోవడంతో చెరువులూ పంటపొలాలూ నెర్రెలు విచ్చాయి. అందువల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. 'అంత మంచి పెన్న తల్లి' కన్నతల్లి ఎండిపోయింది. ఇతర సెలయేళ్ళన్నీ ఎండిపోయాయి. ఈ చరిత్రకంతటికీ పర్యవసానంగా అనంతపురం జిల్లాలో ఎడారి విస్తరించడం మొదలయింది.

తమ జిల్లాలోని నేలల గురించి, అడుగంటిపోతున్న జలాల గురించి అవగాహనతో, కొత్తనీటి పారుదల సౌకర్యాలు కల్పించలేని పాలకుల నిర్లక్ష్యం పట్ల స్పృహతో అనంతపురం రైతులు తక్కువ నీరు అవసరమైన పంటలలోకీ, ఇతరేతర వ్యవసాయాధార వృత్తుల్లోకి ప్రవేశించారు. ప్రభుత్వం నుంచి ఏ సహాయమూ అందకపోయినా తమంత తామే పాతాళగంగను తోడి పంటలు పండించడం ప్రారంభించారు. మల్బరీ తోటలు వేసి పట్టు పురుగుల పెంపకం చేపట్టారు. మార్కెట్ ఆకర్షణలకు లొంగిపోయి చీనీతోటలు వేశారు. వేరుశనగనే ప్రధాన పంటగా మార్చుకున్నారు.

అటు ప్రకృతి, ఇటు ప్రభుత్వ విధానాలు, అటు చరిత్ర, ఇటు రాజకీయాలు దగా చేసిన అనంతపురం వ్యవసాయ జీవితాన్ని చిన్నాభిన్నం చేయడానికి వచ్చాయి నూతన ఆర్థిక విధానాలు. అప్పటికే అంతంత మాత్రంగా సాగుతున్న అనంతపురం వ్యవసాయం ఈ కొత్త ఆర్థిక సంస్కరణలతో కుప్పకూలిపోయింది. ప్రభుత్వం నామమాత్రంగానైనా అందించే సహాయ, సహకారాలు, రాయితీలు, సబ్సిడీలు రద్దయిపోవడంతో వ్యవసాయం అతి ఖరీదయిన జూదంగా *మారిపోయింది.* దేశప్రజల అవసరాలతో సంబంధం లేకుండా వంట నూనెలు, ప్రత్యేకించి పామాయిల్ దిగుమతి చేసుకోవడం ప్రారంభించడంతో దేశవ్యాప్తంగా నూనెగింజల వ్యవసాయం మీద గొడ్డలివేటు పడింది. వేరుశనగ పంటలో అగ్రభాగాన నిలిచిన అనంతపురం మొదలునరికిన చెట్టయిపోయింది.

ఒకవైపు పంట నష్టాలు, ఒకవేళ పంట సరిగా పండినా మార్కెట్ లేకపోవడం, మరోవైపు రోజురోజుకూ గిట్టుబాటు ధర రాని పరిస్థితి పెరిగిపోవడం-అన్నీ కలిసి అప్పులు విపరీతంగా పెరిగిపోవడంతో అనంతపురం రైతు ముందు ఆత్మహత్య తప్ప గత్యంతరం లేని స్థితి ఏర్పడింది.

ఈ ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతులు ఎవరు? అనంతపురం జిల్లా జనవిజ్ఞాన వేదిక ప్రకటించిన ఒక నివేదిక ప్రకారం, ఆత్మహత్యలకు పాల్పడిన రైతుల కుటుంబాలను పరామర్శించిన ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం నిజనిర్ధారణ కమిటీ చెపుతున్న ప్రకారం, ఈ బలవన్మరణాల పాలవుతున్న వారిలో ఎక్కువమంది యువకులు, వెనుకబడిన కులాలకూ బలహీన వర్గాలకూ చెందినవాళ్ళు, అప్పుల బారిన పడిన కుటుంబాలలో చదువుకుంటున్న విద్యార్థులు, పెళ్ళికావలసిన ఆడపిల్లలు.

ఒక్క మాటలో చెప్పాలంటే భవిష్యత్ తరం ఇవాళ ఆత్మహత్యలను ఒక పరిష్కారమార్గంగా చూస్తున్నది. స్వప్నాలతో, ఆదర్శాలతో, ఉత్సాహంతో ఉరకలు వేయవలసిన ఒకతరం ఇవాళ నిరాశానిస్పృహలతో బతుకు భారమై ఆత్మహత్య తప్ప మరొక మార్గం లేదనుకుంటున్నది.

ఈ ఆత్మహత్యలకు కారణమైన పాలకవర్గాలు మాత్రం ఆత్మహత్యలకు ముందు ఎంత మొరటుగా, మూర్ఖంగా, హృదయం లేనట్టుగా ప్రవర్తించాయో, విలువైన ప్రాణాలు పోయిన తరువాత కూడ అంతకన్న దారుణంగా ప్రవర్తిస్తున్నాయి. మానవప్రాణం తనను తాను రద్దు చేసుకున్న చోటనయినా ఒక సానుభూతి వచనం పలకలేనంత, ఒక కన్నీటి బొట్టు రాల్చలేనంత దుర్మార్గస్థితికి చేరుకున్నాయి మన పాలకవర్గాలు.

జిల్లా అంతటా అత్యధిక జనానికి అడియాసలయిపోతున్న ఆశలకు ప్రత్యామ్నాయంగా ఓ పిడికెడు మందిని నగరంలో ఆకర్షణల మత్తులో ముంచి 'ఇదే అభివృద్ధి' అంటున్నారు పాలకులు. తగలబడిపోతున్న జిల్లా ప్రజాజీవితంలోంచి నగరాలకూడళ్ళలో వెలుగులు సమకూర్చుకుంటున్నారు ఏలినవారు. ఎప్పటికీ అభివృద్ధి వెలుగు నీడలకు పరిష్కారం?

(ప్రజాతంత్ర, మార్చ్ 31 - ఏప్రిల్ 6, 2002)

*

ప్రస్తుతం

వై ఎస్ చైనా పర్యటన

-దిగుమర్తి నరసింహారావు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డా॥ వై.ఎస్. రాజశేఖరరెడ్డి ఆరు రోజులు ప్రజాచైనా పర్యటన రాష్ట్రంలోని వివిధ వర్గాలలో కొంత సంచలనం సృష్టించింది. ఇదివరకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు, అమెరికా సంయుక్త రాష్ట్రాలు, యూరప్‌లోని కొన్ని దేశాలు పర్యటించి, అక్కడ పారిశ్రామికవేత్తలను ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలు స్థాపించమని కోరారు. మొట్టమొదట సారిగా తెలుగుదేశం పార్టీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆగ్నేయ ఆసియా దేశాలు, ప్రధానంగా సింగపూరు, మలేషియాలను సందర్శించి, ఆ దేశాలు అభివృద్ధి చెందిన పంథా ఎంతమేరకు ఆంధ్ర రాష్ట్ర సర్వతోముఖ అభివృద్ధికి తోడ్పడుతుందో అధ్యయనం చేసి, విజన్ 2020 అనే దార్శనిక పత్రాన్ని తయారు చేశారు. కాని ఈ పర్యటనలు ఏవీ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి చైనా పర్యటన రేకెత్తించిన ఆలోచనలు ప్రజలలోను, ముఖ్యంగా ఆర్థిక విశ్లేషకుల్లోను, పత్రికలలో, రేకెత్తించలేదు. కారణం ఇంతవరకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు పర్యటించిన దేశాలు అన్ని పెట్టుబడిదారీ పంథానే (కేపిటలిస్టుపాత్) వీటి అభివృద్ధిలో అనుసరించాయి. కాని చైనాలో అధికారంలో వున్నది కమ్యూనిస్టు పార్టీ. అంతేకాదు భారతదేశం స్వాతంత్ర్యం సాధించిన రెండేండ్ల తరువాత (1949)లో చైనా దేశంలో సామ్రాజ్యవాదుల తాబేదారుగా పేరుపొందిన కొమింటాంగ్ నాయకుడు, చాంకైషేక్ ప్రభుత్వాన్ని విప్లవం ద్వారా పారద్రోలి చైనా కమ్యూనిస్టుపార్టీ, ప్రభుత్వాధికారాన్ని కైవసం చేసుకొని భూస్వామ్య వ్యవస్థను కూకటి వేళ్ళతో ఊడబెరికి, సోషలిస్టు వ్యవస్థను స్థాపించడానికి మావ్‌సెటుంగ్ చౌ-ఎన్-లై నాయకత్వంలో పునాదులు వేసి, దానిని ఆధారం చేసుకొని గత 55 సంవత్సరాలలో ఆర్థిక, రాజకీయ, సాంఘిక రంగాలలో ఎనలేని అభివృద్ధి సాధించి, ప్రపంచంలో కల్లా ధనవంతమైన దేశం అయిన అమెరికా సంయుక్త రాష్ట్రాలకు దీటుగా పోటీగా నిలచి, సోషలిస్టు వ్యవస్థ ఆధిక్యాన్ని ప్రదర్శించింది. అయితే ఈ అభివృద్ధి సాధించడంలో, సోవియట్ యూనియన్‌లో సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ స్థాపన, 75 సంవత్సరాల తరువాత దాని పతనం నుంచి అనేక గుణపాఠాలు నేర్చుకొని, మావ్‌సెటుంగ్ తదనంతరం అధికారంలోకి వచ్చిన చైనా కమ్యూనిస్టు నాయకులు, సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ సాధనలో కొన్ని మార్పులు చేర్పులు చేస్తూ వచ్చారు. ఈ మార్పులు చేర్పులు ఎంతవరకు సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ, సామాజిక స్థాపనకు దోహదం చేస్తాయో అన్నది, కొంత చర్చనీయాంశమైనా, చైనాలో నిర్మాణంలో వున్న ఆర్థిక వ్యవస్థ, పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థకు భిన్నంగా వుందన్న విషయం ఎవ్వరూ కాదనలేరు.

అంతేకాదు చైనా దేశానికి భారతదేశానికి చాలా విషయాలలో పోలిక వుంది. రెండూ స్వాతంత్ర్యం సంపాదించిన నాటికి ప్రధానంగా వ్యవసాయం పై ఆధారపడిన దేశాలు. రెండువేల సంవత్సరాల చరిత్ర, సాంస్కృతిక వారసత్వంగల దేశాలు. రెండు దేశాల జనాభాలు మిగతా ఏ దేశాలకన్నా ఎక్కువే. భారతదేశం జనాభా 100 కోట్లు అయితే, చైనా జనాభా 100 కోట్లకు పైబడింది. రెండు దేశాలలో పుష్కలంగా నదులు వున్నాయి. అందుచేత చైనాదేశం అభివృద్ధి చెందడానికి సహాయపడిన విధానాలలో కొన్నిటినైనా, మనరాష్ట్రం, దాని పరిస్థితులకు అనుకూలంగా మలచుకొని అనుసరిస్తే, రాష్ట్ర అభివృద్ధి త్వరితగతిన సాధించడానికి వలను పడుతుందేమోనన్న సదుద్దేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి చైనాలో పర్యటించారు. మన రాష్ట్రం ప్రధానంగా వ్యవసాయిక రాష్ట్రం కాబట్టి, రాష్ట్ర వ్యవసాయ మంత్రిని, వ్యవసాయ అభివృద్ధి చాలా వరకూ నీటిపారుదల సదుపాయం మీద ఆధారపడి వుంటుంది కాబట్టి, నీటిపారుదల శాఖామంత్రిని తమతో తీసుకొని వెళ్ళారు. ఆయన అందుచేత చైనాలో ప్రధానంగా అధ్యయనం చేసింది అక్కడ వ్యవసాయ పద్ధతులు, నీటిపారుదల విధానం, పట్టణ, గ్రామాల మధ్యనున్న వ్యత్యాసాలు, అంతే కాకుండా, ఆర్థిక అభివృద్ధి సాధించడానికి అవసరమైన మౌలిక సదుపాయాలు (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇండస్ట్రీస్). ముఖ్యంగా చైనా దేశంలో బాగా పెద్ద పట్టణం అయిన షాంగై సందర్శించి, అక్కడ రోడ్లు, రవాణా, జనసమ్మర్దం మున్నగు వాటిని పరిశీలించారు.

ఇదివరకు భారతదేశం నుంచి అనేకమంది రాజకీయ నాయకులు, ఇతరులు చైనాను సందర్శించారు. వారు కేవలం సుహృద్భావ పర్యటనలు, కొంత వినోదం కోసం, మరికొంత కమ్యూనిస్టు దేశం ఎలాగ వుంటుందో అన్న కుతూహలంతోను చూడ్డానికి వెళ్ళారు. అంతేకాని అక్కడ చైనా ప్రభుత్వం వివిధ రంగాలలో తీసుకొంటున్న చర్యలలో కొన్నిటినైనా మనదేశంలో అమలు చేయడానికి వీలుంటుందా అన్న లక్ష్యంతో ఆ దేశంలో పర్యటించ లేదు. అందుచేత వెళ్లిన రాజకీయ నాయకులు, మేధావులు, ఇంకా ఇతరులు చైనా ఆర్థిక, ముఖ్యంగా పారిశ్రామిక,

ఆరోగ్య, వైద్య, విద్యారంగాలలోను ఇతరత్రా సాధించిన విజయాలు చూసి విస్తుపోయారు. అనేక విధాలు కొనియాడారు. చైనాదేశం కమ్యూనిస్టు దేశం. ఏకపార్టీ పరిపాలన. భారతదేశం ప్రజాస్వామ్యదేశం. వివిధ రాజకీయ పార్టీలు ప్రజలను చైతన్య పరుస్తున్నాయి. ఈ మౌలిక భేదాల వలన చైనా అభివృద్ధి సాధించిన విధానం మనదేశంలో సాధ్యం కాదన్న నిశ్చయ అభిప్రాయం వెలిబుచ్చారు.

అందుకు భిన్నంగా, ఆంధ్రప్రదేశ్‌తో, చైనా దేశంలో సరిపోల్చదగ్గ, స్థలాలను, ముఖ్యంగా వ్యవసాయానికి సంబంధించినవి చూసి, అక్కడ పరిస్థితులను, రీతులను, వ్యవసాయ పద్ధతులను అర్థం చేసుకొని, వాటిలో ఏవి ఆంధ్రప్రదేశ్‌కు అన్వయించగలవో, వాటిని మరింత విస్తృతంగా, లోతుగా శాస్త్రీయపరంగా పరిశీలించాలన్న సలక్షణమైన లక్ష్యంతో ముఖ్యమంత్రి చైనా యాత్ర చేశారు.

వై.ఎస్.ఆర్ చైనా నుండి తిరిగి వచ్చిన తరువాత తన అనుభవాలను, తన ఉద్దేశాలను అరమరికలు లేకుండా పత్రికల వారికి వివరించారు. వివిధ పాత్రికేయులు వేసిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ, తనను చైనా వ్యవసాయంలో బాగా ఆకర్షించిన విషయం, ముఖ్యంగా సరాసరి సాగువిస్తీర్ణం తక్కువగా ఉన్నా, సామూహిక వ్యవసాయం చేయడం వలన ఎక్కువ ప్రయోజనం కలుగుతుందని, ఆధునిక యంత్రాలను, వ్యవసాయంలో ఎక్కువగా వినియోగిస్తున్నారని అన్నారు. ఆహార ధాన్యాల హెక్టారు ఉత్పత్తి (పెర్ హెక్టార్ ఈల్డ్) ఆంధ్రప్రదేశ్‌లో కన్నా రెండింతలు వుందన్నారు. చైనాలో హెక్టారుకు 6350 కేజీల ఉత్పత్తి వుంటే, భారతదేశంలో ఆ ఉత్పత్తి 2964 కేజీలు మాత్రమే. గ్రామీణ ప్రాంతాల్లో మిగులు వున్న వ్యవసాయ కార్మికులను, పట్టణాల్లోని పరిశ్రమలలోకి పంపారని, అది ప్రణాళికాబద్ధంగా జరిగిందని అన్నారు. అంతేకాదు. గ్రామీణ పట్టణ ప్రాంతాల మధ్య అభివృద్ధిలో తేడా ఎక్కువగా వుందన్నారు. ఈ తారతమ్యం తగ్గించడానికి, వ్యవసాయంపై ఉన్న పన్నులను రద్దుచేయడంతో పాటు, రైతులకు నేరుగా ముదరాలు (సబ్సిడీలు) అందచేస్తున్నారు. పట్టణాలపై కేంద్రీకరించి, రైతులను గ్రామాలను నిర్లక్ష్యం చేయకూడదని తను గ్రహించాను అన్నారు. వ్యవసాయోత్పత్తులను మన రాష్ట్రంలో అధికం చేయడానికి ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకోవాలని, ఇందుకోసం వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ప్రత్యేక విభాగం (సెల్) ఏర్పాటు చేసి, చైనా స్థాయికి ఉత్పత్తులు పెంచడానికి ప్రయత్నించే అవకాశాలు పరిశోధించమని కోరుతామన్నారు. గ్రామీణ జీవనోపాధిపై ఎక్కువ దృష్టిని పెట్టవలసిన అవసరం వుందని, వ్యవసాయంతో పాటు, ఇతర ఉత్పత్తులపై కేంద్రీకరిస్తామన్నారు. ఈ విషయాలపై సంబంధిత అధికారులతో చర్చలు జరుపుతామన్నారు. చైనా దేశంలో మేఘమథనం (క్లౌడ్ సీడింగ్) 40 ఏళ్ళుగా జరుగుతున్నదన్నారు. ఈ విషయంలో కూడా దానికి సంబంధించిన నిపుణులతో మాట్లాడి, ఇతర దేశ అనుభవాలతో మనదేశ అనుభవాలను క్రోడీకరించి మెరుగైన ఫలితాలు సాధించడానికి ప్రయత్నాలు చేస్తామన్నారు. అలాగే మార్కెట్ యార్డులను కూడా చూశామని, అక్కడ మార్కెట్ యార్డులలో మౌలిక వసతులు చాలా మెరుగ్గా ఉన్నాయన్నారు.

ముఖ్యమంత్రి ముఖ్యంగా గ్రామీణ వ్యవస్థ, వ్యవసాయంపై తన అధ్యయనం కేంద్రీకరించినా, నీటిపారుదల పథకాలపై కూడా ఆయన కొంత శ్రద్ధ చూపించారు. ముఖ్యంగా బహుళార్థ సాధక ప్రాజెక్టు అయిన "త్రీగోర్జెస్" ఒక అద్భుతమని ముఖ్యమంత్రి అభివర్ణించారు. రూ. 90,000 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టు 1994లో ప్రారంభం అయిందని, ఇప్పటికి సగం పూర్తి అయిందని, మరో నాలుగు సంవత్సరాలలో పూర్తి కాగలదని అన్నారు. ప్రాజెక్టు యాంగ్సీనదిమీద నిర్మాణం జరుగుతున్నది. వరద నియంత్రణతో పాటు 18,200 మెగావాట్ల విద్యుత్‌శక్తి, 40 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడం ప్రాజెక్టు లక్ష్యం. ఈ ప్రాజెక్టు వలన రవాణా సౌకర్యం పెరిగిందని, రవాణా వ్యయం 30 శాతం తగ్గిందని వై.ఎస్.ఆర్. చెప్పారు. తన చైనా పర్యటనలో ఆంధ్రప్రదేశ్ నుంచి చైనా దేశానికి ఏవైనా సరుకులు ఎగుమతి చేయగల అవకాశాలపై కూడా కొంత శ్రద్ధ వహించి, ఆహార ఉత్పత్తులు, పండ్లు మున్నగునవి ఎగుమతి చేసే అవకాశాలున్నాయని, ఫుడ్‌ప్రాసెసింగు, మందులకు సంబంధించిన పరిశ్రమలు మన రాష్ట్రానికి వచ్చే అవకాశముందని అభిప్రాయం వెలిబుచ్చారు.

మిగతా విషయాలు ఎలాగున్నా, చైనాలో హెక్టారు దిగుబడి స్థాయి, మన రాష్ట్రంలో, దేశంలో దిగుబడి స్థాయికి రెండింతలు వున్న విషయం సాధ్యమైనా, అంత స్థాయిలో మన రాష్ట్రంలో కాని దేశంలో కాని సాధించడం సాధ్యమా అన్నది కొంత చర్చనీయాంశం అయ్యింది. అంత సులువుగా సాధ్యం కాదన్న వారు చైనాలోని వ్యవసాయం పెద్ద కమతాలు (వందలు, వేల ఎకరాలు) సామూహిక పద్ధతిలో సాగుచేస్తున్నారు కాబట్టి అక్కడ వ్యవసాయం వీలైనంత వరకు యాంత్రీకరణ చేయబడింది. కాని మనదేశంలో భూ కమతాలు అన్నీ చిన్న చిన్నవి, భూసంస్కరణల తరువాత తరిపంటలు ప్రధానంగా వరి పండించే కుటుంబ వ్యవసాయ భూమి పరిమితి 25 ఎకరాలకు మించరాదని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ భూముల పరిమితి చట్టం

నిర్దేశిస్తున్నది. అందుకే మొదట నుంచి భారత వ్యవసాయ శాస్త్రజ్ఞులు, జపాన్ దేశాన్ని ఆదర్శంగా తీసుకొని, సాంద్ర వ్యవసాయ (ఇన్‌టెన్సివ్) చేపట్టడం మంచిది అన్న అభిప్రాయానికి వచ్చారు. అంటే ఎక్కువ మోతాదులో ఎరువులు, ప్రశస్తమైన విత్తనాలు, కావలసినంత నీరు మున్నగునవి అవసరం. దీని వలన ఎకరా పెట్టుబడి ఎక్కువ అవసరం. కాని ఈ అభిప్రాయం బాగా పాతుకుపోయింది. అదీ కాకుండా, చైనా దేశం ఆర్థిక వ్యవస్థకి భారత ఆర్థిక వ్యవస్థకి చాలా భేదముంది. ఎందుకంటే, చైనా దేశంలో "వార్‌లార్డ్స్" ఇంకా పెద్ద పెద్ద భూస్వాముల భూములను కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడిన తరువాత కైవసం చేసుకొని, సాముదాయక లేక సమష్టి వ్యవసాయాన్ని, కమ్యూన్ల ద్వారా ప్రవేశపెట్టడం ద్వారా విస్తృత (ఎక్స్‌టెన్సివ్) వ్యవసాయం సాధ్యమైందని కొందరి అభిప్రాయం. ఇది వాస్తవమే అయినా, చైనా దేశంలో సాగుకు అనుకూలమైన భూమి, భారతదేశంలో కన్నా బాగా తక్కువ. అంతే కాకుండా చైనాలో వాతావరణ పరిస్థితులు కూడా వ్యవసాయానికి చాలా ప్రాంతంలో అనుకూలంగా లేవు. విస్తృత వ్యవసాయం కన్నా వ్యవసాయ పద్ధతులలో చైనా అవలంబిస్తున్న కొన్ని పద్ధతులను మనదేశంలో అమలు చేయవచ్చు. నీటిపారుదల పథకాల క్రింద లభ్యమయ్యే నీరుని, డ్రిప్ ఇరిగేషన్ లేక స్ప్రింక్లింగ్ ఇరిగేషన్ (అంటే పైపు గొట్టాల ద్వారా నీటి చుక్కలు భ్రమిస్తున్న చక్రాల గుండా విస్తృతంగా వెదజల్లడం) ద్వారా పొదుపు చేసి, లభ్యమై నీరును ఇప్పటి కన్నా కొన్ని రెట్లు అధిక వైశాల్యంలో పంటలకు నీరు లభ్యమయ్యేటట్లు చేయవచ్చు.

అన్నిటికన్నా ముఖ్యమైన విషయం చాలామంది వ్యవసాయ ఆర్థిక వేత్తలు మరచిపోయినట్లున్నారు. భూమిలేని పేదలకు, హరిజనులకు, 1957 తరువాత ఆంధ్రప్రదేశ్‌లో భూపంపకం పథకాలు అమలు చేయు సందర్భంలో, అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం, ఈ భూమి పట్టాలు పుచ్చుకొన్న హరిజనులు, పేద రైతులకు, సహకార వ్యవసాయ పద్ధతులను బోధపరిచి, సహకార వ్యవసాయం ప్రోత్సహించాలని నిశ్చయించింది. అంతేకాదు కొన్ని సందర్భాలలో ముఖ్యంగా లంక భూముల విషయంలో జాయింట్ ఫార్మింగ్ (ఉమ్మడి వ్యవసాయం) అమలు చేస్తే బాగుంటుందని అభిప్రాయ పడింది. ఈ లక్ష్యంతో కొన్ని సహకార వ్యవసాయ క్షేత్రాలు, జాయింట్ ఫార్మింగ్ సొసైటీస్ ఏర్పడ్డాయి. 1960-70 సంవత్సరాల మధ్య, రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ సమావేశాలలో, వివిధ పద్దుల క్రింద సమర్పించే, వివరాల పద్దులో (నోట్సు) ఈ విషయాల గురించి ప్రస్తావిస్తూ వుండే వారు. కాని ఎందుచేతనో ఈ విషయంలో, వ్యవసాయశాఖకి, సహకార శాఖకి, అసలు ప్రభుత్వానికి, అనధికార వ్యవసాయ సంస్థలకు ఉత్సాహం రాను రాను తగ్గిపోయింది. పీజెంట్ ప్రొప్రైటర్ షిప్ (చిన్న చిన్న కమతాల భూ కామందులు) ప్రోత్సహించడం జరిగింది. దాని ప్రభావమే నేడు చాలామంది చిన్న, సన్నకారు రైతులు రుణగ్రస్తులై ఆత్మహత్యలకు కూడా లోనౌతున్నారేమోనన్న అనుమానం లేకపోలేదు. ఎందుకంటే వున్న భూమి చిన్నది. అందులో వరి పండిస్తే వచ్చే ఆదాయం తక్కువ. కాని వాణిజ్య పంట అయిన పత్తి కూడా తరిపంటగా పండించడం వలన దిగుబడి ఎక్కువగా వుంటుంది ఆదాయం ఎక్కువగా వుంటుంది అన్న ఆశ చూచి, పెట్టుబడి ఎక్కువైనా, అప్పో సొప్పో చేసి పంట వేయడం, అనుకొన్నంత ధర మార్కెట్టులో పలుకక పోవడంతో, అప్పులు తీర్చలేక సతమతమయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అందుచేత తిరిగి ప్రభుత్వం, వ్యవసాయ ఆర్థిక శాస్త్రవేత్తలు, అనధికార రైతు సంఘాలు సహకార వ్యవసాయాన్ని ప్రోత్సహించి, చిన్న రైతులను అందుకు ఉత్సాహభరితుల్ని చేసే ఎక్స్‌టెన్‌షన్ సర్వీసెస్ (అంటే వ్యవసాయ పద్ధతులపై పరిశోధనా కేంద్రాలలో పరిశీలించి సంపాదించిన శాస్త్రీయ విజ్ఞానాన్ని భూమిదున్నే రైతులకు అందచేసే సేవా పద్ధతులు) చేస్తే చాలా ఉపయోగపడుతుంది. కేవలం ఏక పార్టీ పరిపాలనా విధానంలోనే కమ్యూన్లను ప్రోత్సహించడం సాధ్యమౌతుంది. అంతే కాని, భారతదేశంలో అమలు అవుతున్న ప్రజాస్వామ్య పరిపాలనలో ఇలాంటి విస్తృత వ్యవసాయం అమలు చేయడం సాధ్యం కాదన్నది కేవలం అపోహ. సహకార వ్యవసాయం ప్రాతిపదిక మీద విస్తృత వ్యవసాయం అమలు చేయగలిగితే, కొంత భూమిలో వరి, మరికొంతలో పత్తి, మరికొంచెంలో చెరుకు, కూరగాయలు పండిస్తే ఒక్క పంట ద్వారా వచ్చే రాబడి కన్నా బహుళ పంటల ద్వారా వచ్చే ఆదాయం అధికంగా వుంటుంది. అంతేకాదు ఎంత పల్చబడినా ఇంకా ప్లానింగ్ పద్ధతి అమలులో వున్న మనదేశంలో వివిధ పంటలకు లక్ష్యాలు నిర్ణయించి, పోటీపడి వ్యక్తిగత రైతులు పంటలు పండించి, గిరాకీ లేక ధరలు పడిపోయే స్థితిని అరికట్టవచ్చు. ఈ విధమైన సహకార విస్తృత వ్యవసాయం, వ్యవసాయ రంగంలో ప్లానింగ్ సులభతరం చేస్తుంది. అంతేకాదు ఈ విస్తృత సహకార వ్యవసాయం అమలు చేయగలుగుతే, చక్కెర మిల్లులు, నూలు మిల్లులు, వంటనూనె మిల్లులు ఈ సహకార లేక సాముదాయిక వ్యవసాయ క్షేత్రాలకు అనుబంధంగా స్థాపించి, అదనపు వ్యవసాయ కూలీలకు ఆ గ్రామంలో ఉపాధి కల్పించవచ్చు అనేభావం కూడా వుంది.

అంతేకాని రాజశేఖరరెడ్డి, పెద్ద కమతాల వ్యవసాయం వలన చైనా ఎక్కువ ఎకరా ఉత్పత్తి సాధించగలుగుతున్నది అన్న తడవుగానే, ఆయన, కార్పోరేటు వ్యవసాయం, కాంట్రాక్టు వ్యవసాయం తరహాలో ఆలోచిస్తున్నారు అనుకోడం పొరపాటేమోనని పిస్తుంది. ఒకవేళ ఆయన అలాగ ఆలోచించినా, అది సరియైన ఆలోచన కాదు. పెద్ద కమతాలు సహకార వ్యవసాయ క్షేత్రాల ద్వారా సాధించ వచ్చునని ఆయనను ఒప్పించే రీతిలో ఆయన అభిప్రాయాలనే విశ్లేషించడం మంచిది.

కొంతమంది విశ్లేషకులు చైనా మావోకాల పరిస్థితులు ఇప్పుడు లేవని, అపుడు మావో, చౌ-ఎన్-లై కమ్యూనిస్టు పార్టీ, ప్రభుత్వ అధినేతలుగా వున్నపుడు సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ స్థాపించడానికి పునాదులు వెయ్యడానికి మౌలిక మార్పు చేశారని, కాని వారితరం అనంతరం వచ్చిన కమ్యూనిస్టుపార్టీ నాయకులు, కొంత సోషలిస్టు విధానాలను పల్చబరిచి, ఆర్థిక సంస్కరణలు పేరిట కొన్ని, పెట్టుబడిదారి పద్ధతులను క్రమేపి చైనా ఆర్థిక వ్యవస్థలో చొప్పించడం వలనే, ఒకప్రక్క చైనా అభివృద్ధి త్వరితగతిని సాగుతున్నా, పట్టణ, గ్రామీణ అంతరంలో భేదం రావడం లేదని పట్టణ తలసరి ఆదాయం, గ్రామీణ తలసరి ఆదాయానికి నాలుగింతలదాకా ఉంటుందని అంటున్నారు. దీనినే సోషలిస్టు మార్కెట్ విధానం అని చైనా ఆర్థిక వేత్తలు అనడాన్ని కొందరు అవహాస్యం చేసే రీతిలో వ్యాఖ్యానిస్తున్నారు.

"సోషలిస్టు మార్కెట్" అనే పదాన్ని మొట్టమొదటసారిగా, స్టాలిన్ 1953లో కాబోలు "రెండు మార్కెట్లు" (టు మార్కెట్స్) అన్న చిన్న పుస్తకంలో వాడారు. ఆయన కాపిటలిస్టు మార్కెట్టుకు, సోషలిస్టు మార్కెట్టు పోటీగా నిలబడి సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ పెట్టుబడిదారీ విధానం కన్నా మెరుగైనది అని చెప్పగలుగుతుందని అన్నారు. ఆయన అభిప్రాయంలో సోషలిస్టు మార్కెట్టు అంటే సోషలిస్టు దేశాలు (అంటే తూర్పు యూరప్ దేశాలు, ప్రజా చైనా, యుగోస్లావియా మున్నగునవి) ఒకరితో ఒకరు వ్యాపార సంబంధాలు మెరుగు పరుచుకొని, ఉత్పత్తుల్ని అధికం చేసుకొని, కాపిటలిస్టు దేశాలలో ఉత్పత్తి అయిన సరుకుల కన్నా నాణ్యమైనవి, అంతకన్నా తక్కువ ధరకి అమ్మగలిగి పెట్టుబడి మార్కెట్టును దెబ్బతీయడానికి వీలుపడి, పెట్టుబడిదారీ విధానాన్ని బలహీనపరచి, దాని పతనానికి దారి తీస్తుందని, పెట్టుబడిదారీ దేశాల్లో సోషలిజం సాధించడానికి విప్లవాన్ని ఎగుమతి చేయనవసరం లేదని, పెట్టుబడిదారి ఆర్థిక విధానం కన్నా, సోషలిస్టు ఆర్థిక విధానం ఎంతో ఉత్తమమైనదని, కాపిటలిస్టు, సోషలిస్టు మార్కెట్టు పోటీద్వారా నిరూపించి, ప్రజలను ప్రభావితం చేయవచ్చునని అన్నారు. ముఖ్యంగా రెండవ ప్రపంచ సంగ్రామం అనంతరం సామ్రాజ్యవాదదేశాల క్రింద నలిగిపోయిన వలస దేశాలు స్వాతంత్ర్యదేశాలుగా ఆవిర్భవించి, అభివృద్ధి చెందుతున్న దశలో సోషలిస్టు మార్కెట్టు వారిని బాగా ఆకర్షించగలదని ఆయన భావించి వుండవచ్చు. అయితే ఆ చిన్న పుస్తకంలో స్టాలిన్, ఛాయా మాత్రంగానే సోషలిస్టు మార్కెట్టును సూచించారు. అయితే ఎందుకో ఆయన మరణానంతరం సోవియట్ యూనియన్‌లో ఫారిన్ పబ్లిషింగ్ హౌస్ తిరిగి అచ్చువేయలేదు.

అందుచేత సోషలిస్టు మార్కెట్టు చైనా ఆర్థిక వ్యవస్థలో ఒక భాగంగా, చైనా కమ్యూనిస్టు నాయకులు చెబితే, పెదవి విరుచుకోనవసరం లేదు. మావో, చౌ-ఎన్-లై నాయకత్వం తరువాత వచ్చిన కమ్యూనిస్టు నాయకులు "సంస్కరణోద్యమం" (రిఫార్మిజం) చేపట్టినట్లు కొందరు అభిప్రాయపడడం, చైనా సోషలిస్టు మార్కెట్టు విధానాన్ని తగిన రీతిలో అవగాహన చేసుకోక పోవడవే మోననిపిస్తుంది. రెండవ ప్రపంచ యుద్ధానంతర పరిస్థితులకు, నేటి ప్రపంచ పరిస్థితులకు చాలా భేదముంది. 1990 దశకంలో గోర్బచేవ్ ధర్మమా అంటూ, సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం కావడంతో, అమెరికా ఏకధృవ విధానం చేపట్టి, తన సామ్రాజ్యాన్ని విస్తృత పరచాలన్న లక్ష్యంతో వ్యూహం పన్నుతున్న దశలో, దాని ప్రభావం ప్రపంచ రాజ్యాల మీద కుదించాలన్న ఆసక్తితో, ఒక పెద్ద సోషలిస్టు దేశంగా తన ఉత్పత్తి స్థోమతను వివిధ రంగాలలో అనేక రెట్లు పెంచుకొని, అమెరికాకు దీటుగా నిలబడాలన్న ధ్యేయంతో, సోషలిస్టు విధానం నష్టపోకుండా పరిపాలనా విధానాలలో కొన్ని మార్పులు చేసుకొంటున్నది. అందులో భాగంగానే, అది విదేశీ పెట్టుబడులను విరివిగా ఆహ్వానించి, బలవత్తరమైన పారిశ్రామిక పునాదులు వేసుకొని, పారిశ్రామిక వస్తువుల ఉత్పత్తిని అనేకరెట్లు అధికం చేసి, ఆ వస్తువులను అమెరికాకు కూడా ఎగుమతి చేస్తున్నది. అమెరికా నుంచి పెట్టుబడి సేకరించి అమెరికా మార్కెట్టులో కొంత స్థానం కొన్ని రంగాలలో ఆక్రమించుకోవడమే కాకుండా, ప్రపంచ మార్కెట్టులో తగినంత స్థానం క్రమంగా ఆక్రమించుకొంటూ, మరికొన్ని సంవత్సరాలలో అమెరికాని మించిపోవచ్చు. కాని సోషలిస్టు ఆర్థిక పరిపాలనా విధానంలో అది తీసుకు వచ్చిన మార్పులకు, ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ మార్కెట్టు, భారతదేశం, ఇతర దేశాలలో అమలు పెట్టమని ప్రోత్సహిస్తున్న ప్రపంచీకరణ, స్వేచ్ఛా మార్కెట్టు, ఉదార సరళీకృత విధానాలకీ చాలా భేదమున్నది. చైనాలో

ఆర్థిక వ్యవస్థ, సోషలిస్టు పునాదుల మీద నిర్మింపబడి దానిని విస్తృత పరచడానికి అనుకూలిస్తున్నది. అందుకే, రాజశేఖరరెడ్డిగారు అక్కడ చూసి గ్రహించినట్లు, రానురాను పట్టణగ్రామాల వున్న అంతరాలను తగ్గించడానికి తోడ్పడుతున్నాయి.

చైనా ప్రపంచ మార్కెట్టులో తన ప్రాముఖ్యత, ప్రపంచ వాణిజ్యంలో తన భాగం బాగా అధికం చేసుకోవాలంటే ప్రపంచ వాణిజ్యసంస్థ (డబ్ల్యు.టి.ఓ) సభ్యత్వం స్వీకరించాలని భావించి, దాని నియమనిబంధనలు అంగీకరించింది. అయితే విదేశీ పెట్టుబడి కేవలం బ్యాంకింగ్, బీమా పరిశ్రమలకే పరిమితం చేసింది. ఈ సందర్భంలో చైనా ప్రధాని మాట్లాడుతూ "ప్రపంచ వాణిజ్య సంస్థలో చేరడం విషయంలో చైనా కేంద్ర ప్రభుత్వం చాలా ప్రాధాన్యత వహించే నిర్ణయం తీసుకొందని, కాని ఆ నిర్ణయం చైనాదేశం దీర్ఘకాల అవసరాలకు (ఇంటరెస్ట్) మౌలికావసరాలకు చాలా అవసరం" అన్నారు. "ఎందుచేతనంటే, ఈ సభ్యత్వం ద్వారా చైనా నిర్మించుతున్న సోషలిస్టు మార్కెట్ ఆర్థిక విధానాన్ని బలపరచడమే కాకుండా ఆధునీకరిస్తుంది". "డబ్ల్యు.టి.ఓ లో చేరడం ద్వారా బహిర్గత ప్రపంచంలో చైనా కిటికీలు బాగా తెరుచుకొంటాయని, దీని మూలంగా చైనా అభివృద్ధి రేట్లలో నిలకడ ఏర్పడుతుందని, సామాజిక అభ్యుదయం పుంజుకొంటుందని అన్నారు." "అయితే చైనా ఆర్థిక విధానంలో కొన్ని మార్పులు జరిగినా, చైనాలోని ప్రభుత్వరంగ సంస్థలు (స్టేట్ ఓన్డ్ ఎంటర్ ప్రైజెస్) చైనా ఆర్థిక పునఃవ్యవస్థీకరణలో మౌలిక పాత్ర (కోర్ రోల్) వహిస్తాయని, నొక్కి చెప్పారు. అలాగే విత్త విధానంలో (ఫిస్కల్ పాలసీ) దీర్ఘకాల ట్రెజరీ బాండ్లు ప్రధానపాత్ర వహిస్తాయని, దాని ద్వారా అవసరమైన పెట్టుబడి సేకరించి, తద్వారా ఆర్థిక అభివృద్ధి రేటులో నిలకడ సాధించడమే కాకుండా, ఉపాధికల్పన, సాంఘిక స్థిరత్వం సాధించడం జరుగుతుందని అన్నారు." "అంతే కాకుండా, కేంద్ర ప్రభుత్వం దేశంలో పశ్చిమ ప్రాంతాలను, ఇతర ప్రాంతాలతో సమానంగా అభివృద్ధి సాధించేందుకు తగిన పథకాలు వేసి, అమలు చేయగలుగుతుందని అన్నారు." (ఈ సమాచారం 22-12-2001 హిందూ పత్రికలో రవి ప్రసాద్ నారాయణన్ వ్రాసిన వ్యాసంలో నుండి గ్రహించినది)

చైనా అనుసరిస్తున్న సోషలిస్టు ఆర్థిక పునాదుల మీద నిర్మిస్తున్న వ్యవస్థ, 1980 నుంచి 2003 సంవత్సరంలో దాని స్థూలదేశ ఉత్పత్తి (జి.డి.పి) వార్షిక అభివృద్ధిరేటు 9.8 శాతం సాధించింది. అయితే 1980-1990, 1991-2003 సంవత్సరాలలో ప్రాథమిక (అంటే ముఖ్యంగా వ్యవసాయం, పశుపోషణ, మత్స్యవంటి రంగాలు) రంగంలోను, తృతీయ (సేవల-సర్వీసెస్) రంగంలోను కొంత తగ్గుదల కనిపించినా ద్వితీయ (సెకండరీ) రంగంలో అంటే పారిశ్రామిక రంగంలో సాధించిన అభివృద్ధి ఈ తరుగుదలను కప్పిందని 8-2-2005 హిందూ పత్రికలో చంద్రశేఖర్-జయతీఘోష్‌ల వ్యాసంలో పేర్కొన్నారు. వీరు ఇంకా ప్రభుత్వ ఖర్చు ప్రధానంగా గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్య, శాస్త్రీయ-సాంకేతిక, వేతనాలు మున్నగు వాటికి హెచ్చుగా వినియోగపరుస్తూ, రియల్ ఎస్టేట్, గృహ, ఇతర నిర్మాణం, పట్టణ స్థలాల అభివృద్ధి మున్నగు వాటికి పెట్టుబడి ముఖ్యంగా బ్యాంకులు మున్నగు ఫైనాన్స్ సంస్థల నుంచి, బాండ్ల రూపాలలోను చేకూరుస్తున్నారు. అంతేకాదు. ప్రైవేటు గృహాలకు సంబంధించిన నిబంధనలు సవరించడంతో, పొదుపు చేసుకొన్న పౌరులు, ఆ పొదుపులను గృహనిర్మాణాలకు వాడుతున్నారు. ఈ విధంగా గృహనిర్మాణ పరిశ్రమకు బాగా పెట్టుబడి లభిస్తున్నది. ఈ బ్యాంకుల్లోను, బీమా రంగంలోనే ఎక్కువగా విదేశీ పెట్టుబడిని ప్రోత్సహించడం జరుగుతున్నది.

సోషలిస్టు మార్కెటింగ్ అంటే అదేదో సామ్యవాద ఆర్థిక వ్యవస్థ నీరుకార్చే విధంగా భావించడం సరికాదు.

ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డిగారు తక్కువకాలం చైనాలో కేవలం ఆరు రోజులే పర్యటించినా, చాలా ముఖ్యమైన విషయాలను, మన దేశం, మనరాష్ట్రం పరిస్థితులను బట్టి కావలసిన మార్పులు చేసి అమలు పరచగల అవకాశాలున్నాయి అన్న అభిప్రాయానికి రావడంలో ఆశ్చర్యపడనవసరం లేదు.

"డబ్ల్యు.టి.ఓ. సూచించిన సోషలిస్టు ఆర్థిక పునాదుల మీద దేశ అవసరాల దృష్ట్యా కొన్ని రంగాలలో సరళీకృత విధానాలు చేపట్టడానికి, పెట్టుబడిదారి వ్యవస్థలో ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి, వాటినుండి ఋణాలు ఆర్జించిన సందర్భంలో ప్రపంచీకరణ, స్వేచ్ఛా వ్యాపారం, ఉదార సరళీకృత విధానాలు చేపట్టడానికి వున్న మౌలిక భేదం గమనించాలి. సామ్యవాద ఆర్థిక పునాదుల మీద నిర్మించిన ఆర్థిక వ్యవస్థలో కొన్ని మార్పులు, ప్రపంచ పరిస్థితులను బట్టి చేసినా, అవి ప్రజోపకరంగా, దేశ అభివృద్ధికి తోడ్పడుతాయి. కాని "ఆర్థిక సంస్కరణలు" పెట్టుబడిదారి పునాదుల మీద నిర్మాణమైన ఆర్థిక వ్యవస్థలు, సమాజంలో ఉన్నత వర్గాలకే ఉపయోగపడడమే కాక, అభివృద్ధి కూడా ఆశించినమేరకు ఎపుడూ జరగదు.

*

సార్క్‌పై ఇండియా విశ్లేషణ-విమర్శ- వ్యూహాత్మక ప్రభావం

-ప్రొ॥ ఆర్.వి.ఆర్. చంద్రశేఖరరావు

దక్షిణ-సియా ప్రాంత దేశాల వ్యవస్థ అయిన 'సార్క్' 25 ఏళ్ళక్రితం ఏర్పడింది. అంతర్జాతీయ రంగంలో వివిధ ప్రాంత దేశాల రక్షణ, భద్రతలను పురస్కరించుకొని, రక్షణ కూటములు ఏర్పడటం పరిపాటే. రెండో ప్రపంచ యుద్ధం తరువాత ప్రచ్ఛన్న యుద్ధం ఉగ్రగతిగా మారిన తరుణంలో రక్షణ కూటముల ఏర్పాటు విరివిగా నడచింది. ఒక ప్రక్క ప్రపంచ రాజకీయ శక్తుల్లో సమతుల్యానికి ఈ కూటములు సహకరించగా, మరొక ప్రక్క ఉద్రిక్త వాతావరణాన్ని, ప్రాంతీయ వైషమ్యాలనీ ఈ రక్షణ కూటముల పోకడ మరింతగా ప్రోత్సాహించింది. ప్రచ్ఛన్నయుద్ధం అంతం అవకముందే ఈ కూటముల ప్రభావం తగ్గింది. ఇంచుమించు వీటికి ప్రత్యామ్నాయాలుగా అన్నట్లు ప్రాంతీయ ఆర్థిక వాణిజ్య సహకార వ్యవస్థలు ప్రపంచంలో అన్ని ఖండాల్లోనూ ఏదో ఒక రీతిలో నెలకొల్పబడ్డాయి.

యూరోప్‌లో ఈ.యూ (యూరోపియన్ యూనియన్), ఆగ్నేయ ఆసియాలో ఆసియాన్ ఉదాహరణలుగా చెప్పవచ్చును. ఈ సాంప్రదాయానికి చెందినదే 'సార్క్' సంస్థ. యూరోపియన్ యూనియన్, ఆసియాన్ సాధించిన ప్రాంతీయ ఐక్యత, సభ్యుల మధ్య పరస్పర సహకార సంప్రదాయాన్ని 'సార్క్' సాధించలేదు. దీనికి గల కారణాలు ఇంకో సందర్భంలో పరిశీలిద్దాం. ముఖ్యమైన విషయమేమిటంటే సార్క్ లక్ష్యం దక్షిణాసియా దేశాలైన: ఇండియా, పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్, భూటాన్, మాల్దీవుల మధ్య సహకారం పెంపొందించి, పరస్పర అభివృద్ధికి ప్రోత్సహించి దక్షిణాసియా ప్రాంతాభివృద్ధిని సాధించడమే. ప్రాంతంలోని సభ్యుల మధ్య రాజకీయ, భద్రత విషయాల్లో గల వైషమ్యాలను, వైరుధ్యాలను ప్రక్కకు నెట్టి, ఆర్థిక వాణిజ్య సాంస్కృతిక రంగాలలో సహకార ధోరణులను పెంపొందించాలనే ధ్యేయాన్ని సార్క్ ఇంతో కొంతో ప్రయత్నం చేస్తూనే ఉంది.

ఇటీవల సార్క్ శిఖర సమావేశం బంగ్లాదేశ్‌లో జరగాల్సి ఉండింది. కానీ నేపాల్‌లో తలెత్తిన రాజకీయ సంక్షోభం, బంగ్లాదేశ్‌లో ఉగ్రవాదుల ద్వారా తగిన రక్షణ లేదన్న ఇండియా అభ్యంతరం కారణంగా ఈ శిఖర సమావేశం వాయిదా పడింది. అయితే ఈ నేపథ్యంలో ఇండియా సార్క్ పట్ల తన వైఖరిని పునర్వ్యక్తం చేసింది. సార్క్‌కు ఇండియా పూర్తిగా మద్దతు ఉందనీ, దాని భవిష్యత్తులో తన పాత్ర కీలకమైనదనీ ఉద్ఘాటిస్తూనే, కొన్ని సభ్య దేశాలు చిత్త శుద్ధితో వ్యవహరించడం లేదని ఇండియా ఈ ప్రకటనలో నొక్కి చెప్పింది.

ఇరుగు పొరుగు దేశాల మధ్య స్నేహ పూరిత వాతావరణాన్ని ఏర్పరచుకొని ఒక సమగ్రమైన విధానాన్ని మొదటిసారిగా రూపొందించింది ఇంద్ర కుమార్ గుజ్రాల్. విదేశాంగ మంత్రిగాను, తదుపరి ప్రధానిగాను ఉన్నప్పుడు ఈ విధాన చొరవ తీసుకొని దాని అమలుకై కొన్ని కీలకమైన చర్యలు తీసుకొన్నారు. దక్షిణాసియా దేశాలతోనే కాక, ఆగ్నేయాసియా దేశాలతో సత్సంబంధాలకై విధానాలను రూపుదిద్దారు. కానీ, భాజపా హయాంలో (1998-2004) ఇవి మరుగున పడ్డాయి. వాజ్‌పాయ్ యాత్ర ప్రభావం అనేక ఆశలను చూపినా, కార్గిల్ యుద్ధం తరువాత ఇండియా-పాకిస్తాన్‌ల అణ్వస్త్ర సాధనలతో తిరిగి ఈ రెండు దేశాల సంబంధాలు ఉద్రిక్తత చెందాయి. కొంతవరకు దక్షిణాసియా ప్రాంతీయ సహకార ఉద్యమం కూడా చల్లబడింది.

ఇప్పుడు మళ్ళీ సార్క్‌ని పటిష్టం చేయాలనే లక్ష్యం ఇండియాలోనూ, ఇతర సభ్య దేశాలల్లోనూ కనబడుతుంది. ఈ సందర్భంలోనే పై చెప్పిన ఇండియా విదేశాంగ శాఖ విడుదల చేసిన ప్రకటనను అర్థం చేసుకోవాలి.

ప్రముఖంగా ఈ సిద్ధాంత ప్రకటన ఉద్దేశ్యం సార్క్ సూత్రాలను పునరుద్ఘాటన చేయడమే. దక్షిణాసియా దేశాలు ఆర్థిక వాణిజ్య సాంస్కృతిక రంగాల్లో పరస్పర సంబంధాలను పెంపొందించుకొని, సద్భావాన్ని పెంచి ఆ అనుగుణ్య వాతావారణంలో వారి మధ్యగల రాజకీయ భద్రత వైరుధ్యాలలో కూడా నడలింపు కలుగ చేయవచ్చుననే సార్క్ ఆశయం. ఈ విషయాన్నే విదేశాంగ వ్యవహారాల ముఖ్య కార్యదర్శి శ్యాంశరణ్ పునశ్చరణం చేయడం జరిగింది.

అయితే ఆయన ప్రకటనను కొద్దిగా ఘాటైన రీతిలో విశ్లేషించాడు. సార్క్ సభ్యులు కొందరు సంస్థ సూత్రాలను వక్రగతి పట్టిస్తున్నారనీ, ముఖ్యంగా ఇండియా భద్రతా ప్రయోజనాలకు భంగకరమైన విధానాలను వారు అనుసరిస్తున్నారనీ శ్యాంశరణ్ నిక్కచ్చిగా ప్రస్తావించాడు. ఇటువంటి సభ్యదేశాల పేర్లను చెప్పక పోయినా పాకిస్తాన్‌ను, బంగ్లాదేశ్‌ను ఉద్దేశ్యించే ఆయన ఈ విశ్లేషణాత్మక విమర్శను చేశారనే భావం వ్యక్తమౌతోంది.

ఆ దేశాలు ఇతర ప్రాంతీయ కూటములలోను, అంతర్జాతీయ వేదికలలోను, తరచు సార్క్ వేదికలో కూడా భారత ప్రయోజనాలకు

వ్యతిరేకంగాను, దౌత్య సంప్రదాయాలకు భిన్నంగాను ఇండియాను ఇరుకున పెట్టడానికే చూస్తున్నారనీ విదేశాంగ కార్యదర్శి మొహమాటం లేకుండా వక్కాణించారు. ప్రాంతంలో అత్యంత పెద్ద దేశమైన ఇండియాను ఏకాకిగా చేయాలనే వక్రబుద్ధి ఈ దేశాల వైఖరిలో ఉందని ఆయన తేల్చి చెప్పారు.

ఈ సందర్భంలో సార్క్ స్థాపన మనుగడ నేపథ్యంలో ఉన్న ఒక నగ్న సత్యాన్ని ఆయన పునర్వచించడం గమనించాలి. ఆసియాన్, యూరోపియన్ యూనియన్ వంటి ప్రాంతీయ వ్యవస్థలకు, సార్క్ వ్యవస్థకు గల తారతమ్యాన్ని ఆయన విపులంగా చెప్పారు. ఆసియాన్, ఇయూలలో సభ్యుల మధ్య కీలకమైన, భద్రతాపరమైన వైరుధ్యాలు లేకపోవడమే గాక పొరుగు ప్రాంతీయ కూటముల నుండి ఈ వ్యవస్థలకు ఉమ్మడిగా భద్రతా ఒత్తిడుల ప్రమాదం ఉండడం వల్ల ఆసియాన్, ఈయూల వ్యవస్థల్లో గాఢమైన సమష్టి భావన-ఉమ్మడి కార్యసాధనకు ఉత్సాహం చోటు చేసుకున్నాయనీ, సార్క్ దేశాలలో ఈ భావన ఆదినుంచీ లోటు అయిందనీ శరణ్ తేట తెల్లం చేశాడు.

దక్షిణాసియా రాజకీయ పటానికీ, ఈ ప్రాంతపు భౌగోళిక నైసర్గిక వాస్తవాలకు అతి క్లిష్టతరమైన లంకె ఉంది. ఈ ప్రాంతంలో ఇండియా ఇతర దేశాలకన్నా అత్యంత పెద్దదయింది. సార్క్ సభ్యులైన ఏడు దేశాల్లో, ఐదు దేశాలతో ఇండియా సరిహద్దులు కలిగి ఉంది. ఈ దేశాల ఆవిర్భావంలోనే ఈ బహు సరిహద్దుల వాస్తవం చోటు చేసుకుంది. సగిహద్దులు ఎప్పుడున్నాయో ఎక్కడున్నాయో అక్కడ సరిహద్దు వివాదాలు, తత్సంబంధమైన వివాదాలు ఎంతో కొంత ఉండక మానవు. ప్రపంచంలో ఇతర చోట్ల ఇటువంటి భౌగోళిక, నైసర్గిక పరిస్థితులు లేవని కావు. ఉదాహరణకు తూర్పు ఆసియా ప్రాంత రాజకీయ పరిస్థితిలో కూడా ఇటువంటి వైచిత్రి చూడవచ్చు.

అయితే దక్షిణాసియా వ్యవహారంలో ఈ వాస్తవం మరింత క్లిష్టమైన పరిణామాలకు ఆలవాలమైంది. ఇదివరలో బ్రిటిషు సామ్రాజ్య విధానానికి లోబడి ఉండిన ఈ దేశాలు స్వాతంత్ర్యం పొందడంతోనే సరిహద్దు సమస్యలు పుట్టుకొచ్చాయి. తదుపరి పరిణామాలు ఈ సమస్యలను విస్తృతం చేశాయేకాని తగ్గించలేదు. ఉదాహరణకు బంగ్లాదేశ్ అవతరణ మూలంగా ఇండియా పాకిస్తాన్ సరిహద్దు సమస్య తగ్గుముఖం పట్టిందనే ఆశ నిరాశగానే మారింది. పాత వివాదాల వల్లనైతేనేమీ, దరిమిలా చోటు చేసుకున్న ఉగ్రవాద కారణంగా నైతేనేమీ, బంగ్లాదేశ్‌లో గల రాజకీయ వైషమ్యాల కారణంగానైతేనేమీ ఇండియా బంగ్లాల మధ్య వైరుధ్యం పెద్ద సమస్యగానే మారింది.

ప్రాంతీయంగా అతిపెద్ద దేశంగా ఉండడం ఎంత గర్వించదగ్గ విషయమో, అంత తలనొప్పి జనకమైన విషయమే కూడా. అంతర్జాతీయ రాజకీయాల్లో నైసర్గిక, భౌగోళిక వాస్తవాల ప్రభావంలో ఉన్న సమస్య ఇదే. బహుశా ఇందువల్లనే కాబోలు, రక్షణ వ్యూహరచన సిద్ధాంతంలో ఒక నానుడి ఉంది. ప్రతి రక్షణ వ్యూహపరమైన లాభమూ, నష్టంగా పరిణమించే అవకాశం ఉందని అంటారు.

ఇటువంటి నేపథ్యంలో దక్షిణాసియా ప్రాంతంలో సహకార సంఘాన్ని స్థాపించడమే ఒక సాహస ప్రక్రియ అని చెప్పవచ్చు. ఇందుచేతనే ఇప్పటివరకు అది కుంటినడకే నడుస్తోంది.

ఈ ప్రాంతంలో అత్యంత పెద్దదీ, ఆర్థిక వాణిజ్య రంగాల్లో పటిష్టతగల దేశమైన ఇండియాను అనుమానిస్తూ భద్రతా విషయాల్లో ఇండియాకు గల సమంజసమైన, సమర్థనీయమైన ప్రయోజనాలకు భంగకరమైన రీతులలో వెనుకనుండి గోతులు త్రవ్వడం ఇండియా సహించదని శరణ్ స్పష్టం చేశారు. అనేక రంగాల్లో ప్రాంతీయ సహకారాభివృద్ధికి ఇండియా కృషి చేయడానికి సిద్ధంగా ఉందనీ, పొరుగు దేశాలు మాత్రం ఇండియాకు హాని తలపెడితే సార్క్‌కే ముప్పు వాటిల్లే పరిస్థితి ఏర్పడుతుందని ఆయన హెచ్చరించారు.

అయితే ఈ సిద్ధాంత ప్రకటన విషయంలో కొన్ని అనుమానాలు కూడా కలుగవచ్చును. సార్క్ వ్యవస్థని పురస్కరించుకుని దానిని ప్రోత్సహిస్తామనే సందర్భంలో ఇంత ఘాటుగా పొరుగుదేశాలను హెచ్చరించడం అవసరమా? అందులోనూ విదేశాంగమంత్రి నట్వర్‌సింగ్ ముఖ్యమైన ద్వైపాక్షిక చర్చలకు పాకిస్తాన్‌కు వెళ్ళబోయే నేపథ్యంలో విదేశాంగ కార్యదర్శి హెచ్చరింపు ధోరణి సమంజసమా?

ఈ ప్రకటన ఇండియా యొక్క ప్రాంతీయ ఆజమాయిషీ ధోరణిని సూచిస్తున్నదనే విమర్శకు కూడా రావచ్చును. ఇండియా భద్రతా ప్రయోజనాలను ఇతర ప్రాంతీయ దేశాలు గుర్తించి నడుచుకోవాలనే భావనను వక్రీకరించడానికి వీలు కల్పిస్తుంది. కానీ ఇంకో కోణంలో ఆలోచిస్తే ఏదో ఒక సందర్భంలో ఇండియా తన మనోగతాన్ని బహిరంగంగా వ్యక్తం చేయడం అవసరమే. అత్యంత పెద్ద దేశంగా ఉండడం నేరం కాదు కదా! అది భౌగోళిక చారిత్రిక వాస్తవం. చాల తారతమ్యాలున్నా దక్షిణాసియా ప్రాంతీయ పరస్పరతలో అనేక హెచ్చుతగ్గులు అసౌష్టతలు విస్తృతంగా ఉన్నాయనే విషయాన్ని గమనించాం కదా! ఇందుకని ఇతర దేశాల అనుమానాలను, ఈర్ష్యాపరమైన ఎత్తుగడలను మొహమాటానికి పోయి సహించడం అనవసరం.

ఈ నిర్మొహమాట వైఖరిలో లాభాలు ఉన్నాయి. కొంచెం కటువుగా కనిపించినా విదేశాంగశాఖ ప్రకటన ఇండియా దక్షిణ వ్యూహరచనలో ఒక కీలకమైన భాగంగా పరిగణించాలి. ప్రత్యక్షంగా నిదర్శనాలు కనిపిస్తున్నాయి. ప్రకటన వెలువడిన వెంటనే విదేశాంగ మంత్రి పాకిస్తాన్ పర్యటన జరిగింది. రోడ్డు-రైలు రాకపోకలకు ఒప్పందాలు కుదిరాయి.

(మిగతా 24వ పేజీలో)

వస్త్ర, దుస్తుల పరిశ్రమ-నూతన అవకాశాలు, కొత్త ప్రమాదాలు

-భూపతిరాజు సాంబశివరాజు

భారతదేశంలో వస్త్ర పరిశ్రమ గురించి మాట్లాడటం అంటే మొట్టమొదటిగా ఆ పరిశ్రమయొక్క వివిధ రంగాలలో నిమగ్నమయి ఉత్పత్తిని చేస్తున్న పనివారి గురించి మాట్లాడాలి. వారి పరిస్థితుల గురించి మాట్లాడాలి. వారికి లభ్యమౌతున్న జీతాలు, ఆదాయాలు, ఆరోగ్యం, వారి అభివృద్ధికి కేటాయిస్తున్న సొమ్ము గురించి మాట్లాడాలి.

అయితే ఇప్పుడు జరుగుతున్న చర్చ ఎక్కువగా ఆధునీకరణ గురించి, యాంత్రీకరణ గురించి, ఎగుమతుల వృద్ధిరేటు గురించి, ప్రపంచీకరణ తీసుకొచ్చిన నూతన అవకాశాలు, కొత్త సవాళ్ళ గురించి పరిమితమౌతోంది. ఇంకా సులభతర కార్మిక విధానం (అంటే సులభంగా తొలగించడానికి వీలు కల్పించే విధానం), కాంట్రాక్టు కార్మికుల విధానం గురించి, దాని సత్వర అవసరం గురించి, ఇంతవరకు అమలులో ఉన్న కార్మిక చట్టాలను ని పూర్తిగా రద్దు చేసి పరిశ్రమాధిపతులను ఈ కఠినమైన కార్మిక చట్టాల నుండి విముక్తి చేయాల్సిన అవసరం గురించి విస్తృతంగా చర్చ జరుగుతోంది. ఈ విషయంలో ప్రభుత్వంపై చాలా ఒత్తిడి పెరుగుతోంది. ఇంకొక పక్క చేనేతరంగం కుదేలైపోతోందని, దానిపై ఆధారపడి బ్రతుకుతున్న లక్షలాది సాంప్రదాయక చేతివృత్తి కుటుంబాలు ఆకలిచావులకు గురైపోతాయని, వారిని ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని కూడా చర్చ జరుగుతోంది.

మనం నిశితంగా పరిశీలించినట్లయితే ఈ చర్చలన్నీ ఎవరికోణం నుండి వారు మాట్లాడుతూ ఉండటమే కన్పిస్తుంది గాని విస్తృత జనాభా జీవనాధారంగా ఉన్న, మానవ వనరులు, నైపుణ్యాలు కలిగి ఉన్న ఈ రంగాన్ని ఒక సమ్యక్ దృష్టితో ఎవ్వరూ చూడలేకపోతున్నారు. మన ప్రభుత్వాలకు అంతతీరిక, ఓపిక కన్పించడం లేదు. మనం మరిన్ని వివరాలలోకి వెళ్ళేముందు మన రాష్ట్రంలో ఈ రంగం ఎలా ఉందో కొంచెం తెలుసుకోడానికి ప్రయత్నిద్దాం.

పట్టిక-1

మొత్తం దేశం ఉత్పత్తిలో రాష్ట్రాల వారీ వాటాలు (1989-97)

(శాతం)

రాష్ట్రం	నూలుఉత్పత్తిలో శాతం	గార్మెంట్స్ శాతం
(1)	(2)	(3)
ఆంధ్రప్రదేశ్	**5.0**	0.1
బీహార్	0.2	-
ఢిల్లీ	0.6	**27.1**
గుజరాత్	**11.6**	3.8
హర్యానా	1.3	1.5
కర్నాటక	3.4	**9.1**
కేరళ	2.1	0.4
మధ్యప్రదేశ్	3.4	0.2
మహారాష్ట్ర	**16.4**	**17.5**
ఒరిస్సా	0.9	-
పాండిచ్చేరి	1.1	-
పంజాబ్	4.5	**10.3**
రాజస్థాన్	2.2	1.4
తమిళనాడు	**39.4**	**23.4**
ఉత్తరప్రదేశ్	4.2	3.1
పశ్చిమబెంగాల్	2.6	0.6
మొత్తం	98.9	98.6

మూలం: ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ (జనవరి 8-14, 05)

ముద్ద అంకెలు ప్రధాన రాష్ట్రాలకు చెందినవి. మొత్తం దేశంలో ఉత్పత్తి అయ్యే కాటన్ నూలు ఉత్పత్తిలో 72.4 శాతం నాలుగు రాష్ట్రాల నుండి, గార్మెంట్స్ ఉత్పత్తిలో 87.4 శాతం అయిదు రాష్ట్రాల నుండి లభ్యమౌతోంది.

పట్టిక ప్రకారం పత్తి ఉత్పత్తిలో ముందుభాగాన ఉన్న నాలుగు రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటిగా ఉన్నప్పటికి మిగతా మూడు రాష్ట్రాలతో పోలిస్తే రాష్ట్రం యొక్క పత్తినూలు ఉత్పత్తిలో 5 శాతం వాటా చాలా తక్కువ అనే చెప్పవచ్చు. ఈ పత్తి నూలు ఉత్పత్తి తమిళనాడులో 39.4 శాతం, మహారాష్ట్రలో 16.4 శాతం, గుజరాత్‌లో 11.6 శాతం ఉండగా మనరాష్ట్రంలో 5.0 శాతం ఉండటం గమనించవచ్చు. అలాగే గార్మెంట్ ఉత్పత్తి చూస్తే మనరాష్ట్రం 0.1 శాతం అంటే ఇంచుమించు ఏమీలేనట్లే. అదే తమిళనాడులో 23.4 శాతం, ఢిల్లీల్లో 27.1 శాతం, కర్నాటకలో 9.1 శాతం, మహారాష్ట్రలో

17.5 శాతం వాటా కలిగి ఉన్నాయి. మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలు ఓ రకమయిన సమతుల్యం కలిగి ఉన్నాయి. ఈ పట్టికలో నూలు నుండి వస్త్రాల నేత గురించి ఎక్కడా ప్రస్తావించలేదు గాని మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలలో ఆ విషయంలో కూడా సమతుల్యం కన్పిస్తుంది. మనరాష్ట్రం ఈ రాష్ట్రాలతో పోలిస్తే ఏ రకంగాను పత్తి ఉత్పత్తిలోగాని మానవ వనరులలోగాని వెనకబడిలేము. మరి లోపం ఎక్కడ ఉంది? ఇక్కడ ప్రభుత్వాలు గత అయిదు దశాబ్దాలుగా ఈ రంగాన్ని చిన్న చూపు చూడటంగానే కాక మొత్తానికి నిర్లక్ష్యం చేసినట్లుగా అర్థం చేసుకోవచ్చు.

ప్రపంచవ్యాప్తంగా చోటు చేసుకొంటున్న అనేక పరిణామాలు, మార్పుకు గురౌతున్న ప్రజల అభిరుచులు, వస్త్రధారణలో, సామాజిక పని పద్ధతుల్లో, ప్రయాణ పద్ధతుల్లో వస్తున్న మార్పులు గమనించకుండా, అధ్యయనం చేయకుండా, తదనుగుణంగా ప్రజావసరాలను ప్రణాళికాబద్ధం చెయ్యకుండా ఎన్నికల గెలుపు కోసం కురిపించే వాగ్దానాల జడి వానతో చేనేత సమస్యగాని, పవర్‌లూమ్ సమస్యలు గాని, ఇంకా విభిన్న జౌళిరంగ సమస్యలు గాని తీరవు.

భారతదేశానికి జవసత్వాలు ఇచ్చే వ్యవసాయం-వస్త్ర పరిశ్రమ ఈ రోజు ఓ చిల్లి ఓడగా తయారయ్యాయి. చిల్లు అంతకంతకు పెద్దదై మునిగి పోకముందే కాపాడుకునే బాధ్యత ప్రజలందరిదీ.

మారుతున్న ప్రజల అభిరుచులు-అవసరాలు:

అభివృద్ధి చెందుతున్న సమాజాలలో అగ్రభాగాన ఉన్న చైనా, భారత్ వంటి దేశాల్లో మధ్యతరగతి వర్గం చాలా వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ వర్గం దేశీయ, సాంప్రదాయక వస్త్రధారణ నుండి పాశ్చాత్య వస్త్రధారణ వైపు మొగ్గు చూపుతోంది. ఫ్యూడల్ సాంప్రదాయాల నుండి పెట్టుబడిదారీ వస్తు వినియోగ సంస్కృతి, చదువులు, పని పద్ధతులు త్వరితగతిన ప్రజలను కమ్ముకొస్తుంటే వాటి ప్రభావం నుండి, ప్రలోభం నుండి బయటపడి ఒక స్వతంత్ర ఆలోచనా, సాంస్కృతిక విధానం ఈ దేశాలలో నిలదొక్కుకునే అవకాశాలు మృగ్యమై పోతున్నాయి. మనదేశ స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా రూపుదిద్దుకున్న స్వదేశీ వస్త్ర ఉద్యమం తరువాత ఆవిరి అయిపోయింది. మావో వంటి నాయకుల అస్తమయంతో చైనా నాయకత్వం స్వతంత్ర ఆర్థిక విధానం విసిరి పారేసి మొత్తంగా ఓ పాశవిక ఆర్థిక అభివృద్ధి నమూనాను అక్కడి ప్రజలపై రుద్దింది. అలాగే మనదేశంలో కూడా ఇటువంటి వాతావరణమే అలముకుంటోంది. ఇటువంటి మార్పులకు గురౌతున్న సమాజంలోనూ, ఎగుమతి ప్రాధాన్యతా ఆలోచనలతో ఉన్న ఆర్థిక వ్యవస్థలోనూ సహజంగా చోటు చేసుకొంటున్న పరిణామాలే మన వ్యవసాయంలో సంక్షోభం, చేనేతరంగంలో సంక్షోభం.

ప్రకృతి సిద్ధమయిన పత్తి వంటి ముడి పదార్థాల నుండి నూలు తయారు చెయ్యటమే కాక, ఎన్నో రకాల రసాయనిక నూలు ఉత్పత్తులు పాశ్చాత్య పరిశ్రమరంగం అభివృద్ధి చేసి మన సమాజాల్లోకి చొప్పించింది. అవి మనకు అవసరమయినా, కాకపోయినా ఆర్థిక స్వావలంబనను కోల్పోయిన మన సమాజం అంబానీ వంటి నూతన వ్యాపార వీరుల ఆవిర్భావంతో మనల్ని ముంచెత్తాయి. ఇపుడు అవే రాజ్యమేలుతున్నాయి. కాటన్ దుస్తుల సౌఖ్యం అందరూ గుర్తించినప్పటికీ వాటిని ధరించే భాగ్యం అందరికీ ఉండటం లేదు. మార్కెట్ వ్యవస్థ విజృంభణతో, నిత్యనూతనత్వం కోసం ఫ్యాన్సీ వస్త్ర ఉత్పత్తులు, ఫ్యాషన్లు ముంచెత్తుతున్నాయి. ఇటువంటి పరిస్థితిలో చేనేతరంగం కాని, పవర్ మగ్గాలరంగం కాని, ఆటో మగ్గాలరంగం కాని ఆధునిక దుస్తుల తయారీ రంగానికి, వస్త్ర-అలంకరణ రంగాలకి అనుగుణంగా, అనుబంధీకరించబడకుండా నిలబడటం కష్టసాధ్యమౌతుంది. ఎందుకనంటే ఈ అన్ని రంగాలలోనూ కోట్లాది ప్రజల జీవనోపాధి ముడిపడి ఉంది. ఈ ఆలోచన ముందుగా ప్రగతి పథంలో శ్రామిక శ్రేయోభిలాషులుగా పనిచేస్తున్నామని చెప్పుకునేవారు శాస్త్రీయంగా పరిశీలించి ఆమోదించాలి.

ఇటువంటి ఆమోదానికి వచ్చినట్లయితే తదుపరిమార్గం ఈ రంగాలన్నింటినీ సంక్షోభంలో కూరుకుపోకుండా, ఓ స్వతంత్ర ఆర్థిక స్వావలంబనా వ్యవస్థలో ఇమడ్చడానికి ఓ సమైక్య కార్యాచరణకు ప్రణాళికలు రూపొందించి ఆచరణలో పెట్టడానికి పాటుపడాలి, పోరాడాలి.

అటువంటి ఆలోచన ఎటువంటిదై ఉండాలి?

గాంధీగారి చరఖా, చేతి మగ్గాన్నే ఈ రోజు మనం స్వావలంబనకి తిరిగి పునాదిగా చేయగలమా? అది సాధ్యమా? దానిని ప్రజలు అంగీకరిస్తారా? ఇవాళ వస్త్రధారణ అంటే కేవలం ఒంటిని కప్పుకోవడమొక్కటే కాదు. దానిని సులువుగా శుభ్రపరచు కోవడం, ఆరపెట్టడం, దానికయ్యే ఖర్చు, శ్రమ, వెసులుబాటు, తమ తమ

పనులలో వస్త్రధారణ యొక్క పాత్ర ఇవన్నీ కూడా.

టెక్నాలజీ అందుబాటులోకి వచ్చాక, దుర్భరమయిన శ్రమతో కూడుకున్న ఎన్నో వెనుకబాటు ఉత్పత్తి వ్యవస్థలు మార్పుకు గురి కాక తప్పదు. ఏ హేతుబద్ధ సమాజం వాటిని కాలదన్నుకోజాలదు. అలాగే ఏ తెలివయిన సమాజమైనా తనలో భాగమయిన సాంప్రదాయక ఉత్పత్తి అంగాన్ని కాలదన్నుకోకూడదు. కాపాడుకు తీరాలి. సాంప్రదాయక ఉత్పత్తి అంగాలను మారుతున్న కాలమాన పరిస్థితుల కనుగుణంగాను, ఉపాధికల్పనకు కేంద్రంగాను, ఉపాధి పొందుతున్న వారి పని పరిస్థితులు, జీవన పరిస్థితులు ఆరోగ్యకరమయిన మార్పుకు గురయ్యేటట్లు చెయ్యగల్గాలి.

చేనేత మగ్గాలపై గాని, మర మగ్గాలపై గాని పనిచేస్తున్న పనివారి జీవన పరిస్థితులు మనదేశంలో చాలా దుర్భరంగా ఉన్నాయి. వారి శ్రమను దారుణమయిన దోపిడికి గురి చేస్తూనే ఎంతోమంది వ్యాపారస్తులు లక్షలు, కోట్లు సంపాదిస్తున్నారు. ఎంతోమంది దళారులు పట్టణాల్లో, మహా నగరాల్లో వర్థిల్లుతున్నారు. ఇటువంటి దుర్భర పరిస్థితి మెరుగు పడాలి. ఒక రంగాన్ని ఇంకో రంగానికి పోటీ పెట్టి ఒక రంగం ఇంకో రంగానికి వినాశకారిగా మారడాన్ని ఎదుర్కొనాలి. అలా జరగకుండా నియంత్రించాలి.

చేనేతరంగాన్ని తీర్చిదిద్దాలి

చేనేత రంగంలో శ్రమను తగ్గించడానికి ఆధునిక పద్ధతులు, వసతులు కలిగించాలి. చేనేతలో నైపుణ్యాన్ని మెరుగుపరచడం జరగాలి. ఆయా ప్రాంతాల చేనేత వైవిధ్యాన్ని నిలబెట్టుకుంటూనే మరింత ఆధునికతను వస్త్ర తయారీలో తీసుకురావాలి. చేనేతపై ఆధారపడి జీవించే మిగులు శ్రామికులకు శిక్షణ ఇవ్వడం ద్వారా ఇతర రంగాలకి అంటే పవర్ మగ్గాలు, దుస్తుల పరిశ్రమల్లోకి మార్గాలు ఏర్పాటు చెయ్యాలి.

చేనేతరంగ కుటుంబాలలోని యువతీ, యువకులను వారి వారి నైపుణ్య స్థాయినిబట్టి బట్టలు చేనేత రంగంలో ఎంతవరకు రాణించగలరో గుర్తించి మరింత మెరుగయిన ట్రైనింగ్ ద్వారా వారిని పునస్సంఘటితం చెయ్యాలి.

ప్రపంచ మార్కెట్‌లో నిజమైన, నాణ్యమైన, వైవిధ్యమైన చేతి ఉత్పత్తులకు, దుస్తులకు మంచి గిరాకీ ఉంది. పెరుగుతోంది కూడా. మన దేశంలోనూ గిరాకీ పెరుగుతోంది. దీనిని పునస్సంఘటితం చెయ్యడంలో చేనేత రంగాన్ని సంక్షోభం నుండి బయట పడవేసి మేలయిన భవిష్యత్తు కల్గించవచ్చు.

దుస్తుల పరిశ్రమ:

దేశంలో సాంప్రదాయకంగా ఏర్పడి ఉన్న చేనేత ప్రాంతాలలో దుస్తుల పరిశ్రమ, మరమగ్గాలు, ఆధునిక ప్రాసెసింగ్, ప్రింటింగ్ సెంటర్, ట్రైనింగ్ సెంటర్, అంతర్జాతీయ మార్కెటింగ్ సెంటర్ స్థాపించాలి. ఇక్కడి చేనేత మగ్గాలను మెరుగు పరచుకుంటూనే, అక్కడి నైపుణ్యాన్ని ని కాపాడుకుంటూనే ఆ ప్రాంతాలలో సాంప్రదాయకంగా లభ్యమయ్యే అదనపు మానవ వనరులను తదితర వస్త్ర, దుస్తుల ఉత్పత్తి రంగంలో ఇముడ్చుకోవడం ఈనాడు జరగాల్సిన శాస్త్రీయ పద్ధతి.

గృహాలంకరణ, సాంకేతిక వస్త్రాలు-ఆటోమాటిక్ మగ్గాలు

ఆధునిక వస్త్ర ఉత్పత్తులెన్నో వ్యవసాయ, వైద్య, రోదసి, సైనిక, గృహ అలంకరణ తదితర ఎన్నో రంగాలలో ప్రాముఖ్యత సంతరించుకొంటున్నాయి. ఆధునిక ఆటోమెటిక్ వస్త్ర రంగాన్ని ఇటువంటి ఉత్పత్తులకై కేటాయించాలి. ఆ రకంగా అవి నిర్వర్తించాల్సిన పాత్ర కూడా చాలానే ఉంటుంది.

చేనేత-మరమగ్గాలు-ఫ్యాషన్స్

వివిధ సెక్షన్‌ల ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులను బట్టి వారి అభిరుచులను బట్టి చేనేత, మర మగ్గాల రంగాల్ని నియంత్రించి రెండు రంగాలను వైవిధ్యమైన దుస్తుల పరిశ్రమకు మంచి పునాదిగా తీర్చిదిద్దాలి. ప్రధానంగా ప్రభుత్వ జౌళిరంగ విధానం కొంతమంది పరిశ్రమాధి పతులకు కనక ప్రసాదంగా కాక విస్తృత ప్రజానీకానికి మెరుగయిన జీవనాన్ని ఇచ్చేదిగా మార్చడానికి ఉద్యమించాలి తప్ప అశాస్త్రీయ మార్గాన్వేషణ వల్ల ఒనగూడేది శూన్యం.

శ్రామికులు, సహకార రంగం

సహకార రంగాన్ని పడిమేసేసే ఉమ్మడిదొడ్డిగా ఉన్న పరిస్థితి నుండి కాపాడి, శ్రామికులు చైతన్య యుతమయిన అవగాహనతో ఓ నూతన కర్తవ్యాన్ని, వ్యూహాన్ని, కార్యాచరణను రచించుకోవాలి. దళారీల బూజు దులిపి దళారీ రహిత వ్యవస్థ ఏర్పాటు చేసుకోగల్గితే దుస్తుల తయారీ గాని, చేనేత గాని, మరమగ్గాలు గాని, ఆటో మగ్గాలు గాని వారి నియంత్రణలోకి తెచ్చుకోగల్గాలి. అలా జరగాలంటే వారి రాజకీయ ఆలోచన కూడా సమూలమయిన మార్పుకు గురి కావాలి.

ఈ వివిధ రంగాలలో పనిచేసేవారి సంక్షేమం

చేనేత రంగంలో కాని, మరమగ్గాల రంగంలోకాని, ఆధునిక ఆటో మగ్గాల రంగంలో కాని, దుస్తుల తయారీ రంగంలోకాని పనిచేస్తున్న లక్షలాది జనాభా యొక్క పని పరిస్థితులు మెరుగుపడాలి. అలా జరగాలంటే ఆధునీకరణ అవసరం. ఆధునీకరణ, సంస్కరణ అనగానే ఇదేదో దోపిడీ పద్ధతి అని ముద్ర వేయడం సరైన ఆలోచన కాదు. ఈ సంస్కరణ, ఆధునీకరణ విస్తృత ప్రజానీకానికి మేలు చేస్తోందా లేదా అన్నది ప్రధానంగా గమనించాలి. నిరుద్యోగంతో బాధపడుతున్న ఎంతో మందికి కొత్త అవకాశాలు తప్పక రావాలి. ఆ అవకాశాలు మేలైన జీవితాలను ఇవ్వగల్గాలి. అంధకార బంధురంలో, దుర్భర శ్రమతో కూడుకున్న, పచ్చి దోపిడితో కూడుకున్న లక్షలాది పనివారి ప్రస్తుత జీవన పరిస్థితి మెరుగుదలకై ఓ నూతన ఉద్యమం రూపుదిద్దుకోవాలి.

ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులకు స్వతంత్ర ఆలోచన జోడించగల్గితే అన్ని రంగాలను ఒక సమైక్య ప్రణాళికలో ఇమడ్చ గల్గితే ప్రజలకు ఈ రంగం ఎంతో ఉపయోగకారిగా మారుతుంది.

ఇప్పటి అభిరుచులనుబట్టి చేనేత రంగాన్ని ఉపయోగించుకునే విధంగా వివిధమయిన, వైవిధ్యమయిన నూలు ఉత్పత్తులు నేసి, వాటిని చేనేత వస్త్రాలుగానే నేయడం, ఆ వస్త్రాలను వివిధ డిజైన్లలో మార్కెట్‌లోకి తీసుకురావడం ద్వారా గిరాకీ, అమ్మకాలు పెంచడం ఎంతయినా అవసరం. ఫ్యాషన్ డిజైనర్లు, టెక్స్‌టైల్ డిజైనర్లు, నూలు నిపుణులు వీరంతా గ్రూపుగా ఈ పనులు చెయ్యాలి. మార్కెటింగ్ చేసేవారు కూడా ఇందులో భాగస్వాములు కావాలి. రంగుల అద్దకం, తదితర ఇన్‌పుట్స్ ఇవ్వగల్గాలి. ఇది జరగడం లేదు కాబట్టి సంక్షోభం అలాగే ఉంటోంది. అంతేగాక వినియోగదార్లందరూ తప్పక తమ దుస్తులలో 15 శాతమైనా చేనేత వస్త్రాలు కలిగి ఉండాలనే విస్తృత ప్రచారం జరగాలి. ఈ ప్రచారం తో బాటు నూతన వస్త్రాలు, దుస్తులు అందుబాటులోకి తేగల్గితే చాలామట్టుకు పరిస్థితి మెరుగుపడుతుంది.

శిక్షణ, నైపుణ్యం మెరుగుదల

మారుతున్న అభిరుచుల కనుగుణంగా శిక్షణ, నైపుణ్యం పెరుగుదల జరగాలి. ఎన్నో శిక్షణా సంస్థలు వీటికోసం రూపొందాలి. దుస్తుల తయారీ ఒక వైవిధ్యమయిన ఇంజనీరింగ్ వ్యవస్థ. దానికి నైపుణ్యంగల ఆపరేటర్లు, సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, మాస్టర్లు, కట్టర్లు, ఐరనర్లు, ఫినిషర్లు, చెక్కర్లు ఇలా ఎన్నో బ్రాంచెస్‌లో పనిచేసే వారు కావాలి. మనరాష్ట్రం ఈ విషయంలో ఎంతగానో వెనుకబడి ఉంది.

ప్రభుత్వం ఇటువంటి వాటికి కేటాయించే సొమ్ము ఒకరిద్దరు దళారీలు బోగస్ పద్ధతుల్లో కొట్టేసి కోటీశ్వరులయ్యారు. వారు ఈ రచయితకు స్వయంగా తెలును. చంద్రబాబు హయాంలో తొమ్మిదికోట్ల రూపాయిలు ఈ రకంగా మేసేయడం జరిగింది. ఇప్పటి ప్రభుత్వం కొత్తగా ఓ రెండు కోట్లు అదే వ్యక్తి ద్వారా ఈ ట్రయినింగ్ స్కీము అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సొమ్ము కాజెయ్యడానికి జిల్లాలవారీగా ఈ వ్యక్తి ఓ వ్యవస్థను ఏర్పాటు చేసి డిఆర్‌డబ్ల్యుఎ మొదలయిన స్కీములను వాడుకుంటూ ఎక్కడికక్కడ డబ్బు చేసుకొంటున్నాడు. నిజమయిన ట్రయినింగ్ పరిశ్రమకు అనుగుణంగా కావలసిన విధంగా కాక, ఓ కంటితుడుపుగా ఇచ్చి మిషన్లు అమ్మడం ద్వారా డబ్బు చేసుకొంటున్నాడు. ఇదో పెద్ద స్కాము. ఇది వెలికి తీసి దోషులను, ద్రోహులను శిక్షించి ప్రభుత్వం సరైన పాలసీ, సరైన వ్యక్తులు, సంస్థల ద్వారా అమలు చెయ్యాలి. వీటిపై నిఘా, నియంత్రణ, ఆడిట్ ఉండాలి. అవి ఇప్పుడు మృగ్యం. కేవలం డబ్బులు దండుకోవడానికే ఈ స్కీములు. నిజంగా లబ్ధిపొందాల్సిన వారు అలాగే మిగిలిపోతున్నారు. దీనివల్ల రావలసిన పరిశ్రమలు రావడం లేదు. ఉపాధి దొరకడం లేదు. ఇది చాలా విచారకరమైన పరిస్థితి.

ముందుగా ఇచ్చిన పట్టిక తిరిగి గమనించినట్లయితే, కేవలం నూలు ఉత్పత్తి రాష్ట్రంగా ఉన్న ఈ రాష్ట్రం చెయ్యాల్సినది ఎంతో ఉంది. తమిళనాడు, గుజరాత్, మహారాష్ట్రతో పోల్చుకున్నా, అక్కడి పరిశ్రమను అధ్యయనం చేసినా ఇది ఇంకా బాగా అర్థమౌతుంది. అవకాశాలుండి కూడా మన ప్రజలు ఎలా నిరుద్యోగులుగా ఉండి పోతున్నారో విశదమౌతుంది.

ప్రభుత్వం వీటిన్నింటిపై దృష్టి కేంద్రీకరించినట్లయితే కొంత కాకపోయినా కొంతైనా మేలు జరుగుతుంది. అంతేగాక కేవలం నినాదాలకే పరిమితమైన ఎర్రజెండా నీడలోని మిత్రులు ఈ విషయాలపై దృష్టి సారించడం ఎంతైనా అవసరం.

]

వైవిధ్యం చూపని వై ఎస్ పాలన

-టి.ఎన్.వి. రమణ
సి.ఐ.టి.యు. రాష్ట్ర కమిటీ సభ్యుడు

వై. ఎస్.రాజశేఖర రెడ్డి నాయకత్వంలో ఏర్పడిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి 9 మాసాలు నిండాయి. చంద్రబాబు ప్రభుత్వం అమలు జరిపిన ప్రపంచబ్యాంకు విధానాల పర్యవసానంగా కార్మికులు, ఉద్యోగుల జీవితాలు అస్తవ్యస్తమైనాయి. కార్మిక వ్యతిరేక విధానాలను అమలు జరిపినందున లక్షలాది మంది వీధుల పాలయ్యారు. కొత్త ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత కార్మికులు, ఉద్యోగుల్లో మళ్ళీ ఆశలు చిగురించాయి. ఉద్యోగులకు స్థిరత్వం వస్తుందని ఆశించారు. ఎన్నికల ముందు ప్రతిపక్ష నాయకుడి హోదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి తమ పార్టీకి అధికారం అప్పగిస్తే కార్మికుల, ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తానని, గత ప్రభుత్వపు కార్మిక వ్యతిరేక విధానాలను వెనక్కు తీసుకుంటామని హామీ ఇవ్వడం దీనికి కారణం.

చంద్రబాబు ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రపంచబ్యాంకు ప్రయోగశాలగా మార్చింది. కార్మికులు, ఉద్యోగులపై అప్రకటిత యుద్ధానికి పూనుకుంది. రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలను ప్రపంచబ్యాంకు సలహా మేరకు ప్రైవేటీకరించడానికి పథకాన్ని సిద్ధం చేసింది. ఈపథకం యథాతథంగా అమలు జరిగితే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దివాళా తీసేది. ఇంతలో ఎన్నికలు వచ్చాయి. తెలుగుదేశం విధానాలతో అసంతృప్తి చెందిన ప్రజలు ఆ పార్టీని ఓడించారు. సూటిగా చెప్పాలంటే ప్రపంచబ్యాంకు విధానాలను ఓడించారు. అయినప్పటికీ ఆ విధానాలు అలాగే ఉన్నాయి. ఆ విధానాలను కొత్త ప్రభుత్వం రద్దు చేయాలని ప్రజలు కోరుతున్నారు. వై.ఎస్. ప్రభుత్వానికి గల ఏకైక ఎజెండా గత ప్రభుత్వ పాపాలను కడిగేయడం.

తొమ్మిది మాసాలలో కొత్త ప్రభుత్వం నడక ఎలా ఉన్నది? ఉద్యోగుల, కార్మికుల కోణం నుండి పరిశీలించే ప్రయత్నం చేద్దాం. ఉద్యోగుల, కార్మికుల సమస్యలనుస్థూలంగా రెండు రకాలుగా విడగొట్టుకుంటే ఆర్థిక, ఆర్థికేతర అంశాలుగా అనుకోవచ్చు.

ఆర్థికేతర అంశాలను విడివిడిగా పరిశీలిద్దాం.

రెండవదశ సంస్కరణలలో భాగంగా సింగరేణి, ఆర్టీసి లను 2007లో ప్రైవేటీకరించాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. వీటిలో రెండు లక్షల మంది కార్మికులు పని చేస్తున్నారు. పన్నుల రూపంలో వీటి నుండి ప్రభుత్వానికి వందల కోట్లు ఆదాయం వస్తున్నది. వీటిని ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తే కార్మికులకుఉద్యోగాలు ఉంటాయి, ప్రభుత్వానికి ఆదాయం చేకూరుతుంది. ఆర్టీసి విషయాన్ని గమనిస్తే ప్రైవేటు వాహనాలను రద్దు చేయాలి. దానిలో ఆర్టీసితో ప్రయాణికుల సంఖ్య పెరిగి, సంస్థకు లాభాలు వస్తాయి. తగు మోతాదులో ప్రభుత్వానికి పన్నుల రూపంలో ఆదాయం కూడా పెరుగుతుంది. గత ప్రభుత్వ కాలంలోనే ఈ రెండు సంస్థల కార్మికులు తమ సంస్థలు ప్రైవేటీకరణ చేయరాదని వీరోచితంగా వారాల తరబడి సమ్మె చేసి ప్రభుత్వాన్ని వెనుకకు నెట్టారు. కావున వారి ఆకాంక్షలకు అనుగుణంగా వై.ఎస్.ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని రద్దు చేయాలి. పైసా ఖర్చులేని పని ఇది.

గత ప్రభుత్వం అనేక కార్మిక వ్యతిరేక జి.వో.లను జారీ చేసింది. వాటిని రద్దు చేయాలి. వివరాలు కింది పట్టికలో చూడవచ్చు. వాటిని రద్దు చేయటం వలన ప్రభుత్వంపైన పడే పైసా భారం లేదు.

జి.వో.నెం.	డిపార్టుమెంటు	వివరణ
40	లేబర్	కార్మిక చట్టాల అమలు తనిఖీలు సంవత్సరానికి ఒకసారికే పరిమితం. ముందుగా పై అధికారుల అనుమతి, యజమానులకు సమాచారం ఇవ్వడం.
33	లేబర్	తనిఖీల తదుపరి చర్యలకు కూడా పై అధికారుల అనుమతి కావాలి.
గెజిట్ 26	లేబర్ & ఫ్యాక్టరీస్	ఫ్యాక్టరీ కార్మికుల ఆరోగ్యం, భద్రత, హక్కులకు రక్షణ కల్పించనవసరం లేని విధంగా రూల్స్ సవరణ.
90	హెల్త్, మెడికల్	ఆసుపత్రుల నిర్వహణ సొసైటీలకు బదలాయింపు.
24	ఫైనాన్స్	వర్క్‌చార్జ్‌డ్ ఉద్యోగులతో సహా సర్ప్లస్ ఉద్యోగులను ఫైనాన్స్ శాఖలోని సర్ప్లస్ సెల్‌కు బదలాయింపు.
21	లేబర్	కనీస వేతనాల అమలు నుండి సహకార సంఘాలకు ఒక సంవత్సరం పాటు మినహాయింపు.
292	పంచాయతీరాజ్	గ్రామసేవకులు ప్రతినెలా వేతనాలు తీసుకునే ముందు గ్రామ కార్యదర్శి సంతకం కావాలి. వేధింపులకు దారి తీస్తుంది.

కనీసవేతనాలు చెల్లించాల్సిన సంస్థలలో తనిఖీ నిర్వహించి కనీసవేతనాలు అమలు జరిపించాల్సిన కార్మిక శాఖకు ఆ అధికారం లేకుండా గత ప్రభుత్వం చట్టంలో మార్పు చేసింది. తనిఖీ అధికారం కార్మికశాఖకు పునరుద్ధరించి కనీసవేతనాల చెల్లింపును కచ్చితంగా అమలు జరిగేలా చూడాలి. ప్రభుత్వంకు పైసా ఖర్చు లేని పని ఇది. కాని కార్మికులకు చాలా ప్రయోజనం జరుగుతుంది.

కనీసవేతనాల సవరణ ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి చేస్తారు. గతంలో 1999లో సవరించిన బీడీ, ప్రైవేట్ రవాణా, తదితర రంగాలలోని వేతనాలను 2004 నవంబర్‌లో సవరించాల్సి వున్నది. కాని ఇప్పటి వరకు అది జరగలేదు. ఒకవైపు కనీసవేతనాలు పెరగక, మరో పక్క ధరలు పెరిగి ఇబ్బందుల పాలౌతున్న అసంఘటిత రంగంలోని కార్మికులకు ఇప్పటికైనా ఉపశమనం కలిగేలా కనీసవేతనాలను పెంచవచ్చు.

కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచుతూ జి.వో.40 విడుదల అయింది. ఎన్నడూ లేని విధంగా ముసాయిదాలో ప్రతిపాదించిన పెరుగుదల కంటే తక్కువగా వేతనాలను నిర్ణయించారు. కరువు భత్యం కల్పించాలని కాంట్రాక్టు కార్మికులు అనేక సంవత్సరాల నుండి కోరుతున్నారు. అదీ ఇవ్వలేదు. పెరిగిన వేతనాలను సంస్థలే చెల్లిస్తాయి. ప్రభుత్వంపై భారం పడదు.

అసంఘటిత కార్మికుల సంక్షేమ పథకం ప్రభుత్వం ప్రకటించవచ్చు. వీటికి నిధులను ప్రభుత్వం అసంఘటిత కార్మికులు పని చేస్తున్న సంస్థలపై ఒక శాతం టర్నోవర్ పన్నును విధించి సమీకరించవచ్చు.

కాంట్రాక్టు కార్మికుల చట్టంలో గత ప్రభుత్వం సవరణ చేసింది. నాన్‌కోర్ రంగంలోని శాశ్వత పనులలో కూడా కాంట్రాక్టు లేబర్‌ను పెట్టవచ్చని, కోర్ రంగంలోని శాశ్వత పనులలో పరిమిత కాల పనుల పేరుతో కాంట్రాక్టు లేబర్‌ను నియమించవచ్చని సవరణ చేశారు. శాశ్వత పనులలో ఎక్కడైనా ఏదో ఒక పేరు చెప్పి కాంట్రాక్టు కార్మికులను వినియోగించుకోవచ్చు అనేది ఆ సవరణ యొక్క అర్థం. కొత్త ప్రభుత్వం ఈ సవరణను రద్దు చేయాలి. దీనికి పైసా ఖర్చు ఉండదు. అప్పుడే శాశ్వత పనులలో పని చేసే కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులు పర్మినెంటు అయి వారికి పనులలో భద్రత, బ్రతుకులో భద్రత ఏర్పడుతుంది.

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 'సమ్మెహక్కు' లేదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఇది రాజ్యాంగ విరుద్ధం. పశ్చిమబెంగాల్, త్రిపుర రాష్ట్రాలలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సమ్మె హక్కును కల్పిస్తూ అక్కడి వామపక్ష ప్రభుత్వాలు నిర్ణయం తీసుకున్నాయి. అదే దారిలో మన రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉద్యోగులకు సమ్మెహక్కును కల్పించాలి.

గత ప్రభుత్వం రాష్ట్ర రాజధానిలో నిర్వహించబడే నిరసన ప్రదర్శనలను కట్టడి చేసేందుకు ఏ ప్రదర్శన జరిగినా ఇటు సుందరయ్యపార్కు నుండి అటు ఇందిరాపార్కు లేక అటు నుండి ఇటు అనే పద్ధతిని ప్రవేశపెట్టి నిరసన తెలిపే హక్కును కట్టడి చేసింది. ఈ ప్రభుత్వం వైస్‌రాయ్ హోటల్ వెనక భాగం గోశాల నుండి ఇందిరాపార్కు అని మరింత కట్టడి చేస్తున్నది. జన సంచారం లేని ప్రాంతంలో నిరసన తెలిపితే నిరసనకారుల బాధలు ఇక ప్రజలకు తెలిసేది ఎలా? ప్రజాతంత్ర హక్కుల గొంతు పిసకడమే దీని ఉద్దేశ్యం. కావున ఈ నిర్ణయాన్ని రద్దు చేసి ప్రజాతంత్ర హక్కులను పునరుద్ధరించాలి.

దిగువ ఇచ్చిన పట్టిక ఉద్యోగుల కుదింపుకు ఉద్దేశించింది. ఇందులోని ఉద్యోగులను కొనసాగించినా ప్రభుత్వంపై కొత్తగా ఆర్థిక భారం ఏమీ ఉండదు.

జి.వో.నెం.డి	పార్టుమెంటు	వివరణ
94	జనరల్ అడ్మినిస్ట్రేషన్	ప్రభుత్వ శాఖలలో కాంట్రాక్టు ఉద్యోగుల నియామకం
సెక్షన్ 116సి(1)	ఎ.పి.సి.ఎస్.యాక్ట్,1964	పెద్ద యెత్తున సహకార ఉద్యోగుల తొలగింపుకు దారి తీసే సవరణ.
308	అగ్రికల్చర్, కోఆపరేషన్	వ్యవసాయ పరపతి సహకార సంఘాల ఉద్యోగుల తొలగింపు.
94	అగ్రికల్చర్, కోఆపరేషన్	వ్యవసాయ పరపతి సహకార సంఘాల ఉద్యోగుల తొలగింపు.
331	అగ్రికల్చర్, కోఆపరేషన్	29 సహకార సంస్థల మూసివేత/ ప్రైవేటీకరణ/ పునర్వ్యవస్థీకరణ.
16	పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్	ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులకు తప్పనిసరి వి.ఆర్.ఎస్.
25	పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్	ప్రైవేటీకరించబడే సంస్థల ఉద్యోగులను తీసు కోవటమా లేదా అనే హక్కు కొత్త యజమానిది.

రాష్ట్ర ప్రభుత్వంలో మొత్తంగా 3లక్షల 75వేల మంది కాంట్రాక్టు పద్ధతిపై పని చేస్తున్నారు. వీరిలో (1) రాష్ట్ర ప్రభుత్వంలోని 28 శాఖల్లో 2 లక్షల మంది కాంట్రాక్టు ఉద్యోగులుగా, (2) లక్షమంది రాష్ట్ర ప్రభుత్వం లోని వివిధ కార్పొరేషన్లలో, యూనివర్సిటీలలో, హాస్టల్స్‌లో, ఫారెస్టు డిపార్టుమెంట్ తదితర శాఖల్లో ఎన్ఎంఆర్, కంటింజెంట్, డైలీవేజ్ వర్కర్లు, (3) మరో 75వేల మంది పంచాయితీ, మున్సిపాలిటీ, ఎలక్ట్రిసిటి తదితర శాఖల్లో కాంట్రాక్టు కార్మికులుగా పని చేస్తున్నారు. కాంట్రాక్టు పద్ధతిపై పని చేస్తున్న వారిలో అత్యధికులు శాశ్వత స్వభావంగల పనిలోనే ఉన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులలో 90వేల మంది విద్యా వాలంటీర్లుగా, స్పెషల్ విద్యా వాలంటీర్లుగా, మండల రిసోర్సు టీచర్లుగా, నిరంతర విద్యా ప్రేరకులుగా, బాలజ్యోతి టీచర్లుగా, తదితర కేటగిరీల్లో ప్రాథమిక విద్యాశాఖలో పని చేస్తున్నారు. ఉన్నత విద్యాశాఖలో 20వేల మంది కాంట్రాక్టు లెక్చరర్లుగా, ఒకేషనల్ పార్ట్‌టైమ్ లెక్చరర్లు, ఇతర కేటగిరీల్లో పని చేస్తున్నారు. సాంకేతిక విద్యాశాఖలో పాలిటెక్నిక్ కాంట్రాక్టు లెక్చరర్లు తదితర కేటగిరీల్లో 5వేల మంది పని చేస్తున్నారు. వ్యవసాయ శాఖలో 7వేల మంది బహుళార్థక విస్తరణాధికారులుగా (ఎం.పి.ఇ.వో), కాంట్రాక్టు పంచాయితీ కార్యదర్శులుగా 4వేల మంది, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖలో 3వేల మంది, సిడిపిఓ, సూపర్‌వైజర్, జూనియర్ అసిస్టెంటు, డేటా ఆపరేటర్లుగా, అనేక ప్రభుత్వ శాఖల్లో గుమాస్తాలుగా, డిపిఓలుగా, ఆరోగ్యశాఖలో 15 వేల మంది వివిధ కేటగిరీల్లోనూ, వెలుగు ప్రాజెక్టులో 25వేల మంది పని చేస్తున్నారు. రూరల్ వాటర్ సప్లయి, ఇంకా అనేక కేటగిరీల్లో కాంట్రాక్టు ఉద్యోగులు పని చేస్తున్నారు. కాంట్రాక్టు పద్ధతిపై పని చేస్తున్న వారిలో అత్యధికులు శాశ్వత స్వభావం గల పనిలోనే ఉన్నారు. కావున ఎన్నికల వాగ్దానానికి అనుగుణంగా కాంట్రాక్ట్ పద్ధతిని రద్దు చేసి వీరిని పర్మినెంట్ చేయాలి. 6 నెలల నుండి బకాయిపడి ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలి. ప్రతినెలా జీతం ఇచ్చేలా చర్యలు చేపట్టవచ్చు. సెలవులు, మహిళా ఉద్యోగులకు మెటర్నిటీ సెలవులు కల్పించవచ్చు. ప్రస్తుతం వీరికి జీతాలు ప్రభుత్వమే చెల్లిస్తున్నది. రెగ్యులరైజ్ చేసినంత మాత్రాన భారం పెరగదు.

వ్యవసాయంతో ముడిపడిన మూడు రంగాలలో ఒకటి సహకార రంగం. రెండవది వ్యవసాయ శాఖలోని ఎం.పి.ఇ.ఓ.ల వ్యవస్థ. మూడు మార్కెటింగ్ రంగం. వ్యవసాయ రంగాన్ని పెద్ద సంక్షోభం ఆవరించింది. రైతుల ఆత్మహత్యల పరంపర కొనసాగుతున్నది. ఇందుకు గల అనేక కారణాలలో పరపతి, వ్యవసాయం పై సూచనలు ఇచ్చే యంత్రాంగం లేకపోవడం ప్రధానమైనవని రాష్ట్ర ప్రభుత్వం నియమించిన వ్యవసాయ కమిషన్‌కు చైర్మన్ అయిన ప్రొ॥ జయతీఘోష్ పేర్కొన్నారు. సహకార రంగం ద్వారా ప్రభుత్వం రైతులకు అప్పులిస్తున్నది. అందుకు 10వేల మందితో కూడిన సహకార వ్యవస్థ పని చేస్తున్నది. ఇప్పుడు ఆ వ్యవస్థను తొలగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ఇక ప్రభుత్వ రుణాలు కనుమరుగైపోతాయి. దీనితో రైతులు తప్పనిసరి పరిస్థితులలో ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల చేతిలో బందీలు అవుతున్నారు. పంటల గురించి సలహాలిచ్చే యంత్రాంగంలో 7వేల మంది ఎం.పి.ఇ.ఓ.లు వున్నారు. వీరిని తొలగించినందున పంటల గురించి సలహాలు ఇచ్చే ప్రభుత్వ యంత్రాంగం లేకుండా పోయింది. దీనితో రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అమ్మే వ్యాపారులు లాభాపేక్షతో ఇచ్చే సలహాలను పాటించాల్సిన పరిస్థితికి నెట్టబడ్డారు. 1966 మార్కెటింగ్ చట్టంతో ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్ కమిటీల వ్యవస్థ ఏర్పడింది. ఈ చట్టంలో మార్పులు చేసి మార్కెట్ కమిటీలను ప్రైవేట్ వారికి అప్పగించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. దీని మూలంగా వీటిలో పని చేసే 3వేల మంది పర్మినెంట్ ఉద్యోగులు, 3వేల మంది సెక్యూరిటీ గార్డ్స్, 4వేల మంది దడవాయిలు (వేమెన్), 70వేల మంది హమాలీ, చాట, పడేం తదితర కార్మికుల ఉపాధి ప్రమాదంలో పడుతున్నది. ప్రభుత్వానికి రు.350 కోట్లు వార్షిక ఆదాయం కూడా తగ్గిపోతుంది. ఇది వ్యవసాయాన్ని మరింత సంక్షోభంలోకి నెడుతుంది. ఈ రంగాలను కొనసాగించి అందులోని ఉద్యోగులకు రక్షణ కల్పించాలి. ఇది కూడా రాష్ట్ర ప్రభుత్వం చేతుల్లో వున్నదే.

రాష్ట్రంలోని 14 యూనివర్సిటీలలో 3వేల మంది ఎన్.ఎం.ఆర్.లు డైలీవేజ్ ఉద్యోగులుగా 5 నుండి 17 సంవత్సరాలుగా పని చేస్తున్నారు. వీరికి రూ.400 నుండి రూ. 1500 వరకు నెలసరి వేతనం చెల్లిస్తున్నారు. వీరి వేతనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం 'బ్లాక్ గ్రాంట్' పేరుతో నిధులను ఇస్తున్నది. 3వేల పైగానే ఖాళీలు ఉన్నాయి. ఉన్న ఖాళీలలో వీరినే పర్మినెంట్ చేయవచ్చు. అప్పుడు అయ్యే ఖర్చు కూడా ఈ 'బ్లాక్ గ్రాంట్'లోనే సరిపెట్టుకోవచ్చు. పర్మినెంట్ చేయాలనే ప్రతిపాదనలు యూనివర్సిటీ యాజమాన్యాలు ఇప్పటికే ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌కు పంపి ఉన్నాయి. వాటిపై ప్రభుత్వం వెంటనే నిర్ణయం చేయవచ్చు.

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 1997లో వృత్తిపన్నును నెలకు రూ.20 ల నుండి రూ.100 లకు గత ప్రభుత్వం పెంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో వసూలు చేయకుండా వెనుకడుగువేసింది. ఇప్పుడు జి.వో.6ను విడుదల చేశారు. 1997 నుండి ఇప్పటి వరకు బకాయిలను అంటే రూ.650 కోట్లు ప్రభుత్వ ఉద్యోగుల నుండి వసూలు చేయడానికి నిర్ణయించారు. ఇది పిడుగు లాంటి వార్త. ఒకవైపున పి.ఆర్.సి. ఇంటీరియం రిలీఫ్ కోసం ఎదురు చూస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను ఇది తీవ్రంగా కృంగతీసే అంశం.

ప్రభుత్వం నిధులు లేవనే కారణం చూపి ఉపాధి అవకాశాలను పెంచే బాధ్యత నుండి తప్పుకునే ప్రయత్నం చేయడం సరికాదు. ఉపాధిని పెంచాలి. మానవ వనరులను వినియోగంలోకి తేవాలి. ఎక్కడైతే మానవ వనరులు ఎక్కువగా వినియోగంలోకి వస్తాయో అక్కడే అభివృద్ధి సాధ్యమవుతుంది. ఇప్పటి బడ్జెట్‌లో కూడా ఉపాధి పెంపుదలకు, పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించలేదు. ప్రస్తుతం ప్రభుత్వ శాఖలలో రెండు లక్షల ఉద్యోగ ఖాళీలు ఉన్నాయి. వాటి భర్తీకి నిధులే ఆటంకం అయితే నిధులను సమకూర్చుకునే పద్ధతులను అన్వేషించాలి. అందుకు రెండు మార్గాలు ఉన్నాయి. ఒకటి పన్ను ఎగవేతను అరికట్టి పట్టుదలతో వసూలు చేయడం. రెండు నూతనంగా ఆవిర్భవిస్తున్న సంపన్న వర్గాలున్నాయి. ఎడ్యుకేషన్ సిండికేట్లు, సెక్యూరిటీ వ్యాపారులు, కార్పొరేట్ ఆసుపత్రులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, కార్పొరేట్ వ్యవసాయం, వినోదం పేరిట పెరుగుతున్న పబ్, క్లబ్, రిసార్టులు, ఇలాంటి వాటిపై పన్ను వేసి అదనంగా ఆదాయాన్ని సంపాదించుకోవచ్చు. ఇటువంటి సాహసోపేతమైన చర్యలు చేపట్టాలి. టింబరు, మైనింగు వంటి ప్రకృతి వనరుల వినియోగంపై అదనపు పన్నులు విధించి నిధులు సమకూర్చుకోవచ్చు.

నేడు విద్య, వైద్య సౌకర్యాలు కార్పొరేటీకరించబడ్డాయి. సంపన్నులకు తప్ప సామాన్యులకు అందుబాటులో లేవు. ఉద్యోగులు, కార్మికుల వేతనాలలో గణనీయమైన భాగం వీటికే ఖర్చుపెట్టాల్సి వస్తున్నది. కావున రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని నియంత్రించినట్లయితే రెండు రంగాలలో అవుతున్న ఖర్చులు కొంతలో కొంత తగ్గుతాయి. ఉద్యోగ వర్గాలకు మేలు జరుగుతుంది.

సింగరేణి, ఆర్టీసిని ప్రభుత్వరంగంలో కొనసాగించడం, కార్మిక వ్యతిరేక జి.వో.లను రద్దు చేయడం, ప్రభుత్వ వ్యవస్థలో కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడం, వ్యవసాయ సంక్షోభం నుండి రాష్ట్రాన్ని కాపాడే దిశలో భాగంగా సహకారరంగం, ఎంపిఇఓల వ్యవస్థను కొనసాగించడం, యూనివర్సిటీలలో ఎన్.ఎం.ఆర్., డైలీవేజ్ వర్కర్స్‌ను క్రమబద్ధీకరించడం, వృత్తిపన్నుకు సంబంధించి జి.వో.6ను రద్దు చేయడం, ఐదు సంవత్సరాలు గడిచిన రంగాలలో కనీసవేతనాలను సవరించడం, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సమ్మెహక్కును కల్పించడం లాంటి అంశాలు ఆర్థికభారం లేకుండానే చేయగల్గినట్టివి. వీటిని పూర్తి చేసి వై.ఎస్. ప్రభుత్వంపై ఉద్యోగులు, కార్మికులు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి. దీనిపై ముందు వెనకలాడాల్సిన పనిలేదు. అలా కాదని సందేహిస్తే చంద్రబాబు ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి తేడా లేదన్న నిర్ధారణకు ఉద్యోగవర్గం వస్తుందని గమనించాలి. *

(16వ పేజీ తరువాయి)

ఇరాన్-పాకిస్తాన్-ఇండియా గ్యాస్ పైపులైనుపై కూడా అంగీకారాలకు సలిలమార్గం ఏర్పడింది. ఈ పోకడలకు మనం చర్చిస్తున్న ప్రకటనే కారణమని చెప్పలేం కానీ, ఆ ప్రకటన కొంతమేరకు ఇండియా నిర్మొహమాట వైఖరిని ప్రదర్శించడం వలన కొంత ఫలితం ఉందనే తెలుస్తుంది. అయితే ఇండియా కూడా పాకిస్తాన్ విషయంలో రాజకీయ ప్రతిబంధకాలను తొలగించుకుందుకు సడలింపు శైలిని ప్రదర్శించాలి.

కాశ్మీర్ సమస్య విషయంలో అన్ని వర్గాలతో సంప్రదింపులను పారదర్శకతతో జరిపించి ఏదో విధంగా పరిష్కారానికి మార్గం తెరవాలి. కటువైన ప్రకటనలతో పాటు సౌమ్యమైన క్రియాక్రమం ఉండడం అసలు సిసలైన దౌత్య సత్సంప్రదాయం. సైనికశక్తి విషయంలో పాకిస్తాన్‌కు భయపడనవసరం లేదు కనుక కాశ్మీర్ విషయంలో సడలింపులకు ప్రాధాన్యత ఇవ్వనక్కరలేదని కొందరి అభిప్రాయం. కానీ సుస్థిర శాంతి భద్రతలు, తద్వారా చేపట్టగలిగే ప్రాంతీయ ఆర్థికాభివృద్ధి అవకాశాలను చేయిజార్చుకోరాదు. సాధ్యమైనంత రీతులలో పాకిస్తాన్‌తో సయోధ్య సాధించడానికి ఇండియా చొరవ తీసుకోవాలి.

సార్క్ భవిష్యత్తు ఇండియా పాత్రతో ఎంతైనా ముడిపడి ఉంది. కనుకనే ఇండియా బాధ్యత కూడా అంత ఎక్కువైనదే. పాకిస్తాన్ మాత్రం ఈ విషయంలో ఆదినుండి ప్రశ్నార్థకమైన వైఖరినే అనుసరిస్తోంది. అసలు సార్క్ మూల సూత్రాన్నే పాకిస్తాన్ మనస్ఫూర్తిగా ఆమోదించలేదు. దక్షిణాసియాలో వాణిజ్య ఆర్థిక సాంస్కృతిక సహకారం విస్తృతమైతే, రాజకీయ రంగాల్లో పాతుకున్న వైరుధ్యాలు క్రమంగా పరిష్కార సాధ్యమౌతాయనే భావన పాకిస్తాన్‌కు నచ్చదు. ఎందుకంటే ఇండియాతో రాజకీయ వివాదం అతి ముఖ్యమైనది. పరోక్ష కారణాల మూలంగా కాశ్మీర్ విషయంలో తన పట్టును సడలించడం, సవరించడం అనేది ఆదేశానికి రుచించదు. అయితే ఈ ధోరణిలో ఇస్లామాబాద్‌లో కూడ చెప్పుకోదగ్గ మార్పు వచ్చింది. ప్రజాభిప్రాయ సేకరణ మూలంగానే కాశ్మీర్ సమస్యను పరిష్కరించాలనే పూర్వపు పట్టును ఉపసంహరించుకునేందుకు తాను సిద్ధమని ముషారఫ్ ఏడాది క్రితమే చెప్పడమైనది. ఈ మార్పు ధోరణిని పురస్కరించుకొనే వాజ్‌పాయి హయాంలో శాంతి చర్చలు జరిగాయి. యుపిఏ ప్రభుత్వం చర్చల పరంపరను కొనసాగిస్తూంది. ఇవి సఫలీకృతం కావాలి.

సార్క్ పురోగమనానికి ఇండియా పాకిస్తాన్ భద్రతా సమస్యల పరిష్కారానికి సన్నిహిత సంబంధం ఉంది. కనుక సార్క్ విషయంలో తన పాత్రను విపులీకరిస్తూ ఇండియా చేసిన ప్రకటనతో సమానాంతరంగా రాజకీయ రంగంలో కూడా నిర్దిష్టమైన చొరవ చూపించడం అవసరం. *

నగరాలొద్దు-చిన్న పట్టణాలే హద్దు!

-నూర్‌బాషా రహంతుల్లా

55 లక్షల జనాభాతో అలవిమాలిన రీతిలో బలిసిపోయిన హైదరాబాద్ ఇంకా విస్తరించాలా? అభివృద్ధికోసం వెచ్చించే నిధులన్నీ కొన్ని నగరాలలోనే పరిమితం కావాలా? ఉబ్బి పేలిపోతున్న నగరాల కంటే చిన్న చిన్న పట్టణాలు రాష్ట్రమంతటా అభివృద్ధి చేయటం మంచిది కాదా!

20 కిలోమీటర్ల వ్యాసార్థం దాటిపోయాక ఇక ఆ నగర విస్తరణను ఆపివేయటం మంచిది. ప్రతిగా మరో చోట మరో చిన్న పట్టణాన్ని అభివృద్ధి చేయాలి. ఒకేచోట వేలాది ఎకరాల అడవుల్ని, వాటిలో జరిగే అక్రమాలనీ అభివృద్ధి చేసేకంటే, గిరిజన ప్రాంతాలుగా వాటిని అణచివేసే కంటే, ప్రతి పట్టణం చుట్టూ గ్రీన్ బెల్టులు ఏర్పరచాలి. గిరిజన ప్రాంతాల్లో కూడా చిన్న పట్టణాల సంఖ్య పెరగాలి. విశాఖపట్టణం విస్తరణ ఇక ఆగిపోవాలి. నిజాంపట్నం లాంటి ప్రదేశాలు మనకెన్నో ఉన్నాయి.

అభివృద్ధి అంతా నగరాలలోనే కేంద్రీకృత మవుతున్నందువల్ల గ్రామీణుల వలసలు ఆగడం లేదు. వృత్తికోసం, ఉపాధికోసం, వైద్యంకోసం, విద్యకోసం, వస్తువుల కొనుగోలు కోసం నిరంతరం గ్రామాల నుండి ప్రజల ప్రయాణం నగరాలకు, పట్టణాలకు జరుగుతోంది. పల్లెల్లో పేదలు అక్కడ నిలవలేకపోతున్నారు. ఓవైపు పల్లెటూళ్ళలో స్తబ్దత, మరోవైపు శరవేగంతో నగరీకరణ జరుగుతోంది. ఈ అసమానతల వల్ల, నగరాల్లో ప్రతిరంగంలోను స్పెషలిస్టుల దోపిడీ నిరాఘాటంగా కొనసాగుతోంది. గ్రామాల్లో పేదలకు పని దొరక్క అలమటించిపోతున్నారు. ఎక్కడ పని దొరికితే అక్కడికి మూటా ముల్లె సర్దుకొని వలసపోతున్నారు.

అందువలన ఏ పట్టణమైనా లక్ష జనాభా దాటితే ఇక దాని సైజు పెరగకుండా చెయ్యాలి. మన రాష్ట్రంలోని 28 వేల గ్రామాలు చిన్న చిన్న పట్టణాలుగా రూపాంతరం చెందేందుకు ప్రభుత్వం ప్రయత్నించాలి.

తరగతుల వారీ మన రాష్ట్రంలో పట్టణాల సంఖ్య

సంవత్సరం (1)	లక్షపైబడిన జనాభా (2)	లక్షలోపు 50వేలపైన (3)	50వేలలోపు 20వేలపైన (4)	20వేలలోపు 10వేలపైన (5)	10వేలలోపు 5 వేలపైన (6)	5వేల లోపు (7)	మొత్తం (8)
1901	1	--	11	44	60	--	116
1911	1	1	12	45	68	3	130
1921	1	2	13	45	74	14	149
1931	1	8	11	57	78	20	175
1941	1	10	21	55	122	2	211
1951	6	10	34	81	114	31	276
1961	11	8	50	71	70	1	211
1971	13	17	60	75	87	4	206
1981	20	30	87	65	28	4	234
1991	32	34	91	39	14	3	213
2001	39	43	46	23	20	2	173

2001 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో 28,123 గ్రామాలుంటే అందులో 1,779 గ్రామాల్లో అసలు జనం నివసించడం లేదు. అంటే ఈ 1,779 గ్రామాల్లో ప్రాథమిక సదుపాయాలు లేనందువల్ల ప్రజలు ఆ గ్రామాల్ని ఖాళీచేసి వెళ్ళిపోయారన్నమాట! మరోప్రక్క పట్టణాలలో మురికివాడలు పెరిగిపోతూన్నాయి. నగరాలు నరక కూపాలవుతున్నాయి. క్లాస్-1 నగరాల పెరుగుదలకు ఇకనైనా బ్రేకులు వేసి క్లాస్-3,4,5 అభివృద్ధి మీద ప్రభుత్వం దృష్టి సారించాలి.

రాష్ట్రంలో లక్ష జనాభా దాటిన నగరాలు, పట్టణాలు

(1)	2001 జనాభా (2)	పదేళ్ళలో పెరుగుదల% (3)	మురికవాడల జనాభాశాతం (4)
హైదరాబాద్	5534	27	21
విశాఖపట్నం	1330	26	13
విజయవాడ	1011	21	26
వరంగల్	577	23	40
గుంటూరు	515	9	33
రాజమండ్రి	408	2	27
నెల్లూరు	405	28	39
కాకినాడ	369	10	16
కర్నూలు	321	17	38
తిరుపతి	303	44	25
నిజామాబాద్	287	19	57
కడప	261	21	13
అనంతపురం	244	33	28
రామగుండం	237	10	40
కరీంనగర్	216	40	16
ఏలూరు	215	3	49
ఖమ్మం	197	32	33

(1)	(2)	(3)	(4)
విజయనగరం	196	10	35
మచిలీపట్నం	183	15	54
చీరాల	167	17	51
ప్రొద్దుటూరు	165	23	29
ఆదోని	161	18	14
నంద్యాల	156	30	36
చిత్తూరు	153	15	37
ఒంగోలు	153	19	3
తెనాలి	150	4	51
భీమవరం	142	17	32
మహబూబ్‌నగర్	139	19	37
ఆదిలాబాద్	129	37	50
హిందూపూర్	125	20	50
మంచిర్యాల	118	40	42
గుంతకల్లు	117	9	48
శ్రీకాకుళం	117	32	42
గుడివాడ	112	10	32
నల్గొండ	112	32	13
మదనపల్లి	107	45	21
కొత్తగూడెం	105	3	70
ధర్మవరం	103	31	70
తాడేపల్లిగూడెం	102	15	42

50వేల నుండి లక్షలోపు జనాభాగల పట్టణాలు

(1)	(2)	(3)	(4)
నరసరావుపేట	97	9	60
సూర్యాపేట	95	57	57
మిర్యాలగూడ	91	38	42
చిలకలూరిపేట	90	14	39
జగిత్యాల	89	32	57
తాడిపత్రి	87	22	39
అనకాపల్లి	85	-	30
కావలి	84	28	15
ఎమ్మిగనూరు	76	17	72
కదిరి	76	20	65
పాలకొల్లు	76	3	25
గూడూరు	75	33	29
నిర్మల్	74	28	39
రాయచోటి	72	39	-
బోధన్	71	11	48
తణుకు	71	13	35
శ్రీకాళహస్తి	71	15	76
పాల్వంచ	69	29	60
బాపట్ల	68	9	20
బెల్లంపల్లి	67	-	46
మందమర్రి	66	-	39
సిరిసిల్ల	65	30	17
కామారెడ్డి	64	32	-
సిద్ధిపేట	62	14	55
కాగజ్‌నగర్	60	4	66
నరసాపురం	59	4	51
మార్కాపురం	58	28	-
తాండూరు	58	27	-
సంగారెడ్డి	57	13	51
పొన్నూరు	57	4	40
రాయదుర్గం	54	33	-
కోరుట్ల	54	35	-
గద్వాల	54	35	-
సామర్లకోట	53	9	-
వినుకొండ	53	52	-
సత్తెనపల్లి	51	13	-
అమలాపురం	51	11	-
నూజివీడు	50	18	-
పిఠాపురం	50	14	-
వనపర్తి	50	29	-
తుని	50	14	-
బొబ్బిలి	50	16	-
కందుకూరు	50	21	-

50వేల జనాభాలోపు గల మునిసిపాలిటీలు, నగర పంచాయతీలు

(1)	(2)	(3)	(4)
పార్వతీపురం	49	14	-
మాచర్ల	49	12	-
సాలూరు	48	11	-
బోనగిరి	47	16	-
భీమునిపట్నం	47	13	-
మండపేట	47	11	-
పెద్దాపురం	45	6	-
నిడదవోలు	43	5	-
రేపల్లె	41	12	-
రామచంద్రాపురం	41	12	-
సదాశివపేట	35	15	-

మునిసిపాలిటీలు, నగర పంచాయితీలు

(1)	(2)	(3)	(4)
పలాసకాశీబుగ్గ	50	30	-
జహీరాబాద్	45	13	-
పుంగనూరు	44	31	-
జనగామ	44	27	-
వికారాబాద్	42	8	-
భైంసా	41	38	-
జగ్గయ్యపేట	40	10	-
కొవ్వూరు	39	9	-
ఆముదాలవలస	38	10	-
నారాయణపేట	38	12	-
ఇచ్ఛాపురం	33	10	-
పెడన	30	7	-
ఎర్రగుంట్ల	27	39	-
ఎల్లందు	42	10	-
మెదక్	42	18	-

హైదరాబాద్‌పట్టణ సముదాయ జనాభాలో చేరిన మునిసిపాలిటీలు

(1)	(2)	(3)	(4)
కూకట్‌పల్లి	291	56	-
ఎల్.బి.నగర్	281	72	-
కుత్బుల్లాపూర్	226	112	-
మల్కాజ్‌గిరి	175	38	-
రాజేంద్రనగర్	162	62	-
కాప్రా	159	81	-
శేరిలింగంపల్లి	151	108	-
ఉప్పల్	119	57	-
ఆల్వాల్	108	60	-

విశాఖపట్టణ సముదాయంలో చేరిన మునిసిపాలిటీలు

గాజువాక	276	43	-

విజయవాడ పట్టణ సముదాయంలో చేరిన మునిసిపాలిటీలు

మంగళగిరి	61	3	52

1991-2001 మధ్య 100 శాతం కంటే ఎక్కువగా జనాభా పెరిగిన ప్రాంతాలు

ఊరిపేరు	2001జనాభా(వేలలో)	పెరుగుదల శాతం
జిల్లెలగూడ (హైదరాబాద్)	12	294
కుతుబుల్లాపూర్ (,,)	226	112
శేరిలింగంపల్లి (రంగారెడ్డి)	151	108
మక్తాబీబి సాహెబ్‌గూడ (,,)	1	535
మీర్‌పేట (రంగారెడ్డి)	13	154
పోతినమల్లయ్యపాలెం (విశాఖ)	7	176
మధురవాడ (విశాఖ)	18	117
వేపగుంట (విశాఖ)	27	114
మోరంపూడి (రాజమండ్రి)	2	234
పాకలపూడి (కాకినాడ)	15	111
అవిలాల (తిరుపతి)	12	152
అక్కరంపల్లె (తిరుపతి)	20	289
రామరాజుపల్లె (కడప)	4	133
అనంతపురం రూరల్	8	134
సీతారాంపూర్ (కరీంనగర్)	2	112
గవరవరం (ఏలూరు)	8	110
తంగెళ్ళమూడి (ఏలూరు)	5	112
దస్నాపూర్ (ఆదిలాబాద్)	20	108
తీగలపహాడ్ (మంచిర్యాల)	33	167
బొల్లారం (మెదక్)	13	214
పాపంపేట (అనంతపురం)	9	125

1952లో కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడినపుడు హైకోర్టును గుంటూరులో పెట్టారు. పౌర ప్రాధాన్యతగల పీఠాలన్నీ ఒకే నగరంలో తిష్టవేయకుండా అన్ని ప్రాంతాలూ సమంగా అభివృద్ధి చెందాలన్న దూరదృష్టితో ఆనాటి పెద్దలు అలా చేశారు. మరి ఈనాడు అన్నిటికీ హైదరాబాదే దిక్కు. నగరం ఉబ్బిపోక ఏం చేస్తుంది? ఓపెన్ యూనివర్సిటీ నాగార్జున సాగర్‌లో శంకుస్థాపన చేస్తే దాన్నీ హైదరాబాద్‌కే తరలించారు. హైదరాబాద్ నుండి ఇలాంటి పీఠాలన్ని రాష్ట్రంలోని ఆరు జోనులకు తిరిగి రావాలి. ఆరు జోనులూ సమానంగా అభివృద్ధి చెందాలి.

*

బడ్జెట్ అంటే ఏమిటి?

-డి. పాపారావు

ఫిబ్రవరి నెల అసెంబ్లీ సమావేశాల సందర్భంలో రాష్ట్ర ఆర్థిక శాఖామంత్రి రాష్ట్ర శాసనసభలో రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. ఫిబ్రవరి ఆఖరిరోజున లోక్‌సభలో కేంద్ర ఆర్థికమంత్రి కేంద్రబడ్జెట్ ప్రవేశపెడతారు. కొంతమంది ఆర్థికవేత్తల దృష్టిలో ఈ బడ్జెట్ ఆదాయాన్ని పేదలకు అనుకూలంగా పంపిణీ చేసే శక్తివంతమైన సాధనం. అయితే ఇదంతా వాస్తవం కాదని ఈ వ్యాసంలో ముందు ముందు చూద్దాం. ప్రపంచ వ్యాప్తంగా సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణల పేరిట 'సంస్కరణలు' అమలు జరుగుతోన్న విషయం అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ప్రపంచ వ్యాప్తంగా వివిధ దోపిడీ వ్యవస్థలలో ధనిక, పేద వ్యత్యాసాలు పెరిగిపోతున్నాయి. ధనికులు మరింత ధనికులౌతున్నారు. పేదలు మరింత పేదరికంలోకి నెట్టివేయబడుతున్నారు. గతంలోని సంక్షేమ రాజ్యాలలోలాకాక వనరుల పంపిణీ మరింత బహిరంగంగా ధనికులకు అనుకూలంగా సాగుతోంది. ధనికులకు సబ్సిడీలు, తాయిలాలు కాగా, పేదలకు మొండి చేయిగా నేటి ఆర్థిక వనరుల పంపిణీ వుంది. ప్రభుత్వాలు సమర్పించే బడ్జెట్‌లు కూడా ఈ తరహా తంతుకు ఏమీ మినహాయింపుగా లేవు.

శ్రామిక ప్రజలు బడ్జెట్ ప్రతిపాదనల పట్ల చాలా ఆసక్తిని చూపుతారు. ఎందుచేతనంటే, వారు వినియోగించే సరుకులపై పన్నులు మరింత పెరుగుతాయేమోననే భయం వారిని నిరంతరం పీడిస్తుంటుంది. వైట్‌కాలర్ శ్రామికవర్గం తమ ఆదాయాలపై పన్ను పెరుగుతుందేమోననే ఆందోళనలో వుంటారు. పెట్టుబడిదారులు కూడా బడ్జెట్‌పట్ల శ్రద్ధను చూపుతారు. బడ్జెట్ తమకు ఏఏ రాయితీలను ఇస్తుందోననే ఆసక్తి వారికి వుంటుంది. బడ్జెట్ అనేది ఎంత డబ్బును ఏవిధంగా ప్రభుత్వం కూడదీయదల్చుకుందో, దానిని ఏ విధంగా ఖర్చు పెట్టదల్చుకుందో చెబుతుంది. ఈ డబ్బులో అధిక భాగాన్ని ప్రభుత్వం పన్నులు, ఇతర ఆదాయాల ద్వారా సమకూర్చుకుంటుంది. ఈ రకంగా సమకూర్చుకున్న డబ్బుకు ఆడంబరంగా, తప్పుదోవ పట్టించే విధంగా, "జాతీయ సంపద" అని "నేషనల్ కేక్" అని పేరు పెడతారు. వాస్తవానికి అది "నేషనల్ కేక్" ఎంతమాత్రమూ కాదు. నిజమైన "నేషనల్ కేక్" రాష్ట్రస్థూల ఆదాయం నుంచి వస్తుంది. కాబట్టి రాష్ట్ర ఆదాయం అంటే ఏమిటో చూద్దాం. పలువురు ఆర్థిక వేత్తలు రాష్ట్ర ఆదాయాన్ని ఆ వార్షిక కాలంలో ఆ రాష్ట్రంలో ఉత్పత్తి చేయబడిన సరుకులు, సేవల తాలూకు డబ్బు రూప విలువగా చెబుతారు. దీనినే "రాష్ట్ర ఉత్పత్తి మొత్తం"గా పిలుస్తారు. ఇది సరైన నిర్వచనం కాదు. శాస్త్రీయమైన నిర్వచనం కాదు. ఎందుచేత?

ఉదాహరణకు ఒకరైతు పంట నూర్పిడిని పూర్తిచేసి ధాన్యాన్ని అప్పుడే బస్తాలకు పట్టాడనుకుందాం. అతను ఉత్పత్తి చేసిన "సరుకు" ధాన్యం. ఇప్పుడిక రైతు సంతోషంగా వున్నాడు. ఆనందోత్సవాలకు ముందుగా క్షవరం చేయించుకోవాలని నిర్ణయించుకున్నాడు. మంగలికి అతని సేవలకు గాను డబ్బును చెల్లించాడు. ఆవిధంగా మంగలికి అతని ఆదాయం అతనికి లభించింది. అయితే ఆ మంగలి నిజంగా దేనినైనా ఉత్పత్తి చేసాడా? లేదు. చేయలేదు. అతను కేవలం ఒక తరహా "సేవను" మాత్రమే అందించాడు. రైతు తన ఉత్పత్తిలోని కొంతభాగం సరుకును అతనికి ఇచ్చాడు. అంటే అతను తన ఆదాయంలోని కొంతభాగాన్ని మంగలికి ఇచ్చాడు. ఇప్పుడు అటు రైతుకు, ఇటు మంగలికీ ఇద్దరికీ ఆదాయం వుంది. అయితే రైతు తాను ఉత్పత్తి చేసిన ఆదాయంలో కొంతభాగాన్ని మంగలికి ఇచ్చాడు. వాస్తవానికి జరిగింది ఇదే కదా. దీని సారం ఏమిటి? 'సేవలు' ఆదాయాన్ని సంపాదించవచ్చు. అయితే అవి దేనిని సృష్టించవు. 'సేవలు' అనుత్పాదకం. అందుచేత నిజంగా ఉత్పత్తి చేయబడిన దానినే మనం ఆదాయం అని పిలువగలం. కాబట్టి రాష్ట్ర ఆదాయానికి శాస్త్రీయ నిర్వచనం ఆ సంవత్సరం కాలంలో ఆ రాష్ట్రంలో ఉత్పత్తి చేయబడిన 'సరుకుల' తాలూకు డబ్బురూప విలువ.

పొలంలోను, ఉత్పాదక పరిశ్రమలలోను, నిర్మాణ పరిశ్రమలోను కార్మికులు, రైతులు, చేతివృత్తుల వారు భౌతిక సంపత్తిని లేదా 'సరుకులను' సృష్టిస్తారు. అలాగే వీరితో పాటుగా ఈ భౌతిక సంపత్తి ఉత్పత్తి క్రమంలో ప్రత్యక్ష భాగస్వామ్యం వున్న మేధావులకు కూడా పాత్ర వుంటుంది. ఈ సంపదకు తోడుగా పర్యాటక రంగం. వాణిజ్యం వంటి వాటి ద్వారా లభించే ఆదాయాలు కూడా వుంటాయి. ఈ విధంగా ఆరాష్ట్రానికి లభించే మొత్తం సంపదను ఆ రాష్ట్రపు స్థూల ఉత్పత్తిగా భావించవచ్చు. రాష్ట్ర ఆదాయంలో "సేవల"

ద్వారా లభించే ఆదాయాన్ని చేర్చటం అశాస్త్రీయం. అయితే దీనర్థం 'సేవల' రంగాన్ని తక్కువ చేసి చూడటం ఏమాత్రం కాదు.

రాష్ట్ర స్థూల ఉత్పత్తిలోనుంచి శ్రమ తాలూకు ఉత్పాదక సాధనాల అరుగుదలకు, అలాగే, ఇంధనం, ముడిసరుకుల వంటి ఉత్పత్తిలో వినియోగించబడే వాటికోసమై తొలగింపులను చేయాలి. అంటే, మొత్తం రాష్ట్రం స్థూల సంపద నుంచి స్థిర పెట్టుబడి తాలూకు విలువను తీసివేయాలి. ఇక మిగిలేది నికర రాష్ట్ర ఉత్పత్తి. ఈ నికర రాష్ట్ర ఉత్పత్తిని లెక్కించటంలో పెట్టుబడిదారీ అర్థికవేత్తలకు విభిన్నమైన పద్ధతి వుంది. వారు కేవలం యంత్రపరికరాలు, భవంతుల అరుగుదల ను మాత్రమే తగ్గిస్తారు. అంటే వారు స్థిర పెట్టుబడిలోని ఒక భాగాన్ని మాత్రమే స్థూల రాష్ట్ర ఉత్పత్తి నుంచి తగ్గిస్తున్నారు. ఈ మొత్తం భాగం కేవలం స్థూల రాష్ట్ర ఉత్పత్తిలో 1/10వ భాగంగా మాత్రమే వుంటుంది. అయితే, ముడిసరుకులు, వినియోగించబడిన ఇంధనం వంటి వాటి మాట ఏమిటి? వీటిని ఇక తిరిగి నింపుకోవల్సిన అవసరం లేదా? తప్పనిసరిగా వీటిని తిరిగి నింపుకోవాలి. అయితే పెట్టుబడిదారీ అర్థికవేత్తలు ఈ వాస్తవాన్ని పరిగణనలోనికి తీసుకోరు. అందుచేతనే పెట్టుబడిదారీ అర్థిక శాస్త్రం అశాస్త్రీయమైనది.

నికర రాష్ట్ర ఉత్పత్తే ఆ రాష్ట్రపు ఆదాయం. ఈ ఆదాయమే వినియోగానికి, పొదుపుకు అందుబాటులోకి వస్తుంది. వేరొకరకంగా చెప్పాలంటే, శ్రామిక ప్రజలు సృష్టించిన విలువ (అంటే, వేతనాలు, అదనపు విలువ) మొత్తమే నికర రాష్ట్ర ఉత్పత్తి. దీనికి ఒక అంకెల పరమైన ఉదాహరణను చూద్దాం.

ఉదాహరణకు ఒక రాష్ట్ర స్థూల ఉత్పత్తి ద్వారా ఆ రాష్ట్రానికి లభించిన

మొత్తం సంపద:	1,50,000 కోట్ల రూపాయలు
స్థిర పెట్టుబడివిలువ @ 70% తొలగించగా	1,05,000కోట్ల రూపాయలు
రాష్ట్ర నికర ఉత్పత్తి లేదా రాష్ట్ర ఆదాయం	45,000 కోట్ల రూపాయలు

ఈ రాష్ట్ర ఆదాయాన్ని ఏవిధంగా పంచుకుంటారు లేదా పంపిణీ చేస్తారు?

ఈ ఆదాయం మొదటగా పెట్టుబడిదారుల చేతులలోకి పోతుంది. (రవాణా, పరిశ్రమలు, రాష్ట్ర యాజమాన్యంలో ఉన్నప్పుడు ఈ ఆదాయం సహజంగానే రాష్ట్ర ఖజానాకు పోతుంది). మొదటగా దీనినుంచి వేతనాలు చెల్లిస్తారు. పెట్టుబడిదారులు కార్మికులతో ఈ సంపద పంపిణీలో సాధ్యమైనంతగా తమకు అనుకూలంగా వ్యవహరిస్తారు. వారు కార్మికులకు వేతనాలను చెల్లిస్తారు. అదనపు విలువను మొత్తం పెట్టుబడిదారులు తమ జేబులో వేసుకుంటారు.


ఈ లాభం లేదా అదనపు విలువ ఇక ఇప్పుడు నాలుగు రకాల పెట్టుబడిదారుల మధ్య వాటాలు అవుతుంది. వారే: పారిశ్రామిక వేత్తలు, బ్యాంకర్లు, వ్యాపారులు, బడా భూస్వాములు (భూమిని లేదా స్థలాలను బాడుగకు ఇచ్చేవారు).

పెట్టుబడిదారీ రాజ్యం ఈ పై విభాగాలలోని ఒకటి లేదా కొన్ని లేదా-అన్ని విభాగాలకు చెందవచ్చు. ప్రతి విభాగంలోను భాగస్వామిగా అది తన వాటాను పొందుతుంది. ఈ ప్రక్రియ అంతా ద్వితీయశ్రేణి పంపిణీగా భావించవచ్చు. ప్రాథమిక, ద్వితీయశ్రేణి పంపిణీలు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యక్ష జోక్యం లేకుండా ప్రభుత్వ పరిధికి అవల జరుగుతాయి. ఇక ఇప్పుడు రాష్ట్ర నికర ఆదాయం డబ్బు రూపంలో రెండు మౌలిక వర్గాలకు వెళ్ళింది- 1)కార్మికులు 2)వివిధ బృందాల పెట్టుబడిదారులు. ఈ వర్గాల వారు ఈ ఆదాయాన్ని సొంత ఖర్చులకు వినియోగించుకోవచ్చు. లేదా మరలా పెట్టుబడిగా పెట్టవచ్చు. పెట్టుబడిదారుల బృందం అదనపు విలువ లేదా లాభాన్ని మొత్తం నొల్లుకుంది గనుక వారు వ్యక్తిగతంగాను, సమష్టిగాను కూడా పొదుపు చేయవచ్చు లేదా పెట్టుబడి పెట్టవచ్చు. ఇక ఇప్పుడు ఈ పొదుపు మొత్తాలు ఉత్పాదక రంగంలో కాని అనుత్పాదక రంగంలో గాని పెట్టవచ్చు. (సేవలరంగం, ఈ అనుత్పాదక రంగంలో పోలీసులు, ఆర్థిక సంస్థలు, ప్రజాహిత సదుపాయాలు, విద్యారంగం, ప్రకటనలు వంటివి వుంటాయి. పెట్టుబడిదారులు ఈ అనుత్పాదక రంగంలో పెట్టుబడులను పెడతారు. ఉద్యోగులుగా చాలా మందిని నియమించి వారికి వేతనాలను ఇస్తారు. వారు దీనిని లాభం కోసమే కాక తమ వర్గరక్షణకై కూడా చేస్తారు. అంటే ఇది మూడవరం పంపిణీ. వాస్తవానికి ఇది పునఃపంపిణీ. ఇది పెట్టుబడిదారుల వాటానుంచి జరుగుతుంది. ఈ 'సేవల' రంగం యజమానులు తమ సేవలకు గాను మరింత లాభాన్ని ఆర్జిస్తారు)

I

ఇదంతా పూర్తయిన తరువాత, రాష్ట్ర ఆదాయాన్ని కార్మికులు, పెట్టుబడిదారులు, అనుత్పాదకరంగం ఉద్యోగులు వ్యక్తిగత ఆదాయంగా పంచుకున్న తరువాత, రెండవ పునఃపంపిణీకై ప్రభుత్వం రంగ ప్రవేశం చేస్తుంది. అంటే పెట్టుబడిదారీ వ్యవస్థలో రాష్ట్రానికి ఆదాయాన్ని పంపిణీ చేయటంలో పరిమిత పాత్ర మాత్రమే వుంటుంది. అది కేవలం అప్పటికే పంపిణీ చేయబడిన, పునఃపంపిణీ చేయబడిన ఆదాయాన్ని మాత్రమే తిరిగి పంపిణీ చేయగలదు.

(కోట్ల రూపాయలలో)



అందుచేత, రాష్ట్ర ప్రభుత్వం పంపిణీచేసే, లేదా పునఃపంపిణీ చేసేది రాష్ట్ర ఆదాయాన్ని కాదు. అది పునఃపంపిణీ చేసేది నాల్గవ స్థాయిలో కార్మికులు, ఉద్యోగులు, రైతులు, వ్యవసాయకూలీలు, పెట్టుబడిదారులు, భూస్వాముల నుంచి పన్నుల రూపంలో వసూలు చేసే మొత్తం. పన్నులను వసూలు చేసేటప్పుడు ప్రభుత్వం, పెట్టుబడిదారులు, భూస్వాములు, పై వర్గాల రైతులకు పలు సానుకూల రాయితీలను అందిస్తుంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఇది తప్పనిసరిగా వాస్తవం. ఫలితంగా బడ్జెట్ అనేది కార్మికులకు, వ్యవసాయ కూలీలకు, చిన్నకారు, సన్నకారు రైతులకు, ఇతర పరిశ్రమ జీవులకు భారంగానే వుంటుంది.

II

రాష్ట్ర ఆదాయం ఎలా ఉత్పత్తి అవుతుందో, అది వేతన కూలీలు, పెట్టుబడి దారులకు మధ్య (వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో) ఎలా మొదటగా పంపిణీ అవుతుందో మనం చూసాం. ఇక రెండవ విడతగా పెట్టుబడి దారులలోని వివిధ విభాగాలు, ఉత్పత్తి సాధనాల యజమానుల మధ్య అది ఎలా పంపిణీ అవుతుందో గమనించాం. రాష్ట్ర ఆదాయం ఈ విధంగా ఈ వర్గాల, బృందాల జేబుల్లోకి చేరిన తరువాత, దానిలోని ఒకభాగం సేవారంగం అనే దానిలో పునఃపంపిణీ అవుతుంది. అక్కడ ఉద్యోగులు ఎటువంటి సంపదను సృష్టించరు. వారు సేవలను అందించి, దానికి ప్రతిఫలంగా ఆదాయాన్ని పొందుతారు.

ఈ దశలోనే రాజ్యం రంగప్రవేశం చేస్తుంది. ఎందుచేత? రాజ్యం అనేది పాలకవర్గపు పనిముట్టు. అది అవసరమైతే బలప్రయోగం ద్వారా పాలకవర్గపు ప్రయోజనాలను కాపాడుతుంది. తద్వారా ఉత్పత్తి ప్రక్రియ సాఫీగా సాగిపోయేలా హామీ చేస్తుంది. ఈ విధులను నిర్వహించ గలిగేందుకు రాజ్యానికి డబ్బు అవసరం. మనదేశం వంటి పెట్టుబడిదారీ దేశంలో రాజ్యం పెట్టుబడిదారీ పాలకవర్గపు (వ్యవసాయ పెట్టుబడిదారీ వర్గంతో సహా) ప్రయోజనాలను కాపాడుతుంది. మించి, ఉత్పత్తి, రవాణా, బ్యాంకింగ్ రుణాల వంటి కొన్ని రంగాలలో రాజ్యమే స్వయంగా సమష్టి పెట్టుబడిదారునిగా వ్యవహరిస్తుంది. ఈ కారణాలచేత రాజ్యానికి ఆదాయం లభిస్తుంది. పెట్టుబడులూ అవసరం అవుతాయి. ఈ కారణం చేతనే మన ప్రభుత్వాలు తమకు రానున్న ఆదాయం, దానిని పంపిణీ చేసే పద్ధతులపై ఏప్రిల్ ఒకటవ తేదీన ఆర్థిక సంవత్సరం (ఏప్రిల్ 1 నుంచి మార్చి 31) మొదలయ్యే లోగా, శాసనసభలలో ఈ మేరకు ప్రకటన చేస్తాయి. ఈ ఆర్థిక ప్రకటననే ప్రభుత్వపు బడ్జెట్ అని పిలుస్తాం.

ఈ బడ్జెట్‌కు ప్రభుత్వం డబ్బును ఎలా పొందుతుంది?

దీనికి నాలుగు మార్గాలున్నాయి. 1)ప్రజలపై పన్నులు వేయటం. 2)రాష్ట్రం యాజమాన్యంలో వున్న ఉత్పత్తి సాధనాలు వ్యాపారాలు, రవాణాల నుంచి లభించిన లాభాలు లేదా డివిడెండ్లు. 3)కేంద్రప్రభుత్వ సంస్థల నుంచి తీసుకున్న రుణాలు (ఉదాహరణకు రిజర్వ్ బ్యాంక్) 4)ఇతర దేశాలు లేదా ప్రపంచబ్యాంకు వంటి సంస్థల నుంచి తీసుకున్న రుణాలు లేదా గ్రాంటులు లేదా విదేశీ పెట్టుబడులు. వీటిలో మొదటి రెండు మార్గాలు తిరిగి చెల్లింపనవసరం లేనివి. కాగా మూడు, నాలుగు మార్గాల ద్వారా తీసుకున్న డబ్బును తిరిగి చెల్లించాలి. ఈ తేడా ప్రాతిపదికగానే మొదటి రెండింటిని "రెవెన్యూ వసూళ్ళు" గాను, తరువాత రెండింటినీ "పెట్టుబడి వసూళ్ళు" గాను పిలుస్తారు.

ప్రభుత్వం "పెట్టుబడి వసూళ్ళ" విభాగంలో పొందిన డబ్బు అంతటికీ వడ్డీతో సహా చెల్లింపులు చేయవల్సి వుంటుంది. "రెవెన్యూ వసూళ్ళు", "పెట్టుబడి వసూళ్ళు" కలగలిపి మొత్తం ప్రభుత్వ "ఆదాయం" అవుతాయి. "విదేశీ సంస్థల నుంచి సేకరించిన నికర

రుణాలు మినహా ఈ "రెవెన్యూ వసూళ్ళు", "పెట్టుబడి వసూళ్ళు" పంపిణీ చేయబడిన, పునఃపంపిణీ చేయబడిన "రాష్ట్ర ఆదాయం" నుంచి వస్తాయి. అవి "రాష్ట్ర ఆదాయం"లో చిన్న భాగంగా వుంటాయి. అయితే ఈ భాగాన్ని ప్రభుత్వం వేతన కూలీలు, ఉద్యోగస్తుల నుంచి అధికభాగం పొందుతుంది. దీనిలో పెట్టుబడి దారుల వాటా నామమాత్రంగా వుంటుంది.

వేతన కూలీలు (వ్యవసాయ, పారిశ్రామిక), వైట్ కాలర్ ఉద్యోగులను వారి యజమానులు "రాష్ట్ర ఆదాయం" పంపిణీ, పునఃపంపిణీ ద్వారా దోపిడీ చేస్తారు. ఇక ఇప్పుడు ప్రభుత్వం రంగప్రవేశం చేస్తుంది. తన పరిధిలోవున్న పరోక్ష పన్నుల ద్వారా (ప్రత్యక్ష పన్నుల ద్వారా కూడా) వారి ఆదాయాలకు గండికొడుతుంది. ఈ రకంగా బడ్జెట్ ఆదాయం అనేది పెట్టుబడిదారీ వర్గం చేతిలో దోపిడీ పరికరం.

ఇక బడ్జెట్‌లో వ్యయం, ఆదాయం కంటే ఎక్కువ వుంటే అది లోటు బడ్జెట్. ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కంటే అదిగనుక ఎక్కువ వెచ్చిస్తే ఉత్పత్తి పరిమాణంతో సంబంధం లేకుండా ప్రభుత్వం గతంలో అదనపు డబ్బును ముద్రించేది. అయితే నేడు ప్రపంచబ్యాంకు వంటి రుణాలనిచ్చే సంస్థల నుంచి డబ్బును తీసుకునే ఆనవాయితీ పెరిగిపోవటం వలన మొత్తం బడ్జెట్ ప్రక్రియే వక్రమార్గం పడుతోంది.

III

ప్రభుత్వం తనకు లభించిన ఆదాయాన్ని "సేవలను" అందించేందుకు ఖర్చు పెడుతుంది. ఈ సేవలలో ప్రధానమైనవి ఎ) పరిపాలనా సంబంధిత సేవలు బి) ఆర్థిక సేవలు సి) సామాజిక సేవలు. ఈ సేవల తీరు తెన్నులను కాస్తంత చూద్దాం. పరిపాలనా సంబంధిత సేవలు అంటే "శాంతి భద్రతలను" అదుపులో వుంచటం, పబ్లిక్ వర్క్స్ తదితర సేవలు. ఈ సేవలు ప్రధానంగా పెట్టుబడిదారీ ఆర్థిక సంబంధాలను కాపాడేవిగా వుంటాయి. ఇక తరువాత "ఆర్థిక సేవలు" అంటే నీటిపారుదల, విద్యుచ్ఛక్తి, పరిశ్రమలు, వాణిజ్యం వంటివి వుంటాయి. చివరగా "సామాజిక సేవలు" అంటే విద్య, ఆరోగ్యం, ఉపాధి, సామాజిక సంక్షేమం, యువకులు, మహిళలు, యస్.సి, యస్.టిల పరిస్థితుల మెరుగుదల వంటివి వుంటాయి. "ఆర్థిక సేవలకు", "సామాజిక సేవలకు" మధ్యన సున్నితమైన విభజన రేఖ మాత్రమే వుంటుంది.

స్వాతంత్ర్యానంతర కాలపు సుదీర్ఘ ప్రయాణంలో మనం చాలా అభివృద్ధిని సాధించామని ప్రభుత్వాలు చెప్పుకుంటున్నాయి. అయితే, వాస్తవానికి 'అభివృద్ధి' అంటే 'సామాజిక న్యాయం' అనే అర్థం ధ్వనించటం లేదు. మనదేశం వంటి పెట్టుబడిదారీ వ్యవస్థలో 'అభివృద్ధి', 'సామాజిక న్యాయం' అనేవి పెట్టుబడిదారీ అభివృద్ధి అవసరాలను మాత్రమే పరిపూర్తి చేస్తాయి. పెట్టుబడిదారీవర్గం కార్మికవర్గం నుంచి మొత్తం అదనపు విలువను దోచుకుంటుంది. అలాగే ఇతర వర్గాల శ్రామిక ప్రజలను కూడా దోచుకుంటుంది. ఇక ప్రభుత్వం తన వంతుగా వారి వేతనాల నుంచి పన్నుల రూపంలో పెద్ద మొత్తాన్ని తీసుకుంటుంది. అయితే వ్యయాల దగ్గరకు వచ్చేసరికి సామాజిక సేవలకోసం ప్రభుత్వం చాలా తక్కువ ఖర్చు పెడుతుంది. దీనివలనే ఆర్థిక అభివృద్ధి జరిగినంతగా కార్మిక ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటం లేదు. ఏదో ఒకరకంగా కాస్తంత జీవన ప్రమాణాలు మెరుగుపడే అవకాశం ఏర్పడినా అదికాస్తా ద్రవ్యోల్బణం రూపంలో హరించుకు పోతుంది.

పలుమార్లు జరిగినట్లుగా ప్రణాళికా వ్యయం, ప్రణాళికేతర వ్యయం కూడా తగ్గించబడవచ్చు. అటువంటి తగ్గింపు జరిగినప్పుడు అటు "ఆర్థికాభివృద్ధి", "సామాజిక న్యాయం" చాలా మేరకు నష్టపోతాయి. అయితే ప్రైవేటురంగం మాత్రం దీనివలన ఏమాత్రం నష్టపోదు. వాస్తవానికి, ప్రణాళిక చేత నియంత్రించబడకపోవటం వలన ఈ వ్యయాల కోత ప్రభావం ప్రైవేటురంగంపై ఏమీ ఉండదు. కాగా, ప్రణాళికా వ్యయం, ప్రణాళికేతర వ్యయాలలో కోతవలన ప్రైవేటు రంగం నుంచి కొన్ని ప్రభుత్వ కొనుగోళ్ళు తగ్గితే, ప్రైవేటు రంగం ఉద్యోగుల తొలగింపు, లాకౌట్ల ద్వారా తన ఉత్పత్తిని తగ్గించుకుంటుంది. దీనివలన ప్రైవేటురంగపు లాభాలు కొద్దిపాటిగా తగ్గవచ్చు. అయితే, కార్మికవర్గం మాత్రం తన జీవన భృతిని కోల్పోతుంది. ఇక్కడ మరిచిపోకూడని మరోవిషయం వున్నది. రెవెన్యూ పెట్టుబడుల హెచ్చింపుల ద్వారా ప్రభుత్వం ప్రైవేటురంగం నుంచి పలు వినియోగ, యంత్ర పరికరాలను కొనుగోలు చేస్తుంది. ఈ రకంగా బడ్జెట్ వెచ్చింపులలోని పెద్దభాగం మరోమారు ప్రైవేటురంగానికే దక్కుతాయి. అందుచేత, ప్రైవేటురంగం సహజంగానే ప్రభుత్వ వెచ్చింపులు, కేటాయింపులు పెరగాలని కోరుకుంటుంది. ఈ విధంగా ఏకోణం నుంచి చూసినా పెట్టుబడిదారీ వ్యవస్థలో బడ్జెట్ వున్న వాళ్ళకు వూడిగం చేసేదిగానే ఉండగలదు. అందుచేత బడ్జెట్‌లో బ్రతుకును వెతుక్కోవటం గొంగట్లో తింటూ వెంట్రుకలు ఏరడం లాంటిదే.

(జి.జె. రామారావు రచించిన బడ్జెట్ అంటే ఏమిటి? పుస్తకం ఆధారంగా)

*

కేంద్ర బడ్జెట్ ఎలా ఉండబోతోంది?

-వై. కృష్ణమూర్తి

2005-06 బడ్జెట్ దశ, దిశానిర్దేశనం ఎలా వుండాలో ఆశించే ముందు సంస్కరణలు మొదలయిన దశాబ్దం తరువాత పరిస్థితులు ఎలా వున్నాయో పరిశీలిద్దాం. 8 నుండి 10 కోట్లమంది నిరుద్యోగులుగా వున్నారు. రైతుల ఆత్మహత్యలు కొనసాగుతూనే వున్నాయి. ధరలు పెరుగుతూనే వున్నాయి. టోకు ధరల ఆధారంగా ద్రవ్యోల్బణం రెటు తగ్గినట్టు కనిపించినా వినిమయ ధరల సూచి పెరుగుతూనే వున్నది. ద్రవ్యలోటు అధీనంలోకి రావటం లేదు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రావటం లేదు కాని సంస్థాగత విదేశీ పెట్టుబడులు వస్తున్నాయి. చట్టా వ్యాపార సూచి పెరుగుదల మునుపెన్నడూ లేనంత పెరిగింది. సామాన్య ప్రజానీకం బాధలు తగ్గుతున్న సూచనలు కనిపించటం లేదు. ఆర్థికాభివృద్ధి ఆశించినంత మేరకు జరగలేదు.

(సరాసరి వృద్ధిరేటుశాతం)

రంగం	1981-91	1993-2003
పరిశ్రమలు	3.5	3.3
వస్తూత్పత్తి	7.8	6.5
సేవారంగం	6.4	7.5

2003-04 ఆర్థిక సంవత్సరంలో స్థూల జాతీయ ఉత్పత్తి 8.2%గా లెక్కించుతున్నారు. ఈ గణాంకం అంతకు పూర్వ 2002-03 ఆర్థిక సంవత్సరంలో నమోదైన 4% మీద ఆధారపడి వుంది కనుక పెద్దగా కనిపించుతోంది. ఈ సంవత్సరం జాతీయ స్థూల వుత్పత్తి రేటు 7.4% గా ప్రభుత్వం అంచనా వేస్తున్నా, ఆర్.బి.ఐ మధ్యంతర నివేదిక జాతీయ స్థూల వుత్పత్తిని 6-6.5% ఉండవచ్చునని అంచనా వేస్తున్నది. నడుస్తున్న పదవ పంచవర్ష ప్రణాళిక 8% వృద్ధిరేటును సాధించాలనే లక్ష్యంగా పెట్టుకొన్నా ఆచరణలో అది అసాధ్యమని నిర్ధారితమౌతోంది.

బిజెపి నాయకత్వంలోని ఎన్.డి.ఎ వినాశకర పారిశ్రామిక ఆర్థిక విధానం వల్లా, వ్యవసాయ రంగాన్ని పూర్తిగా విస్మరించినందువల్లా, ప్రైవేటీకరణ దుస్సాహసంవల్లా అన్ని రంగాలు స్తబ్దతకు లోనైనాయి.

అయినా చిదంబరం " మా ప్రభుత్వం సంస్కరణలకు దృఢంగా కట్టుబడి ఉంది" అని ప్రకటించుతున్నారు. కాకపోతే ఈ సంస్కరణలు " ప్రజానుకూల " గా వుంటాయని విశేషణం చేర్చారు.

2004 సంవత్సరంలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు " అత్యధిక సంఖ్యాక ప్రజల్ని విస్మరించి, భారతదేశం వెలిగిపోతోంది అంటే కుదరదు" అనేది రుజువు చేశాయి. బిజెపి దాని నాయకత్వంలోని ఎన్.డి.ఎ హడావుడిగా గ్రామీణ ప్రజానీకాన్ని, రైతులను ఎన్నికలు దగ్గర పడినప్పుడు గుర్తుతెచ్చుకొని రైతులకు 9% రుణ సౌకర్యం కల్పిస్తానని, ఎరువుల మీద సబ్సిడీ తగ్గించనని, వ్యవసాయ ఉపకరణాలు తక్కువ ధరలకు అందచేస్తానని హామీలు కురిపించినా, ఓటమి తప్పలేదు. ఎన్నికలలో ఒక మంచి పనే జరిగింది. నీటి పారుదల సౌకర్యాల కల్పన, తక్కువ వడ్డీకి వ్యవసాయ రుణాలు, వ్యవసాయ ఉపకరణాల ధరలు విషయంలో దాదాపు అన్ని రాజకీయ పార్టీలు ఒక ఏకాభిప్రాయానికి వచ్చాయి.

అధికారంలోకి వచ్చిన కాంగ్రెసు నాయకత్వంలోని యు.పి.ఎ. ప్రభుత్వం బడ్జెటు కేటాయింపులలో నీటిపారుదల సౌకర్యాల కల్పనకు, వ్యవసాయానికి పెద్దపీటే వేసింది. రాబోవు మూడు సంవత్సరాలలో వ్యవసాయానికి రుణ సౌకర్యం నేడున్నదానికి రెండు రెట్లు కల్పిస్తామనే హామీకి అనుగుణంగానే బడ్జెటు కేటాయింపు జరిగింది. కనీస ఉమ్మడి కార్యక్రమంలో కూడ ఇది వక్కాణించబడింది. సెప్టెంబరు చివరికి రూ. 53,591 కోట్లు బ్యాంకుల ద్వారా రైతులకు రుణసదుపాయం కల్పించారు.

ఎన్నికలలో సంవత్సరానికి కోటిమందికి పని కల్పించి నిరుద్యోగాన్ని, దారిద్ర్యాన్ని పారదోలతామని కాంగ్రెస్ వాగ్దానం చేసింది. దానికి అనుగుణంగానే కనీస ఉమ్మడి కార్యక్రమంలో పనిచేయగల శక్తి వున్న వారందరికీ సంవత్సరంలో కనీసం 100 రోజులు పని కల్పిస్తామని ప్రకటించింది. దానినే చిదంబరంగారు బడ్జెట్‌లో ప్రతిపాదించారు. తీరా దానికిగాను రూ. 40వేలకోట్లు ఖర్చు అవుతుందని పెట్టుబడిదారీ వర్గాల నుండి గగ్గోలు మొదలుకాగానే ప్రయోగాత్మకంగా 150 జిల్లాలలో దారిద్ర్యరేఖకు దిగువన వున్న కుటుంబాలలో ఒక్కరికి మాత్రమే పని కల్పిస్తామని మాట మార్చి, చివరికి ఆ కార్యక్రమాన్ని "పనికి ఆహారం" పథకం స్థాయికి దిగజార్చారు. పట్టణప్రాంత బీదవారి సగతి మరిచిపోయారు. అయినా సాలీనా రూ. 1,000 కోట్లు ఖర్చు అవుతుందని అంచనాలు కొంతమంది విశ్లేషకులు ప్రకటించగా మీనమేషాలు లెక్కిస్తూ 'పని హామీ' బిల్లును కాలహరణ చేస్తున్నారు.

దారిద్ర్యరేఖకు దిగువన వున్న కుటుంబాలకు చౌకగా బియ్యం, గోధుమలు లభ్యమయ్యే పథకం మీద, పాలకవర్గాలు గగ్గోలు మొదలెట్టాయి. 1991-92లో ఆహారం మీద సబ్సిడీ రూ. 2,850 కోట్లు. అదినేడు రూ. 25,800 కోట్లకు పెరిగిన మాట వాస్తవమే. అయినా ఈ పెరుగుదల అంతా ఆహార సేకరణ ధర, ఆహార అమ్మకం ధర మధ్య వ్యత్యాసం వల్లకాదు. ఆహార భద్రతకు కావలసిన కనీస స్థాయికి మించిన కొనుగోళ్ళు, వాటిని గోదాములలో వుంచటం, రక్షణ, తరలింపు, తరుగుదల ఇవన్నీ కలిపి సబ్సిడీ లెక్కింపులో చూపి సబ్సిడీ ఎగవేతకు దారులు వెతుకుతున్నారు. పైన చెప్పిన ఖర్చులు తీసివేస్తే ఆహారం మీద సబ్సిడీ మొత్తం బాగా తగ్గుతుంది.

'భారత్ ఉదయ్' అని అద్వానీగారు, "భారత్ వెలిగిపోతుంది" అని వాజపాయ్‌గారు, ఆనాటి సెన్సెక్సు చూపి ఎన్నికలలో నెగ్గాలనుకొన్నారు. భారతదేశ అభివృద్ధి సూచికి సెన్సెక్స్ ఏ మాత్రం కొలబద్దకాదు. నేడు కూడా సెన్సెక్స్ 6600 పాయింట్లు దాటింది. ముఖ్యంగా మన దేశీయుల పెట్టుబడికంటే విదేశీ సంస్థాగత పెట్టుబడులు వచ్చి పడుతుండడంవల్ల అది పెరిగింది. గత నెలరోజులలో రూ. 1,760 కోట్లు వచ్చిపడ్డాయి. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత దాదాపు రూ. 39 వేలకోట్లు విదేశీ సంస్థాగత పెట్టుబడులు వచ్చాయి. నానాటికి విదేశీ సంస్థల రిజిస్ట్రేషన్‌ల సంఖ్య పెరుగుతున్నది. ఈ పెట్టుబడులు కొంతకాలం మనదేశంలో తప్పనిసరిగా వుంచవలసిన నిబంధన తేవాలని రిజర్వుబ్యాంకు గవర్నరుగారు సూచన చేయగానే అటువంటి నియంత్రణ చేసే ఆలోచన లేదని మన ఆర్థికమంత్రిగారు ప్రకటించారు. 1997-98 సంవత్సరాలలో తూర్పు ఆసియా దేశాలు అనుభవించిన విదేశీ ద్రవ్యమారకపు రేట్ల సంక్షోభం, కాద్దిగడువు విదేశీ పెట్టుబడులు వేగంగా తరలింపు మొదలైన చేదు అనుభవాలు మరచినట్లున్నారు.

కేంద్ర ప్రభుత్వ ఆదాయం పన్నులు, పన్నేతర మార్గాల ద్వారా చేకూరుతుంది. పన్నులలో దిగుమతుల సుంకం, ఎక్సైజు డ్యూటీ, కార్పోరేట్లపై పన్ను, ఆదాయపు పన్ను ముఖ్యమైనవి. రాష్ట్రాలు తీసుకొన్న రుణాల మీద వడ్డీ, ప్రభుత్వరంగ సంస్థలు అందించే డివిడెండు, మార్కెట్‌లోనులు, బాండ్స్ అమ్మకం మొదలైనవి పన్నేతర మార్గాలు. కేంద్ర ప్రభుత్వ పన్నులు జాతీయస్థూల ఉత్పత్తిలో రెండంకెల శాతం స్థాయికి ఏనాడూ చేరలేదు. ఆరోగ్యకరమైన ఆర్థిక వ్యవస్థలో పన్నులు 15% వరకూ వేయవచ్చును. గత 9 నెలలలో రూ. 1,41,246 కోట్లు పన్నులుగా వసూలైంది. ఇది బడ్జెట్ అంచనాలో 40% మాత్రమే. ఇంక మిగిలిన మూడునెలల్లో 60% పన్నులు వసూలు సాధ్యమా? అనుమానమే. పన్నులుకాని ఆదాయం పరిశీలించితే బడ్జెట్ అంచనా రూ. 75,416 కోట్లు కాగా, గడచిన తొమ్మిది నెలలలో రూ. 47,247 కోట్లు వసూలైంది. లోటు దాదాపు 37% వరకూ వుంటుంది.

ఆర్థిక సంస్కరణలు మొదలైన తరువాత పన్నుల వసూళ్ళు బడ్జెట్ అంచనాలకు తక్కువ అయి వనరుల కటకట ఏర్పడగానే పాలకవర్గాలకు కనపడేది ప్రభుత్వరంగ సంస్థల అమ్మకం. ఎన్‌డిఎ ప్రభుత్వం లాభనష్టాలతో నిమిత్తం లేకుండా ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్మి రూ.26,000 (2003-04) కోట్లు కూడగట్టుకోగలిగింది. మిక్కిలి లాభసాటిగా నడుస్తున్న ఒఎన్‌జిసి, ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్, గ్యాస్ అథారిటీ, డ్రెడ్జింగ్ కార్పోరేషన్ లాంటి నవరత్నాలని పిలువబడే సంస్థల షేర్లను అమ్మివేసింది. చిదంబరంగారి కన్ను ప్రభుత్వరంగ సంస్థలపై పడింది. కనీస ఉమ్మడి కార్యక్రమం లాభసాటిగా నడుస్తున్న ప్రభుత్వరంగ సంస్థల వాటాలను అమ్మబోమని చెప్పినా ఎన్‌టిపిసి షేర్లు, ఒఎన్‌జిసి షేర్లు, మారుతి షేర్లు అమ్మి బడ్జెట్ లోటును కొంత వరకైనా పూడ్చుకోవాలని చూస్తున్నారు. అంతర్జాతీయ ఖ్యాతి సంపాదించిన బిఎచ్ఇఎల్ వాటాలు కూడా అమ్మకానికి పెట్టుతున్నారు.

ప్రణాళికేతర ఖర్చు (జీత భత్యాలు, వడ్డీ చెల్లింపులు, సబ్సిడీలు మొదలైనవి) ఏమాత్రం తగ్గకపోగా, ప్రణాళికా ఖర్చులో మాత్రం కోత పడింది. గడచిన తొమ్మిది నెలలలో రూ. 92,700 కోట్లకు గాను రూ. 81,224 కోట్లు మాత్రమే ప్రణాళికా ఖర్చులు అయినాయి. నిజానికి అవి బడ్జెట్ అంచనాలో 75% వుండాలి. కాని నేటికి ఖర్చు అయింది 66% మాత్రమే. అనగా రూ. 11,476 కోట్లు "ఇతర" కార్యక్రమాలకు ఖర్చు చేశారు.

కనీస ఉమ్మడి కార్యక్రమంలో సామాజిక రంగానికి అధిక ప్రాధాన్యమిస్తామన్నారు. విద్యావ్యాప్తి కొరకు అన్నిరకాల పన్నుల మీద 2% సెస్సు విధించారు. జాతీయ స్థూల ఉత్పత్తిలో 6% విద్యకి కేటాయించే దిశగా పయనిస్తామన్నారు. వైద్యం, ఆరోగ్య రంగాలకు కొంత అధిక బడ్జెట్ కేటాయింపు జరిగింది.

సామాజికరంగం పేరునా, ఖాయిలా పడిన ప్రభుత్వరంగ పరిశ్రమల పునరుద్ధరణకు వనరుల పేరునా లాభసాటి ప్రభుత్వరంగ సంస్థలలోని 5% వాటాలను అమ్మి ప్రత్యేకనిధి ఏర్పరచటానికి పథకాలు సిద్ధమౌతున్నాయి. ఈ నిధిని ఎవరు మేనేజ్‌చేస్తారు, ఏఏ

రంగాలలో పెట్టుబడిగా వుంచుతారు అనే విషయాలు తేలలేదు. ఈ నిధి బడ్జెట్‌లోటు పూడ్చటానికి మరోసాధనం అనే విమర్శ వస్తున్నది.

ఆర్థిక రంగంలో ముఖ్యంగా బ్యాంకింగు రంగంలో స్థిరీకరణ పేరున జాతీయ బ్యాంకులు, ప్రైవేటు బ్యాంకులు విలీనాల ద్వారా పెద్దవై, అంతర్జాతీయ స్థాయికి పెరగాలని ప్రభుత్వం బ్యాంకుల మీద ఒత్తిడి తెస్తున్నది. ఉద్యోగులతో చర్చించటం కాని, బ్యాంకులు ఎదుర్కొంటున్న కష్టాలు కాని దృష్టిలో లేకుండా కేవలం ప్రపంచీకరణ పేరున ఒత్తిడి పెట్టి విలీనాలు చేయటం నష్టదాయకం. బ్యాంకుల నేటి తక్షణ కర్తవ్యం వ్యవసాయ రంగానికి, ఇతర ప్రాధాన్యతారంగాలకు కలిపి 40%, వ్యవసాయానికి 18% రుణం అందించటం. పార్లమెంటరీ కమిటీ పరిశీలన చేయగా వ్యవసాయ రంగానికి జాతీయ బ్యాంకులు 15.78%, ప్రైవేటు బ్యాంకులు 10.78% మాత్రమే తమ రుణాలలో కేటాయించినట్లు తేలింది. 18%కి తక్కువైన మొత్తాన్ని గ్రామీణాభివృద్ధి నిధికి జమచేయాలనే శిక్ష అది ఒక శిక్షా! మరో ముఖ్య ప్రతిపాదన వ్యవసాయ రుణాలపై వడ్డీ రేటు 9% కంటే తగ్గింపు. ప్రభుత్వ ట్రెజరీ బిల్లులమీద 7.5% వడ్డీ చెల్లించగా, వ్యవసాయానికి 9% వడ్డీ అనేది అన్యాయం.

బడ్జెట్‌లో బ్యాంకింగు రంగానికి ఏ ఆదేశాలు ఇస్తారో చూడాలి. చిదంబరంగారు మరో విషయం మరిచారు. ఒక లక్షకోట్ల రూపాయల వరకూ బ్యాంకులలో నిరర్థక ఆస్తులు వున్నాయి. వీటిలో ఉద్యోగులు బయట పెట్టిన బాకీదారుల పేర్లలో బడా వ్యాపారులు, కార్పోరేటు సంస్థలే ఎక్కువగా వున్నాయి. ఈ మొండి బకాయిల వసూలుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు ఏమీ తీసుకొనలేదు. ప్రైవేటు బ్యాంకులలో విదేశీ పెట్టుబడి పరిమితిని 74%కి పెంచ తలపెట్టింది. ప్రభుత్వరంగ బ్యాంకులలో మూలధనం పెంపుకు మార్కెట్ మీద ఆధారపడమని ఆర్థికమంత్రి సూచించారు. బడ్జెట్ మద్దతు ఏమి ఉండదు. మెరుగైన ప్రాథమిక సౌకర్యాల కల్పన మిషమీద విమానాశ్రయాలు, టెలికాం, ఓడరేవులు మొదలైన వాటిలో విదేశీ పెట్టుబడి పరిమితిని 74%కి పెంచుతోంది.

ఆర్థిక రంగంలోని బీమా విభాగంలో విదేశీ పెట్టుబడి పరిమితిని 26% నుండి 49% కి పెంచాలని యోచిస్తోంది. బలంగా వున్న వామపక్షాలు తీవ్ర వ్యతిరేకతను తెలుపుతున్నాయి. 7-2-2005న నిరసన దినాన్ని పాటించాయి. ఇతర తరహా ఆందోళనలకు సిద్ధమౌతున్నారు.

ప్రతి ఆర్థిక కమిషన్ సిఫారసు మేరకు రాష్ట్రాలకు కేంద్రం నుండి తరలించే పన్నులలోని భాగం పెరుగుతూ పోతోంది. గత కమిషన్ 29.5% రాష్ట్రాలకు కేటాయించగా, నేటి రంగరాజన్ కమిషన్ 30.5% రాష్ట్రాలకు కేటాయించింది. దీనికి తోడు వ్యాట్ ప్రవేశం వల్ల రాష్ట్రాల వనరులలో (సేల్స్‌టాక్స్, ఆక్ట్రాయి లాంటి పన్నులు) కోత పడుతుంది. ఇందుకుగాను రూ. 26,000 కోట్లు వచ్చే బడ్జెట్‌లో రాష్ట్రాలకు కేటాయించాలి.

కేంద్రం నుండి రాష్ట్రాలకు బదిలీ అవుతున్న మొత్తాలు

(రూ. కోట్లు)

సంవత్సరాలు	బదిలీ అయిన మొత్తం
1984 నుండి 1989 వరకు	39,452
1990 నుండి 1995 వరకు	1,00,036
1995 నుండి 2000 వరకు	2,26,643
2000 నుండి 2005 వరకు	4,35,905

ఈ నేపథ్యంలో చిదంబరంగారు వివిధ వర్గాల ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఆర్థిక వేత్తలు 1) పన్నుల రేట్లు తగ్గించుట 2) ఎక్సైజు కష్టమ్స్ డ్యూటీల (దిగుమతి సుంకం)ని 5% కి తగ్గించుట 3) ధాన్యసేకరణ ధరలు తగ్గించుట 4) విదేశీ కరెన్సీ నిలువలను ప్రాథమిక సౌకర్యాల కల్పనకు వాడుకోవాలని 5) దారిద్ర్య రేఖను నిర్ణయించటానికి మరో సంఘాన్ని వేయమని కోరారు. రైతుల ప్రతినిధులు 1) వ్యవసాయ రుణాలమీద వడ్డీరేటును మరింత తగ్గించమని 2) సహకార సంఘాలను పటిష్టపరచమని 3) ధరలు, ఆదాయాల పంటల బీమా ప్రవేశపెట్టమని 4) నీటి వనరుల అభివృద్ధికి రాష్ట్రాల స్థాయిలో నిధులను ఏర్పరచమని 5) ఆహార పదార్థాల (పచ్చివి, ఎండువి) నిలువలకు గిడ్డంగులు, శీతల కేంద్రాలు నిర్మాణానికి చౌకగా రుణాలు కోరారు. భారత వాణిజ్యమండలుల సమాఖ్యలు, పారిశ్రామిక సమాఖ్యలు 1) కార్పోరేట్ టాక్స్, తగ్గించమని (35% నుండి) 2) కార్మికుల, ఉద్యోగుల తొలగింపు సులభతరం చేయమని, 3) డివిడెండు మీద పన్ను తొలగింపు, దిగుమతి సుంకాల తగ్గింపు, అలాగే ఎక్సైజు సుంకం తగ్గింపు, ఎఫ్‌డిఐ పరిమితిని పెంచమని కోరారు. ఉద్యోగుల, కార్మికుల ప్రతినిధులు 1) ఆదాయపు పన్ను శాతం తగ్గింపు 2) ప్రభుత్వరంగ పరిశ్రమలలోని వాటాలను అమ్మవద్దని, అవ్యవస్థిత రంగ కార్మికులకు, వ్యవసాయ కార్మికులకు సామాజిక భద్రత పథకం ప్రవేశపెట్టాలని 4) ఎగవేసిన పన్నుల బకాయిలు వసూలు చెయ్యాలని, 5) సామాజిక కార్యక్రమాల అమలుకు కావలసిన వనరులు కొరకు, పన్నుల చట్టాన్ని విస్తృత పరచమని కోరారు.

పన్నుల ఎగవేత

(రూ. కోట్లు)

సంవత్సరం	మొత్తం
1997-98 నాటికి	47,000
2001-2002 నాటికి	87,000
31-9-2004 నాటికి	99,183

పన్నుల ఎగవేత ప్రతి సంవత్సరం పెరుగుతూ పోతోంది కాని తరగటం లేదు. ప్రభుత్వ ఉదాసీనతను, ఘాటుగా చెప్పాలంటే చేతగాని తనాన్ని బయట పెడుతోంది.

ధనస్వాములు, కొందరు రాజకీయ నాయకులు జుగుప్సాకరంగా, నిర్లజ్జగా కోట్లరూపాయలు ఖర్చుచేసి పండుగ పేరున, పెండ్లిండ్ల పేరున ఖర్చు చేస్తున్నా వారి నల్లధనాన్ని బయటకు తీయలేక పోతోంది. ఒక విధంగా వారు సమాంతర ఆర్థిక వ్యవస్థ నడుపుతున్నారు. కొందరు ఆర్థిక వేత్తలు మనదేశ బడ్జెట్‌కు సమానమైన నల్లధనం వున్నదని, వచ్చే బడ్జెట్‌లో కొన్ని నిర్దిష్ట చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనికి గాను ఖర్చుపై పన్ను ప్రవేశ పెట్టమంటున్నారు.

మనదేశం స్వేచ్ఛా విపణి మార్గం అనుసరించాలని హాంకాంగును, సింగపూర్‌ను, ఇంగ్లాండు, అమెరికాలను చూపుతున్నారు. ఈ స్వేచ్ఛామార్కెట్ విధానం విశాలమైన విభిన్న స్థాయిలో వున్న సమాజ వర్గాలు వున్న మనదేశంలో ఫలవంతం కావటం లేదని, గత దశాబ్దం పైగా అనుసరించిన సరళీకరణ, ప్రైవేటీకరణవల్ల తేటతెల్లం అయింది. చైనా, వియత్నాం, క్యూబా దేశాలు, అన్య విధానాల ద్వారా అభివృద్ధి సాధించాయి. మనదేశం బహుళార్ధకమైన ఆర్థిక, పారిశ్రామిక విధానాల వల్లే అభివృద్ధి చెందుతుంది. మూసవిధానాలు పనిచేయవని నిర్ధారితమైంది.

చైనా నేడు వస్తూత్పత్తిలోను, ఆర్థికాభివృద్ధిలోను ప్రపంచంలోని అన్ని దేశాల కంటే ముందువున్నది. అమెరికా, జపాన్, ఇతర యూరప్ దేశాల ఆధిపత్యాన్ని సవాలు చేసే స్థాయికి ఎదిగింది. వారి మార్గం స్వేచ్ఛావిపణి కాదు. బ్రెజిల్, వెనిజులా మొదలైన లాటిన్ అమెరికా దేశాలు స్వేచ్ఛావిపణి మార్గం నుండి బయట పడుతున్నాయి.

అయితే గత బడ్జెట్‌లో మన ఆర్థికమంత్రి వాణిజ్య వర్గాలకు, పారిశ్రామిక వేత్తలకు అనేక రాయితీలు ఇచ్చారు. చిన్నతరహా పరిశ్రమలకున్న రిజర్వేషన్‌లో నుండి 85 వస్తువులను తొలగించారు. ఎక్సైజ్ డ్యూటీని 5%కి తగ్గించమని పారిశ్రామిక సమాఖ్యలు డిమాండు చేస్తున్నాయి.

జాతీయ స్థూల ఉత్పత్తిలో 9% మించి ఏనాడు పన్నులు లేవని మనం గమనించాము. ఇప్పుడున్న దానికి తోడు 1.5% అధికంగా పన్నులు వేయటం ద్వారా రూ. 50,000 కోట్లు అదనంగా వనరులు సమకూర్చుకోవచ్చును. మనదేశానికి లంచగొండితనంలో అగ్రస్థానం వున్నదనేది జగమెరిగిన సత్యం. అందువలననే విదేశీ పెట్టుబడులు రావటం లేదని కొన్ని పత్రికల, పారిశ్రామిక వర్గాల విమర్శ. నిజానికి ఈ లంచగొండితనాన్ని పోషిస్తున్నవారు వారే. అందువల్లే కేంద్రపన్నులు బకాయిలు రూ. 99 వేలకోట్లకు చేరాయి. పన్నులు సరిగా వసూలు చేస్తే అధిక వనరులు రావా!

చిదంబరం గారికి " కలల బడ్జెట్"ల మీద వున్న మోజు అందరికి తెలిసిపోయింది. 1997-98లో ప్రవేశపెట్టిన బడ్జెట్, 2004-05 సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ చూస్తే దిగుమతి సుంకాల తగ్గింపు, ఎక్సైజ్ డ్యూటీ తగ్గింపు, కార్పోరేట్ టాక్స్ రేటు తగ్గింపు, డివిడెండ్ టాక్స్ రద్దు మొదలైన చర్యల ద్వారా పెట్టుబడి దారీ వర్గాల "డార్లింగ్"గా పేరు తచ్చుకొన్నారు. అందువలన మరో " కలల బడ్జెట్" కొరకు ఎదురు చూస్తున్నారు పాలకవర్గాలు.

అయితే పార్లమెంటులో తగిన సంఖ్యాబలంతో ప్రజలను ఉద్యమాలవైపు మళ్ళించగలిగిన వామపక్షాలు అది పడనిస్తాయా అనేది నేటి ప్రశ్న. ఏమైనా కనీస ఉమ్మడి కార్యక్రమానికి లోబడకుండా ఆర్థికమంత్రి బరితెగిస్తే ప్రభుత్వం కష్టాలలో పడటం ఖాయం. అందువల్ల బడ్జెట్ కేటాయింపులలో 1) వ్యవసాయానికి నీటిపారుదల 2) నిరుద్యోగ నిర్మూలనకు ఉద్యోగ హామీ చట్టం అమలు 3) స్వయం సహాయక బృందాలకు చౌకగా రుణ సదుపాయం 4) దారిద్ర్యరేఖకు దిగువన వున్నవారికి ఆహార సబ్సిడీ కొనసాగింపు 5) విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత 6) గ్రామీణ ప్రాథమిక సౌకర్యాల కల్పన 7) విద్యుదుత్పాదన పెంపు 8) అసంఘటితరంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పన 9) లాభసాటి ప్రభుత్వరంగ పరిశ్రమల జోలికి పోకుండా వుండటం 10) రైతులకు గిట్టుబాటు ధరలు 11) రైతులు ఉపయోగించే ఉపకరణాలు చౌకగా లభ్యమయ్యేటట్లు చూడటం 12) సహకారరంగాన్ని పటిష్టపరచటం 13) చిన్న ఉద్యోగుల ఆదాయపు పన్ను మినహాయింపు ఒక లక్ష రూపాయలకు పెంచటం 14) ధరల పెరుగుదలను అరికట్టడం లాంటి ప్రజాహిత చర్యలు బడ్జెట్‌లో చోటు చేసుకోవాలి. ఫిబ్రవరి 28న ఏమి జరగబోతోందో వేచి చూద్దాం. అంత వరకూ అంతా చిదంబర రహస్యమే.

*

కొత్తదనం లేని రాష్ట్ర బడ్జెట్

-వి. హనుమంతరావు

బడ్జెట్ అంటే గణాంకాల చేత సర్కస్ చేయించడం మాత్రమే కాదు, అదొక రాజకీయార్థిక విధాన పత్రం కూడా అని అంగీకరిస్తే, ఫిబ్రవరి 18న ఆర్థికమంత్రి కొణిజేటి రోశయ్య 2005-06 సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ అటువంటి లక్షణాలను ఆవిష్కరించిన సూచనలేమీ లేవని చెప్పాలి. మొత్తం బడ్జెట్‌నంతా నీటిపారుదల మింగేసింది; ప్రజల నిత్య జీవితాలను ప్రభావితం చేసే శాఖలకు ఎంగిలి చేయి విదలించిన మెతుకులే మిగిలాయి.

గత జూన్‌లో మొదటి బడ్జెట్ ప్రవేశపెట్టినపుడు అదొక తాత్కాలిక బడ్జెట్‌లాంటిదేనని, తమ పార్టీ విధానాలను ప్రతిబింబించే పూర్తి సంవత్సర బడ్జెట్‌కోసం వచ్చే ఏడాది వరకూ వేచి వుండండి అని చెబితే అపుడే ఎన్నికలు పూర్తి అయ్యాయి కదా కొంత సమయం ఇద్దాం అనుకొన్నారు ప్రజలు. రెండో బడ్జెట్ రానే వచ్చింది.

ఈ తొమ్మిది నెలల కాలంలో రాష్ట్రంలో సంచలనాత్మక పరిణామాలు జరిగాయి. మావోయిస్టుల మీద ఉన్న నిషేధాన్ని పొడిగించకుండా వారి ప్రతినిధులను పిలిచి నాలుగురోజులు చర్చలు జరిపి మొత్తం దేశం దృష్టిని ఆకర్షించారు. వ్యవసాయ రంగాన్నెదుర్కొంటున్న తీవ్ర సంక్షోభానికి తెరదించి పరిష్కారం చూపించమని ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త జయతీఘోష్ ఆధ్వర్యాన ఒక కమిటీ, వ్యవసాయ టెక్నాలజీ మిషన్ నేరుగా ముఖ్యమంత్రి అధ్యక్షతన ఒక కమిటీ వేశారు. కృత్రిమ వర్షాల కోసం ఒక బృహత్ ప్రయత్నమే జరిగింది.

కొత్త ప్రభుత్వం అధికారంలోకి రాకముందు వందలాదిగా జరిగిన రైతుల ఆత్మహత్యలు, కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత మరింత ఎక్కువగా జరిగాయి. వాటిని నిలువరించడానికి చేసిన ప్రయత్నాలు, ఇచ్చిన సహాయం ఆత్మహత్యల పర్వాన్ని ముగించలేక పోయాయి. ఇప్పటికీ ప్రతీరోజూ ఒకటి, రెండు ఆత్మహత్యల వార్తలు వస్తూనే వున్నాయి. ఇది బ్యాంకింగ్ వ్యవస్థ వైఫల్యాన్నే సూచిస్తుందన్న విమర్శలు వినవచ్చాయి. 46 వేలకోట్ల రూపాయల పెట్టుబడితో 26 భారీ, మధ్యతరహా నీటిపారుదల పథకాలను ప్రారంభించి అయిదు సంవత్సరాలలో పూర్తి చేస్తామనే సంచలనాత్మక ప్రకటన చేశారు.

పాత ప్రభుత్వపు 'జన్మభూమి' పథకానికి కొత్త నామకరణ మహోత్సవం చేసి, దాని కొనసాగింపుగా 'నగరబాట' పథకాన్ని చేబట్టి ముఖ్యమంత్రి రాష్ట్రమంతటా జైత్రయాత్ర జరిపారు. మాజీ ముఖ్యమంత్రి, ఆయన పార్టీ తిరుపతి మహాసభలో ఒకేసారి కోటివరాలిస్తే, ప్రస్తుత ముఖ్యమంత్రి చేతికి ఎముక లేదన్నట్లు ప్రజలు అడిగిన ప్రతీకోర్కెకు పరిష్కార వాగ్దానాలు చేస్తూ వచ్చారు; ఇపుడు కూడా చేస్తూనే వున్నారు. ఎన్నికలముందు చేసిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలనే తొందరలో ఉచిత విద్యుత్ అధికారికంగా ప్రకటించి, సుమారురు. 1200 కోట్ల పాత బకాయిలను రద్దు చేయటం హర్షణీయమేకాని ఆచరణలో కొరివితో తలగోక్కున్నట్లయింది. పాఠాలు నేర్చుకొన్న ప్రభుత్వం ఉచిత పథనానికి రిపేర్లు చేసి మరిన్ని సమస్యల సృష్టికి కారకులయ్యారు.

నీటిపారుదల ప్రాజెక్టుల పని వెంటనే ప్రారంభించే ఉద్దేశంతో టెండర్లు పిలవటం ఒక స్కాండల్‌గా తయారై, ప్రధాన ప్రతిపక్షానికి ఒక ఆయుధం ఇచ్చినట్లయింది. తమ పాలనలో ఇలాంటి వేమీ జరగనట్లు, తామేదో మడికట్టుకొని కూర్చునట్లు, రాజశేఖరరెడ్డి ప్రభుత్వమే అడుసులో కాలుపెట్టినట్లు ఇల్లెక్కి కేకలు వేయటం ప్రారంభించారు. (ఇదంతా ఒక కాంట్రాక్టరుకు టెండర్లలో వాటా దొరకనందుకు).

ఈ తొమ్మిది నెలల కాలంలో అనంతపురం జిల్లాలో వరుసగా తెలుగుదేశం కార్యకర్తల హత్యల పరాకాష్టగా పరిటాల రవి హత్య రాజకీయ, శాంతి భద్రతల ప్రకంపనలకు దారి తీసింది. ఈ హత్యలన్నీ ఆ జిల్లాలో అనూచానంగా వస్తున్న ముఠా తగాదాల కొనసాగింపేనని అందరికీ తెలిసిన విషయమే అయినా, శాంతి భద్రతలు కాపాడడంలో ప్రభుత్వం విఫలమైందని ప్రధాన ప్రతిపక్షం పెద్ద లొల్లిచేసి 500 బస్సులను ధ్వంసం చేసి, ప్రభుత్వానికి రాజకీయ ఉద్దేశాలు ఆపాదించి, సొమ్ము చేసుకోవడానికి ప్రయత్నం పెద్ద ఎత్తునే జరిగింది. ఇది ప్రభుత్వాన్ని డిఫెన్స్‌లో పారేసింది.

ఇదే సమయంలో, సందట్లో సడేమియా అన్నట్లు పోలీసులు మావోయిస్టుల కోసం కూంబింగ్, ఎన్‌కౌంటర్లు ప్రారంభించటం, మావోయిస్టులు కూడా అదే స్థాయిలో ప్రతిస్పందనగా ఇన్ఫార్మర్ల పేరుతో కొంతమందిని చంపటంతో ప్రశాంతంగా వున్న గ్రామీణాంధ్రలో భద్రత కరువైపోయిన పరిస్థితి ఏర్పడింది. మావోయిస్టుల సమస్య ప్రధానంగా సామాజికార్థిక సమస్య అంటూనే, దానిని శాంతి భద్రతల సమస్యగా మళ్లా మరోసారి దిగజార్చారు.

తాజాగా మద్యం బార్లు బార్లా తెరిచే నిర్ణయం తీసుకొని మహిళా

ప్రపంచ శత్రుత్వాన్ని కొని తెచ్చుకొన్నారు. సమాజంలో అసంతృప్తికి దాఖలాగా అన్నట్లు రాష్ట్ర వ్యాపితంగా వివిధ వర్గాల ప్రజలు వీధుల్లోకి వచ్చి రాజశేఖరరెడ్డి జిందాబాద్ అన్న నోటితోనే డౌన్‌డౌన్ అనే పరిస్థితి ఏర్పడింది. నిరుద్యోగులు, ఉద్యోగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, వివిధ కుల వృత్తుల వారు అంతే వీధి కెక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. వివిధ పంటలకు ధరలు తగ్గిపోవటంతో, మార్కెట్ యార్డుల అధికారులు, వ్యాపారులు కుమ్మక్కై రైతుల నెత్తిన శఠగోపం పెట్టబోయేసరికి రైతులు తిరగబడి కొన్ని మార్కెట్ యార్డులను ధ్వంసం చేసేవరకూ పోయింది. టీచర్ల దండయాత్ర, పబ్లిక్ సర్వీస్ కమీషన్ వ్యవహారాలు, ఇలా ఎన్నో వున్నాయి. కేవలం తొమ్మిది నెలల కాలంలోనే ఇన్ని సమస్యలు తెచ్చుకొని కాంగ్రెస్ ప్రభుత్వం రికార్డు బద్దలు కొట్టిందేమోననిపిస్తుంది. ఈ నేపథ్యంలో 2005-06 బడ్జెట్ ప్రవేశపెట్టడం జరిగింది.

ఈ నేపథ్యంలో గవర్నరు ఉపన్యాసం, బడ్జెట్ ఉపన్యాసం విన్నాం. గవర్నరు ఉపన్యాసం విధాన ప్రకటనగా, బడ్జెట్ ఉపన్యాసం ఆ విధానాలను అమలు పరచటానికి కావాల్సిన నిధులను సమకూర్చే పత్రంగా ఉండాలి. ఆ విధంగా వున్నాయా అని చూడబోతే గవర్నరు ఉపన్యాసం ప్రభుత్వ గత తొమ్మిది నెలల్లో చేసిన కార్యక్రమాల పట్టికగా వుండిపోయింది; కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది కాబట్టి కొత్త విధానాలు ఏమున్నాయి అని చూడబోతే, పాత విధానాల కొనసాగింపుగానే ఆ ఉపన్యాసం కొనసాగింది. వ్యవసాయం మీద, ఆ వ్యవసాయానికి కీలకావసరాలైన నీటిపారుదల, విద్యుచ్ఛక్తి మీద గత ప్రభుత్వం ఎంతమాత్రం దృష్టి సారించలేదని విమర్శిస్తూ వచ్చిన కాంగ్రెస్‌పార్టీ వ్యవసాయాన్ని ఎదుర్కొంటున్న తక్షణ, మధ్యకాలిక సమస్యల మీద తమ విధానాన్ని, చర్యలను గవర్నరు ద్వారా ఆవిష్కరించాలి. అలాంటి విధాన రచనకు తోడ్పడాలనే మంచి ఉద్దేశంతోనే జయతీఘోష్ ఆధ్వర్యాన ఒక కమిటీని నియమించింది. ఒక టెక్నాలజీ మిషన్‌ను ముఖ్యమంత్రి ఆధ్వర్యాన ఏర్పాటు చేసింది. ఈ మిషన్ ఏం చేసిందీ, వ్యవసాయ టెక్నాలజీలో ఏ విధానం అవలంబించబోతుంది అనే వివరాలు గవర్నరు ఉపన్యాసంలో కనుపించక పోవడంమాట అటుంచి, దాని ఊసేలేదు. జయతీఘోష్ కమిటీ నివేదిక సమర్పించి రెండునెలలైనా దాని ప్రస్తాపనే లేదు. ఆ కమిటీ సూచనలనయినా శాసనసభ్యులతో పంచుకొందా అంటే అదీ లేదు. ఈ ప్రభుత్వం ఏర్పడిన మొదటి రోజుల్లో అంత ఉధృతంగా కాక పోయినా, ఇంకా కొనసాగుతున్న ఆత్మహత్యలను నిలువరించటానికి ఏమి చర్యలు తీసుకొంటున్నారో తెలియ చేయలేదు. మూలకారణమైన రుణసౌకర్యం గురించి మాటే లేదు. వ్యవసాయ ఉత్పత్తులకు తగ్గుతున్న ధరలు రైతులను ఆందోళనకు నెట్టుతున్నాయి. విత్తనాల కొరత, కల్తీ పురుగు మందులు, బి.టి. విత్తనాల వైఫల్యం లాంటి అత్యవసర సమస్యల పరిష్కారం రాత్రికి రాత్రే చేయలేక పోవచ్చుగాని, వాటిని ప్రభుత్వం గుర్తించిన జాడకూడా ఉపన్యాసంలో కనుపించలేదు. కేవలం నీటిపారుదల సౌకర్య విస్తరణకు 46 వేలకోట్ల రూపాయలు వచ్చే అయిదు సంవత్సరాల్లో ఖర్చుచేసి 60 లక్షల ఎకరాలకు ప్రాణం పోస్తామన్న ప్రకటన ఇంకా బాలారిష్టాల్లోనే కొట్టుమిట్టులాడుతున్న పరిస్థితి, టెండర్ల స్కాంలో ఇరుక్కోవటం, కేంద్రం నుంచి అనుమతులు ఇంకా లభించాల్సి రావటం-ఇవన్నీ చూస్తే, ఈ నీటి పథకాలు పూర్తి కావటానికి అయిదు కాదు, ఇంకో అన్ని సంవత్సరాలు ఆగాల్సి వచ్చినా ఆశ్చర్యం లేదు.

మానవాభివృద్ధి నివేదిక ప్రకారం రాష్ట్రం స్థానం తొమ్మిది నుంచి పదికి దిగజారిన నేపథ్యంలో, చేసిన గవర్నర్ ఉపన్యాసం ఈ విషయంలో ఏమి చర్యలు తీసుకొంటున్నదీ చెప్పలేదు. నిరుద్యోగం అత్యంత తీవ్రమైన సమస్య అని వేరే చెప్పాల్సిన పని లేదు. కేంద్రంలో నూరు రోజుల ఉపాధి పథకాన్ని తయారుచేసి, దానికి తుది మెరుగులు దిద్దటానికి ఒక ప్రయత్నమైనా జరుగుతూంది. రాష్ట్రంలో యువతకు ఈ విషయంలో గవర్నరు ఎటువంటి సందేశాన్ని అందచేయలేదు. మద్యం గురించి ఒక కొత్త విధానాన్ని ప్రకటించిన ప్రభుత్వం గవర్నరు ఉపన్యాసంలో ప్రస్తావించనైనా లేదు. అమ్మకం పన్ను స్థానే వాట్ విధానం రాబోతుంది. ఇది అర్ధ శతాబ్ద కాలంగా అమలవుతున్న అమ్మకంపన్ను విధానాన్ని సమూలంగా మారుస్తున్న కొత్త విధానం. రాష్ట్రంలో వ్యాపారస్తులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తుంది. ప్రపంచబ్యాంకు భారతదేశం నెత్తిన రుద్దిన ఈ విధాన మార్పు గురించి గవర్నరు ఉపన్యాసంలో ప్రస్తావన అయినా లేకపోవడమేమిటి? అసలు గవర్నరు పదవే దండగమారి వ్యవహారం అయితే, ఆయన ఉపన్యాసం మరింత దండగమారి వ్యవహారంగా వుంది.

బడ్జెట్ 2005-06

ఇక బడ్జెట్ విషయానికొస్తే కేటాయింపులు, ఖర్చులు, లోటు, మిగులు లాంటి కొలబద్దలతో విశ్లేషించటం ఒక పద్ధతి. కాదు, సామాన్యుడికి ఈ బడ్జెట్ ఏమి ఇస్తుంది అనేది మరో పద్ధతి. బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాం అని ఆర్థికమంత్రి చెప్పటంలో కొత్త ఏమీ లేదు. బడ్జెట్ తయారు చేసేటపుడు ప్రతీ సంవత్సరం అన్ని కేటాయింపులను, అంచనాలను అయిదు నుంచి పది శాతం పెంచటం జరుగుతుంది. ఆ శాతాన్ని మించి పెంచినపుడే అది వార్త అవుతుంది. ఆ దృష్ట్యా చూచినపుడు నీటిపారుదల రంగానికి చేసిన భారీ కేటాయింపు తప్ప, మిగతా అన్నిటికీ కేటాయింపుల కోతే కనపడుతుంది. అభివృద్ధికి తోడ్పడేది ప్రణాళిక కేటాయింపులే కాబట్టి, ఆ కేటాయింపులు ఎలా తగ్గాయో ఈ కింది పట్టిక తెలియ చేస్తుంది.

ప్రణాళిక కేటాయింపులు 05-06

(శాతం)

	2004-05 స.అం.	2005-06 బ.అం.
వ్యవసాయం, తత్సంబంధిత రంగాలు	5.80	4.30
గ్రామీణాభివృద్ధి	6.24	4.94
నీటిపారుదల	31.21	40.57
విద్యుచ్ఛక్తి	16.58	14.01
పరిశ్రమలు, గనులు	1.95	2.33
రవాణా	6.10	4.45
టెక్నాలజీ, వాతావరణం	0.01	0.01
సాధారణ ఆర్థిక సేవలు	3.39	3.72
సామాజిక సేవలు		
విద్య, క్రీడ, కళలు, సంస్కృతి	4.85	4.66
వైద్యం, ఆరోగ్యం	3.20	2.95
మంచినీరు, పారిశుభ్రత	3.48	3.15
గృహనిర్మాణం	3.32	2.29
పట్టణాభివృద్ధి	3.92	3.62
సమాచారం, ప్రచారం	0.04	0.03
ఎస్సీ, ఎస్టీ, బి.సి., మైనారిటి	6.96	6.59
కార్మికులు, ఉపాధి	0.14	0.11
సామాజిక భద్రత, సంక్షేమం	0.64	0.57
పోషకాహారం	1.09	0.89
సాధారణ సేవలు	1.09	0.80
	100.00	100.00

స.అం: సవరించిన అంచనా, బ.అం: బడ్జెట్ అంచనా

ఏ పద్దులకింద అయితే, సామాన్యులకు కాస్త స్వాంతన, ఊరట కలిగించే కేటాయింపులున్నాయో, వాటికే కోత విధించినట్లు పై పట్టిక తెలియచేస్తుంది. అత్యధిక ప్రజానీకానికి మేలు చేయని బడ్జెట్. వారినెలా ఉత్సాహపరుస్తుంది. ఈ కేటాయింపులు చూస్తుంటే, ఇప్పటికే అసంతృప్తితో ఈ పాటి భాగోతానికి రూపొందించిన ప్రణాళిక మరికొంత వివరంగా పరిశీలించాలి. 05-06 ప్రణాళిక కేటాయింపు 04-05 సవరించిన అంచనా కన్నా రు. 2,825 కోట్లు పెరిగితే, అందులో నీటిపారుదల రంగానికి చేసిన అదనపు కేటాయింపు రు. 2,347 కోట్లు పద్దు మినహాయిస్తే ఈ సంవత్సరానికి, వచ్చే సంవత్సరానికి మధ్య మిగతా రంగాలకు కేటాయింపుల్లో తేడాయే లేదు. అంటే ప్రణాళికాభివృద్ధి స్థంభించిపోతుందన్న మాట. ఇది మొదటి విషయం. సామాన్యులకు ఉపకరించే సామాజిక సంక్షేమ పథకాలకు చేసిన కేటాయింపు శాతం 27.64 నుంచి 24.86కు తగ్గింది. వాస్తవ లెక్కల్లో చూచినా పెరిగింది రు. 3,545 కోట్లనుంచి రు. 3,891 కోట్లకు, అంటే కేవలం రు. 346 కోట్లు మాత్రమే పెరిగింది. ఈ చిన్న మొత్తంతో సామాజిక సంక్షేమం ఏమంత గొప్పగా పెరుగుతుంది? ఇది రెండో విషయం. ఈపాటి ప్రణాళిక అమలు పరచడానిక్కూడా విదేశీ సహాయం లేనిదే ముద్ద దిగటం లేదు. ప్రణాళిక కోసం ఖర్చు చేయబోయే ప్రతీ ఎనిమిది రూపాయల్లో ఒక రూపాయ విదేశాల నుంచి రావాల్సిందే. ఈ విదేశీ సహాయం రు. 2,162 కోట్లు. ఈ సహాయం షరతులతోనే వస్తుందన్న విషయం తెలిసిన విషయమే. ఈ విదేశీ సహాయంతో రు. 442 కోట్లు గ్రామీణాభివృద్ధికి, రు. 11 కోట్లు ఆరోగ్యానికి, రు. 139 కోట్లు దళితుల సంక్షేమానికి కేటాయింపు జరిగింది. మన గ్రామాల్లో అభివృద్ధికి, మనం ఆరోగ్యంగా వుండడానికి, పేదల్లో నిరుపేదలకు సహాయం చేయడానిక్కూడా మనం విదేశీ సహాయం మీద ఆధారపడటం సిగ్గుతో తలవంచు కోవాల్సిన విషయం. ఏ నీటిపారుదల ప్రాజెక్టులో అయితే, పెద్ద ఎత్తున నిధులు అవసరం అవుతాయి. మనవద్ద నిధులకొరత వుంది కాబట్టి, విదేశీ రుణసహాయం అవసరం అంటే పోనీలే అనుకోవచ్చు. కాని ఇంత చిన్న విషయాలక్కూడా చెయ్యి చాచాల్సి రావటం దురదృష్టం అయితే, ప్రస్తుత ప్రభుత్వం అదే ప్రపంచబ్యాంకు చుట్టూ ప్రదక్షిణలు చేయటం, అప్పు చేయక తప్పదనే చంద్రబాబు పాటనే పాడడం (షరతులు లేని రుణానికి అభ్యంతరం లేదు) చూస్తే ఓడిపోయిన పార్టీ, గెలిచిన పార్టీ మధ్య సరిహద్దు గీత చెరిగిపోతూంది.

రెవెన్యూ పద్దు

రెవెన్యూ పద్దుకింద అభివృద్ధి ఖర్చు, అభివృద్ధేతర ఖర్చు శాతాల్లో ఈ సంవత్సరానికి వచ్చే సంవత్సరానికి తేడా లేదు. నీటిపారుదల మీద ఖర్చు కోసం భారీగా కేటాయింపులు చేసినందుకు సంతోషిద్దామా, లేక అంత పెద్ద ఎత్తున కేటాయింపు పెంచటం వల్ల సామాజిక సంక్షేమానికి, మూలధనం ఖర్చు మీద కోత పడినందుకు విచారించాలా? సామాజిక సంక్షేమం కోత గురించి పైనే చెప్పటం జరిగింది.

మూలధనం ఖర్చు

అంటే ఆస్తులు సృష్టించే ఖర్చు. పాతప్రభుత్వ హయాంలో నీటి పారుదల ఖర్చు తీసివేయగా మిగిలిన పద్దులకింద ఖర్చు రు. 2,713 కోట్లయితే, వచ్చే సంవత్సరంలో ఈ ఖర్చు రు. 1,849 కోట్లకు కుదించుకపోతుంది. వ్యవసాయానికి 2003-04లో రు. 27

కోట్లనుంచి 2005-06లో రు. 23.17 కోట్లకు తగ్గనుంది. సంతోషించాలో, విచారించాలో మీరే చెప్పండి.

రెవెన్యూ పద్దుకింద ఆదాయం

(శాతం)

	వాస్తవం 03-04	స.అం. 04-05	బ.అం. 05-06
కేంద్రం పన్నుల్లో వాటా	18.87	19.80	18.58
ఆదాయ వ్యయాలమీద పన్ను	0.6	0.7	0.8
ఆస్తులమీద పన్ను	4.28	4.52	4.60
వస్తువులమీద పన్ను	46.48	48.81	50.10
పన్నేతర ఆదాయం	13.42	13.38	12.24
గ్రాంట్లు	16.34	12.71	13.63

వస్తువులమీద పన్ను అంటే ఎక్సయిజు, అమ్మకంపన్ను వాహనాల పన్ను, ప్రయాణీకులమీద పన్ను, విద్యుచ్ఛక్తి తదితర పన్నులుంటాయి. ఇవన్నీ సాధారణ ప్రజానీకం చెల్లించే పన్నులు మొత్తం రెవెన్యూ ఆదాయంలో సగం భారాన్ని సామాన్యులే భరిస్తున్నారు. గత ప్రభుత్వం కన్నా ఈ ప్రభుత్వమే ఎక్కువ భారం మోపుతుందని పై పట్టిక తెలియ చేస్తుంది. ఆంధ్రదేశం ముఖ్యంగా సర్కారు జిల్లాలు, హైదరాబాద్ నగరం సంపన్నులు నివసించే ప్రాంతం. వీరిమీద పన్ను భారం సుమారు అయిదు శాతం మాత్రమే. చంకలో పిల్లను పెట్టుకొని ఊరంతా తిరిగినట్లు, సంపన్నులను ఇలా తేలిగ్గా వదిలిపెట్టి నిధులకోసం రాష్ట్రం, దేశం, ప్రపంచం చుట్టూ తిరగడమేమిటి? ఉదాహరణకు స్థూల రాష్ట్రాదాయంలో సుమారు 20 శాతం వ్యవసాయం నుంచే వస్తుండగా, ఆ వ్యవసాయదారులు చెల్లించేది కేవలం రు. 124 కోట్లు మాత్రమేనా? పేరుకు భూమిశిస్తు అంటారు గాని భూమిశిస్తు ఎపుడో రద్దయింది; వారు చెల్లించేది నీటితీరువా మాత్రమే. ఆ నీరు సరఫరాకు వచ్చే అయిదేళ్ళలో రు. 46 వేలకోట్లు ఖర్చు చేయబోతూ వారి వద్దనుంచి వసూలు చేసేది ఇంత చిన్నమొత్తం మాత్రమేనా? కనీసం ప్రాజెక్టుల నిర్మాణానికి వారివద్ద నుంచి నిధులను సేకరించలేరా?

రుణభారం

ఇంతవరకూ కాంగ్రెస్ నాయకులు తాము 1994-95లో అధికారం నుంచి వైదొలగినపుడు రుణభారం రు. 15 వేలకోట్లే వుండగా, తెలుగుదేశం వచ్చి ఆ భారాన్ని రు. 57 వేలకోట్లకు పెంచిందని ఆ పార్టీ ప్రభుత్వాన్ని చెంపలు ఎడా పెడా వాయించారు. కాని ఇపుడు ఆ కాంగ్రెస్ ప్రభుత్వమే కేవలం రెండేళ్ల కాలంలో సుమారు రు. 20 వేలకోట్లు రుణం చేయబోతుంది. ఇదికాక, ఇతర ప్రభుత్వ సంస్థలు తమవద్ద నిధుల్లేక, మార్కెట్‌లో, బ్యాంకుల్లో అప్పుచేయడానికి ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చి, నిధులు తెచ్చుకొంటున్నాయి. ఇంత పెద్ద ప్రభుత్వమే నిధులు లేక రుణాలు తెచ్చుకొంటూంటే, ఈ ప్రభుత్వం మరొకరికి గ్యారంటీ ఇవ్వడమేమిటి? ఏతావాతా జరిగేదేమంటే ఆ సంస్థలు చెల్లించ లేక, ఆ భారం కూడా ప్రభుత్వం మీదే పడుతుంది. అలా గ్యారంటీ వున్న సొమ్ము మొత్తం రు. 19 వేలకోట్లు చివరకు ప్రభుత్వమే చెల్లించాల్సి వుంటుంది. ఈ సొమ్ము కూడా చెల్లించాల్సిన అప్పు లాంటిదే. కాగా వచ్చే సంవత్సరం ఆఖరుకు ప్రభుత్వ రుణభారం రు. 76+19=95 వేలకోట్లు. లెక్కవేస్తే సుమారుగా మనం సగటున ప్రతి నిమిషం ఒక కోటి రూపాయలు వడ్డీ చెల్లించాల్సి వుంటుంది. ఇది ఇందిరమ్మ రాజ్యం ఎలా అవుతుంది? ఆమెకూడా ఐ.ఎం.ఎఫ్ నుంచి రుణం తీసుకొంది కాని, బహుశా అందులో సగం తీసుకోకుండానే తిరిగి ఇచ్చేసింది.

నీటిపారుదల

ప్రభుత్వ బడ్జెట్, ఆలోచనలు అన్నీ నిర్మించబోయే రు. 46 వేలకోట్ల పెట్టుబడి చుట్టూ పరిభ్రమిస్తున్నాయి. ప్రాజెక్టుల అవసరాన్ని గురించి రెండో అభిప్రాయం ఎవరికీ వుండదు. అయితే సాధ్యా సాధ్యాల గురించే చర్చ జరుగుతూంది. రు. 46 వేలకోట్లలో బడ్జెట్లో ప్రతీ సంవత్సరం కేటాయింపులు చేయవచ్చు గాని ఆ మొత్తాన్ని అప్పుచేయటం తప్ప మరో మార్గం లేదు. ఉత్పాదక రంగాల్లో తెచ్చిన అప్పు పెట్టుబడి పెడితే తిరిగి చెల్లించే శక్తి మనకు లభిస్తుంది. కాబట్టి తప్పు లేదనే ఆర్థికమంత్రి వాదన సిద్ధాంతరీత్యా సరైనదే. కాని ఆచరణ దగ్గరే పేచీ వస్తుంది. రు. 46 వేలకోట్ల మీద వడ్డీ చెల్లించాలి. ప్రస్తుతం ఎకరాకు రు. 200 నీటితీరువా వసూలు చేస్తున్నారు. 60 లక్షల ఎకరాలు సాగులోకి వస్తాయంటున్నారు కాబట్టి ప్రతీ ఏడాది రు. 120 కోట్లు ఆదాయం వస్తుంది. రైతుల ఆదాయం, కొనుగోలు శక్తి పెరుగుతాయి. ప్రభుత్వ అమ్మకంపన్ను ఆదాయం పెరుగుతుంది. ఈ వసూళ్లు మరో రు. 120 కోట్లు అని అనుకొన్నా మొత్తం రు. 240 కోట్లు. ప్రతీ సంవత్సరం రు. 240 కోట్ల చెల్లింపుతో రు. 46 వేలకోట్ల అప్పు ఎపుడు తీరుతుంది? రోశయ్యగారు ఈ అప్పు తీరుమానం గురించి కాస్త వివరిస్తే బావుంటుంది.

బడ్జెట్‌ను 12 గంటల 20 నిమిషాలకు ప్రవేశపెట్టారు. అది ఏదో ముహూర్తం పెట్టినట్లుంది. ఆ పురోహితుడెవరో గాని ఇది ముహూర్త బలంలేని బడ్జెట్‌గా కనుపిస్తుంది. మార్పులు, చేర్పులు చేయకపోతే బడ్జెట్ మీద కట్‌మోషన్లు, వోటింగు ఎదుర్కోవాల్సి రావచ్చు.

*

బడ్జెట్ ఫోకస్

2005-06 బడ్జెట్ రాష్ట్ర ప్రజల ఆశలు తీరుస్తుందా?

-సారంపల్లి మల్లారెడ్డి
కార్యదర్శి, ఆం.ప్ర.రైతుసంఘం

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారానికి వచ్చాక రెండవసారి బడ్జెట్‌ను ఫిబ్రవరి 18, 2005న మధ్యాహ్నం 12.25 గంటలకు ప్రవేశపెట్టింది. సహజంగానే కేంద్ర-రాష్ట్ర బడ్జెట్‌లు ప్రవేశపెట్టినప్పుడు ముహూర్తాలు చూచి, మంచిదనుకున్న ఆ నిమిషంలో ప్రవేశపెట్టడం జరుగుతూంది. సామాన్య మానవుడు మొదలు ఆర్థికవేత్తవరకు బడ్జెట్ తీరును గమనిస్తారు. ఏ వర్గ ప్రజలు రాయితీలు పొందాలన్నా, ఏ ప్రాంతంలో ఏ రంగం అభివృద్ధి కావాలన్నా అందుకు బడ్జెట్ కేటాయింపులుండాలి. ఆ ఏడాది బడ్జెట్‌లో ఆ విధంగా కేటాయింపులు లేకపోతే సంవత్సరం వరకు వేచి చూడాల్సి వస్తుంది!

మరోవైపు బడ్జెట్ కేటాయింపులు-వాటి విడుదలలో నైతికత దాదాపు లోపించింది. కేటాయింపులే తప్ప, నిర్దేశిత కేటాయింపులకు వ్యయం చేయని నిధులు వందలకోట్లలో ఉంటున్నాయి. ఒక్కోసారి కేటాయించిన పథకాలు పూర్తిగా ఎత్తివేసి, కొత్త పథకాలు చేపడుతున్నారు. ముఖ్యంగా అభివృద్ధికి కీలకమైన ప్రణాళికా కేటాయింపులు విడుదల చేయకుండా మార్పులకు గురి చేస్తున్నారు. అత్యధిక పేదలకు కేటాయించిన సంక్షేమ పథకాలలో కోత, ఇరిగేషన్ బడ్జెట్‌లో కోత వలన ఇటు ఉపాధి పథకాలు-అటు అభివృద్ధి పథకాలకు గ్రహణం పడుతున్నది. రుణాలు, గ్రాంటులు కూడా బడ్జెట్‌లో చేర్చాలి. కాని నేడు ఎక్కువభాగం ఆపని జరుగడం లేదు. విదేశీ రుణాలు, గ్రాంటులు బడ్జెట్‌లో చూపకుండానే పాలక ప్రభుత్వం తన చిత్తం వచ్చినట్లు వ్యయం చేస్తున్నది. అనుత్పాదక రంగంపై చేసే వ్యయభారం ప్రజలు భరించాల్సిందే కదా! రానున్న రుణాలు, గ్రాంటులపై సరైన అంచనా లేక, అవకాశాలున్నట్లు భావిస్తే, ప్రజలపై పన్నులు వేయకుండా బడ్జెట్‌లో లోటుగా చూపాలి. కాని నేడు అనేక పథకాలు నీరు-మీరు లాంటి పథకాలు, పనికి ఆహారం పథకాలు, ఆర్థిక పునర్నిర్మాణ కార్యక్రమానికి కేటాయించిన "సంస్థాగతమార్పుల" వ్యయం లాంటివి ఏబడ్జెట్‌కు అందడం లేదు. వేలకోట్లలో జరుగుతున్న ఈ వ్యయం ప్రజలకు గాని, చట్ట సభలకు గాని జవాబుదారీగా లేవు. అభివృద్ధి పనులకు కేటాయించిన బడ్జెట్ వ్యయం చేయకుండా కాలాతీత చేయడం అతి ప్రమాదకరమైన విధానం. ముఖ్యంగా సాగుకు ఉపయోగపడే ప్రాజెక్టులకు గత 10 సంవత్సరాలుగా కేటాయింపులు చేశారు. ఉదా॥ శ్రీరాంసాగర్ వరద కాలువ, శ్రీరాంసాగర్ రెండవదశ, భీమా, నెట్టెంపాడు లాంటి పథకాల కేటాయింపుల వ్యయం లేదు. గత సంవత్సరం చేసిన కేటాయింపులు కూడా వ్యయం జరగనట్లు నివేదికలు చెపుతున్నాయి. ప్రస్తావన సంవత్సరం మరో 5 వారాలు (23-2-2005 నాటికి) ఉంది. ఈ మధ్య వ్యయం చూపుతారేమో!

వ్యయం జరుగుతున్నా, అడ్వాన్సులు చెల్లించినా వ్యయం కిందకే వస్తుంది. అడ్వాన్సులు పొందిన వారు పనులు చేయనిచో ఆ నిధులకు నష్ట పోయేది ప్రజలే.

ఈ విధంగా పరిణామం చెందిన బడ్జెట్లు గత నైతికతను, ప్రమాణాలను కోల్పోయాయి. బడ్జెట్ సమావేశాలు నెల రోజుల సమావేశాలుగా మారాయి. బడ్జెట్ చర్చలకన్నా ఈ సమావేశాలలో ఇతర విషయాలకే చర్చ సమయం పోతున్నది. పద్దులపై చర్చలు జరుగుతున్నా చివరిరోజున పద్దులన్ని గిలిటిన్ మూజువాణి ఓటుతో ఆమోదం పొందుతాయి. అందుకే ప్రజలకు విజ్ఞులకు, ఈ అంశంపై మోజు తగ్గింది. అయినా అక్కడ కూడా మిణుకు, మిణుకుమంటున్న ఆశలతో ఈ బడ్జెట్‌ను పరిశీలిద్దాం.

గత పదేండ్లలో బడ్జెట్ నాలుగురెట్లు పెరిగింది. అదే దామాషాలో ప్రణాళికేతర, ప్రణాళికా బడ్జెట్లు కూడా పెరిగాయి.

2005-06 సంవత్సరంలో వడ్డీ చెల్లింపులకు మరో 10 వేలకోట్లు రుణాలు చేయాల్సి ఉంది. ఈ బడ్జెట్‌లో ప్రధానంగా ప్రణాళికేతర వ్యయం మూడింట రెండు వంతులు కాగా, ప్రణాళికా వ్యయం ఒక వంతు మాత్రమే. ఈ ప్రణాళికా వ్యయంతోనే రాష్ట్రాభివృద్ధి జరగాలి. ముఖ్యంగా అభివృద్ధి పథంలో పయనించే ఏ రాష్ట్రమైనా, దేశమైనా ప్రణాళికా వ్యయం పెంచాలి. ఉత్పాదకరంగ అభివృద్ధికి ప్రణాళికా నిధులు కావాలి. రుణాలు కొద్దిగా తేవడం వలన ద్రవ్యలోటు 837985.23 లక్షలకు చేరింది. ప్రపంచబ్యాంకు ఈ లోటును తగ్గించమని ఒత్తిడి చేస్తున్నది. ఈ ఆదేశాన్ని మన్నించిన ప్రభుత్వం ద్రవ్యలోటు తగ్గింపుకు సంక్షేమ పథకాలలో కోత, ఉత్పాదక రంగంకు కేటాయించిన నిధులలో కోత పెడుతున్నది. ఈసారి కూడా అంతే జరగవచ్చు. ఏ పరిస్థితులలోను ప్రణాళికేతర బడ్జెట్ తగ్గింపుకు వీలు లేక పోగా అది పెరుగుతుంది.

వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, విద్యుత్, ట్రాన్స్‌పోర్టు, సాంఘిక సేవలు, సాధారణ సేవలకు కేటాయింపుల శాతం ప్రస్తావన సంవత్సరంపై తగ్గాయి. ఇరిగేషన్, వరదనివారణ, పరిశ్రమలు, సాధారణ ఆర్థిక సేవలకు కొంత పెరిగింది. ప్రధానంగా ఇరిగేషన్‌ను

31.21 శాతం నుండి 40.57 శాతానికి పెంచారు. అనగా 8.36% పెంచారు. ఉత్పత్తి రంగంపై పెంచడం సరైనదే. కాని గ్రామీణ ప్రజలలో దారిద్ర్యం పెరుగుతున్న క్రమంలో సాంఘిక సేవల కేటాయింపును 2.78 శాతం తగ్గించడం హానికరమైన చర్యగా ఉంటుంది. నేడు గ్రామీణ ప్రజల కొనుగోలు శక్తి దిన, దినం తగ్గిపోతున్నది. అలాగే పట్టణ ప్రాంతాలలోని మురికి వాడలలో నివసిస్తున్న వారి కొనుగోలు శక్తి కూడా తగ్గిపోతున్నది. ఈ స్థితిలో అటు వ్యవసాయ రంగానికి 1.50% తగ్గింపు, ఇటు సాంఘిక సేవలకు 2.78% తగ్గింపు దారిద్ర్య పెరుగుదలకు కారణమవుతుంది.

ప్రణాళికా బడ్జెట్‌లో అతికీలకమైన, విద్య, వైద్యం, నీటిసరఫరా, పారిశుభ్రత, హరిజన-గిరిజన, మైనార్టి సంక్షేమం లాంటి శాఖలున్నాయి. వీటి కేటాయింపుల శాతం ఏటా తగ్గిస్తున్నారు. వీటిని పెంచకుండా రాష్ట్రంలో విద్యాభివృద్ధి, నాగరికత పెరుగుతుందని ఆశించలేము. ద్రవ్యలోటుకు కావాల్సిన రుణ లభ్యతలో లోటు ఏర్పడితే ఈ శాఖ కేటాయింపులే కోతకు గురవుతాయి. అలాగే రాష్ట్రాభివృద్ధికి అత్యంత ప్రాథమికమైన కీలకమైన వ్యవసాయశాఖ కేటాయింపులు తగ్గడం వలన గ్రామీణ జనాభాలో ఈ రంగంపై ఆధారపడిన 69 శాతం ప్రజలు ప్రస్తుతమున్న సంక్షోభంలో మరింత కూరుకపోతారు. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాలి. గ్రామీణ చేతివృత్తులు, పశుపోషణ భారమై పోతుంది. ఆహార ధాన్యాలకు భద్రత కరువవుతుంది. ఉపాధి కల్పన కూడా హుళక్కే.

సాగునీటికి 40 శాతం కేటాయింపులు తక్కువేమీ కాదు. హర్షణీయమే. గత చరిత్రలో జరిగిన లోపాన్ని ప్రస్తుతం సరిదిద్దే చర్యగా భావించవచ్చు. అయితే ప్రస్తావన సంవత్సరం అనగా 2004-05లో కేటాయించిన బడ్జెట్‌లో 422160 లక్షలు (31.76 శాతం) కాగా రివైజ్డు బడ్జెట్‌లో 400251.89 లక్షలు (31.21)గా తగ్గించారు. అనగా రు. 4 వేలకోట్లు కేటాయించారు. ఈ కేటాయింపులో నేటికి (18-2-2005 నాటికి) ఎంత వ్యయం జరిగింది? ఒక అంచనా ప్రకారం రు. 1600 కోట్లు మించలేదు. మరి మిగిలిన 45 రోజులలో రు. 2400 కోట్లు ఎలా వ్యయం చేస్తారు? అడ్వాన్సులుగా చెల్లిస్తున్నట్లు వార్తలు తెలుపుతున్నాయి. పనులు పూర్తికాకుండా ఎలా చెల్లిస్తారు? ఈ వ్యయం కాక పోవడానికి కారణం నిధులు విడుదల చేయకపోవడమా? లేక మరేదైనా కారణం ఉందా? ఈ చిదంబర రహస్యం ప్రభుత్వమే వివరించాలి. అన్నింటా పారదర్శకమంటున్న ప్రభుత్వం ప్రస్తావన సంవత్సర వ్యయం గురించి దాచాల్సిన పనిలేదు.

సాగునీటికల్పన చేసిన ప్రాంతాలు ఆర్థికంగా నాగరికంగా అభివృద్ధిదశలో నున్నాయి. మన రాష్ట్రానికి 40 నదుల ద్వారా 2746 టి.ఎం.సిల నీటిని నికర జలాలుగా వినియోగించుకునే హక్కు 1975లోనే ఇవ్వబడింది. కాని ఇంతవరకు 1600 టి.ఎం.సిలకు మించి వినియోగించ లేకపోతున్నామని నీటి గణాంకాలు చెబుతున్నాయి. ఇవి కాక మరో 2000 నుండి 3000 టి.ఎం.సిలు మిగులు జలాలు సముద్రం పాలవుతున్నాయి. నికర జలాల వినియోగమే లేనప్పుడు మిగులు జలాల వినియోగంపై చర్చ జరుపగలమా?

అదేవిధంగా రాష్ట్రంలో సాగుకు యోగ్యమైన భూమి 364 లక్షల ఎకరాలుంది. నేటికి సాగులోకి వచ్చింది 270 లక్షలు మాత్రమే. దాదాపు మరో 100 లక్షల ఎకరాలు సాగులోకి తేవాలి. తద్వారా కోట్లమందికి ఉపాధి కల్పించవచ్చు. గవర్నరుగారి ప్రసంగంలో కూడా ఈ విషయం చెప్పబడింది. ఏటా చెపుతూనే ఉన్నారు. గతంలో పట్టాలు పొందిన పేదలు భూమి బాగు సేతకు కావాల్సిన నిధులు లేక పట్టా పొందినా బీడుగానే పెట్టారు. ఇందిరాప్రభ పేర రాష్ట్ర ముఖ్యమంత్రి గుంటూరు జిల్లాలో భూమిసాగుకు నిధులిస్తామని ప్రారంభోత్సవం చేశారు. మరి బడ్జెట్‌లో నిధులు ఎందుకు కేటాయించ లేదు? పైగా వ్యవసాయశాఖ కేటాయింపుల శాతం తగ్గింది. విస్తారమైన రాష్ట్ర వనరులను వినియోగించుకోవడం ద్వారా సర్వతోముఖాభివృద్ధి చేయవచ్చు. కాని ఈ కేటాయింపులు ఆ పని పూర్తి చేస్తాయా?

ఈ మధ్య ఒక ప్రముఖుడు మాట్లాడుతూ మనదేశం, చైనాదేశం రానున్న 20 సంవత్సరాలలో ప్రపంచంలో అగ్రదేశాలుగా అవతరిస్తాయని, ప్రపంచానికి మార్గాన్ని నిర్దేశించే దిశగా అభివృద్ధి చెందుతాయని సెలవిచ్చారు. ఇప్పటికే చైనా ప్రపంచంలో ఉత్పత్తి, ఉత్పాదకతలో గణనీయమైన అభివృద్ధేకాక ప్రథమ స్థానంలో ఉంది. మరి భారతదేశం స్థానమెక్కడ? పత్తి ఉత్పాదకతలో చైనాలో హెక్టారుకు 1120 కిలోలు ఉత్పత్తికాగా, మనదేశంలో 320 కిలోలు మాత్రమే. ఇది మన చరిత్ర. ఈ విధమైన కేటాయింపులూ, కేటాయించినా విడుదల కాని నిధులతో శతాబ్ద కాలం తర్వాతనైనా అగ్రస్థానానికి చేరుతామా? "అన్ని వుండి అల్లుని నోట్లో శని" అన్నట్లుంది. ఒకవైపున వినాశనర ప్రపంచబ్యాంకు విధానాలు అమలు చేస్తూ సహకారరంగం కుదింపు, విత్తనాల ప్రైవేటీకరణ, నీటి ప్రైవేటీకరణ చేపడుతూ, పరిశ్రమలను మూసివేస్తూ, అన్నిరకాల పన్నులు పెంచుకుంటూ పోతే రాష్ట్రం-దేశం అభివృద్ధివైపు వెళ్తుందా? అందరం ప్రశ్నించుకోవాల్సిన ప్రశ్న.

ప్రభుత్వాలు వాస్తవ దృష్టితో బడ్జెట్ల రూపకల్పన చేయాలి. వాటి నైతికతను పెంచాలి. బడ్జెట్‌ను సమగ్రంగా రూపొందించి ఉత్పాదక రంగాన్ని, సంక్షేమ రంగాన్ని అభివృద్ధి చేసినప్పుడే రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందుతుంది. అంతవరకు సంక్షోభాల వైపే మనదారి. ఇప్పటికే అన్ని రంగాలలో ఉత్పత్తి తగ్గిపోతున్న వాస్తవాన్ని గుర్తించాలి.

*

సామాజిక సంక్షోభం-విద్యా విధానం

-ప్రొ॥ ఆర్.ఎస్. రావు

ఆర్థిక సంక్షోభం-విద్య, సమాజం

ఈ మే నెల మండువేసవిలో ఇక్కడ సమావేశమైన ఉపాధ్యాయులతో నాకున్న కొన్ని అభిప్రాయాలను పంచుకోవడానికి ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ కల్పించిన ఈ అవకాశానికి నేను చాలా సంతోషిస్తున్నాను. గతంలో నేను మాట్లాడినపుడు మాయావాదం (ఫెటిషిజం) ముఖ్యంగా సరుకు మాయావాదం (కమాడిటీ ఫెటిషిజం) అనే అంశాన్ని ఎంచుకున్నాను. ఈ సరుకు మాయావాదం వాస్తవ వ్యవస్థలను అర్థం చేసుకొనుటలో ఏ విధంగా అడ్డంకిగా నిలుస్తున్నది సోదాహరణంగా వివరించాను. ఉపాధ్యాయులుగా మనం వాస్తవాలకు కొన్ని నమూనాలను లేక చిత్రాలను రూపొందించుకొని వ్యవహరిస్తూ ఉంటాము. ఈ నమూనాలు లేక చిత్రాలు ప్రజల వాస్తవ జీవితాలలో వారు నిర్వహిస్తున్న పాత్రలకు, ప్రజలు ఏ విధంగా ఉండాలని మనం కోరుకుంటూన్నామో ఆ నమూనాలకు దగ్గరగా ఉన్నాయని విశ్వసిస్తాం. ఈ నమూనాలు లేక చిత్రాలు వాస్తవాలకు దగ్గర కావడంలో విఫలం చెందడం వలననే వ్యవస్థాగతమైన సంక్షోభాలు ప్రారంభమవుతున్నాయి. ఈ విధమైన పరిస్థితులలోనే సామాజికవిజ్ఞానం సమాజానికి సంబంధంలేనిదిగా, సమాజాన్నించి విడదీయబడినదిగా మారిపోతోంది. నా గత ఉపన్యాసంలో ఈ సరుకు మాయావాదం ఫలితంగా ఏర్పడిన తప్పుడు చైతన్యం వాస్తవ రూపాలను ఏ విధముగా మసకబారుస్తున్నది, ఆ మేరకు సామాజిక సంక్షోభం తీవ్రతను ఏ విధంగా మరుగునపరుస్తున్నదీ వివరించడానికి ప్రయత్నం చేశాను. ఈ రోజు ఆ వాదాన్ని కొంచెం ముందుకు తీసుకుపోదలచుకున్నాను. అది భారతదేశంలోని ఆర్థిక వ్యవస్థ కానివ్వండి, విద్యావ్యవస్థ కానివ్వండి, సామాజిక వ్యవస్థ కానివ్వండి, లేక మరేదైనా వ్యవస్థ కానివ్వండి, వాటికి సంబంధించి మనం కల్గివున్న చిత్రాలకు చాలా భిన్నంగాను, పెద్దవిగాను ఆ వ్యవస్థలున్నాయన్నది నా అభిప్రాయం. ఏ మానవ వ్యవస్థలోనైనా ఈ చిత్రాలనేవి వాస్తవ వ్యవస్థలకన్న పరిమాణంలో చాలా చిన్నవిగా ఉంటూ క్రమక్రమంగా వాస్తవానికి దగ్గరగా విజ్ఞానం పెంపొందుతుంది. ఈ పరిస్థితులన్నిటిలోను ఆ నమూనా ఒక విధంగా సామాజిక ప్రతిబింబమే. ఈ ప్రతిబింబాలనేవి కొన్నిసార్లు ఆ నమూనాలను తయారుచేసే వ్యక్తుల లేక వ్యవస్థల గుణాత్మక స్థాయినిబట్టి నాసివిగా ఉంటాయి. భారతదేశంలో ఈ నమూనాలు లేక చిత్రాలు వాస్తవ భారతీయ సామాజిక ప్రతిబింబాలకు భిన్నంగా ఉన్నాయి. అంతేగాక అవి బయట నుండి తీసుకొని ఇవ్వబడ్డాయి. ఈ సామాజిక వాస్తవం కాలక్రమంలోని ఆ నమూనాతో మారగలదని మనం ఆశిస్తున్నాం. ఇక్కడే భారతదేశపు సామాజిక సంక్షోభం ఇమిడియున్నది.

సోదాహరణంగా పరిశీలిద్దాం

ఈ మధ్యకాలంలో ఇంద్రావతి నదిమీద నిర్మింపబడిన ఆనకట్ట వలన నిర్వాసితులైన ప్రజల గూర్చి అధ్యయనం చేయాలని ఆసక్తి కల్గింది. ఈ ఆనకట్ట ఒరిస్సా రాష్ట్రం కోరాపుట్, కల్హండి జిల్లా సరిహద్దు ప్రాంతంలో ఉంది. ఈ డ్యామ్ నిర్మాణం వలన దాదాపు అరవై ఐదు గ్రామాలు ముంపుకు గురౌతాయి. ఈ ప్రాంతంలో నివసిస్తున్న కుటుంబాలలో ఎక్కువ భాగం చిరకాలంగా అక్కడ స్థిరపడిన "పరజ" అనే ఒక తెగకు సంబంధించినవారు. సువిశాలమైన అడవీ ప్రాంతం మధ్య నివసిస్తూన్న వీరి జీవన విధానం బ్రాహ్మణ సామాజిక పద్ధతికి భిన్నంగా రూపొందింది. దీనిని బహు కొద్దిమంది మానవశాస్త్రవేత్తలు మాత్రమే పట్టించుకొనుటకు ప్రయత్నం చేశారు. వీరి జీవితాన్ని గోపీనాథ్ మహంత అనే నవలాకారుడు "పరజ" అనే నవలలో చిత్రీకరించాడు. ఇక్కడ మనం అర్థం చేసుకోవలసినది ఇంకో విషయముంది. ఈ ఆనకట్ట నిర్మాణం వారి నివాసాన్ని మార్చటమే గాక వారి జీవన విధానాన్ని మార్చివేసింది.

1984 భూస్వాధీన చట్టం ప్రభుత్వానికి ఇచ్చిన చట్టబద్ధత ద్వారా ఆనకట్ట నిర్మాణానికి అవసరమైన భూమిని స్వాధీనపరచుకున్నారు. ప్రజల ప్రయోజనాలకోసం భూమిని స్వాధీనపరచుకునే హక్కు ఈ చట్టం ప్రభుత్వానికి ఇచ్చింది. ఆనకట్ట నిర్మాణం వలన ఎవరి భూములు ముంపుకు గురవుతున్నాయో, వాటి మీద ఎవరికైతే చట్టబద్ధమైన స్వంత హక్కులున్నవో వారికి మార్కెట్టు విలువ ప్రకారం నష్టపరిహారం చెల్లించే అధికారం ఈ చట్టం ప్రభుత్వానికి దఖలు పరచింది. ఈ విషయం అభ్యంతరం లేనిదిగా, న్యాయమైనదిగా చాలా సాధారణంగా కన్పిస్తుంది. కాని చట్టంలో చెప్పబడుతున్న దానికి వాస్తవంలో భిన్నంగా విస్తృతంగా రెండు సమస్యలు ప్రధానంగా ముందుకు వస్తున్నవి. మొదటి సమస్య భూ రికార్డులకు సంబంధించినది. బ్రిటీష్ ప్రభుత్వం అప్పటివరకు ఆ ప్రాంతంలో వున్న ఒక సాధారణ భూసాంప్రదాయం స్థానే అక్కడ నివసిస్తున్న

రైతుల భూములకు సంబంధించి రికార్డులను లిఖిత పూర్వకంగా తయారుచేసే సాంప్రదాయాన్ని ప్రవేశపెట్టింది. ఎప్పుడైతే ఒక సాధారణ అలిఖితసాంప్రదాయం స్థానే లిఖిత సాంప్రదాయం చోటుచేసుకుంటుందో అక్కడ సాధారణ సాంప్రదాయంలో వుండే అనేక నిబిడీకృతమైన అంశాలు గుర్తింపును కోల్పోయాయి. లిఖిత సాంప్రదాయం ఎపుడు వ్యక్తిగత తత్వాన్నే గాని సమిష్టి తత్వాన్ని కల్గియుండదు. ఆ సమిష్టి తత్వమే ఇక్కడ కూడా లోపించింది. దీని ఫలితంగా అక్కడ తయారుచేయబడిన లిఖిత రికార్డులు రైతులకున్న వాస్తవ హక్కులను సక్రమంగా గుర్తించలేకపోయాయి. రికార్డు చేయబడిన భాష కూడా విదేశీ ఆంగ్లభాష కావడంవలన ఈ సమస్య మరింత జటిలమైంది. దీని ఫలితంగా భూరికార్డులు చేసే విధానం సక్రమంగా లేకపోవడమేగాక, ఖర్చురీత్యా, కాలరీత్యా కూడా అధిక వ్యయంతో కూడినదైనది. ఇంకొక ముఖ్యమైన సమస్య ఏమనగా, భూమిశిస్తు ఎక్కువగా రాని ప్రాంతాలలో బ్రిటిషువారుగాని, వారికి చెందిన సంస్థానాధీశులుగాని భూరికార్డులను సక్రమంగా తయారు చేయలేదు. అసంపూర్ణంగానే వుంచారు. స్వాతంత్ర్యం తర్వాత కూడా ఈ భూరికార్డులను ప్రభుత్వానికి వస్తున్న భూమిశిస్తు ఆధారంగానే తయారు చేశారు అనే విషయాన్ని కూడా మనం గమనంలో వుంచుకోవాలి. ఉదాహరణంగా కోరాపుట్ జిల్లా గజిటీర్‌లోని క్రింది భాగాన్నే చూడవచ్చును.

జిల్లాలోని కొన్ని అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలకు ప్రాధాన్యతనివ్వాలనే ఉద్దేశ్యంతో మొదట తయారు చేయబడిన కార్యక్రమం తిరగరాయబడినది. మరల 1951లో కార్యక్రమాన్ని పునః పరిశీలించి జిల్లా మొత్తాన్ని కూడా సర్వే మరియు సెటిల్‌మెంట్ కార్యక్రమంలో కలువుకోవాలని నిర్ణయించింది. అందుకు అనుగుణంగా జిల్లాను తొమ్మిది బ్లాకులుగా విభజించిన నూతన కార్యక్రమం 1951 అగష్టు 26న ప్రభుత్వం ఆమోదించింది. కాని 1957లో మల్కాన్‌గిరి ప్రాంతాన్ని వదలివేశారు. దానికి కారణం అక్కడవున్న వ్యవసాయక భూమి, సర్వే ఖర్చులకు అవసరమైన భూమిశిస్తును కూడా ఇవ్వలేకపోవటమే.

పై పరిస్థితుల కారణంగా వాస్తవ ఆర్థిక వ్యవస్థ చట్టబద్ధమైన ఆర్థిక వ్యవస్థకంటే చాలా పెద్దదిగా వుంటున్నది. చట్టబద్ధమైన ఆర్థిక వ్యవస్థ ఈ మిగిలిన భూములను ప్రభుత్వ అవశిష్టాధికారాలకే వదలి వేస్తున్నది. సాంప్రదాయకంగా సహజ సంపదమీద ఆ ప్రాంతంవారికి వుండే ఉపయోగించుకునే హక్కు ప్రభుత్వ పరిభాషలో ఆక్రమణగా చిత్రీకరింపబడుతున్నది. ఇక్కడ మనం ఆక్రమణ సమస్యను జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. ప్రభుత్వం ప్రజల హక్కులమీద దురాక్రమణ జరుపుతున్నదా లేక ప్రజలు ప్రభుత్వ హక్కులపై ఆక్రమణ జరుపుతున్నారా? ఈ విషయాన్ని అర్థం చేసుకోవడం అనేది వాస్తవాలకు వాటికి సంబంధించిన చిత్రాలకు మధ్య సంబంధాన్ని అర్థం చేసుకోవడంలో వున్నది.

కేవలం ఇక్కడ చిత్రీకరణలమీద ఆధారపడడం కన్నా వాస్తవాల మీద ఆధారపడటం అవసరం. అంతే కాకుండా మౌఖిక సాంప్రదాయంలో నిబిడీకృతమైన అంశాలన్నింటినీ లిఖిత సాంప్రదాయంలో (భూ రికార్డులలో) ఏ మేరకు పొందుపరచబడ్డాయి అనే దానిపై కూడా ఆధారపడి వుంటుంది. ఆ విధంగా సమగ్రంగా నమోదు చేయనపుడు మిగిలిఉన్న భూములపై హక్కులను గతంలోకి మౌఖిక సాంప్రదాయాలకు వదిలివేయాలి. మిగిలిపోయిన భూములమీద ప్రభుత్వానికి వున్నది అని చెప్పబడుతున్న అధికారం వాస్తవానికి వుండటానికి వీలులేదు.

వాస్తవాలకు, చిత్రాలకు మధ్యవున్న వ్యత్యాసాలు వాటియొక్క రూపంలోను, పరిమాణంలోను చాలా ఆసక్తికరమైన పరిణామాలను కల్గివుంటాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారం గ్రామాలలో వ్యవసాయ దారులు, వ్యవసాయ కూలీలు వున్నట్లు తెలుస్తుంది. వ్యవసాయదారులకు భూములమీద హక్కులుంటాయి. మిగిలిన వారికి హక్కులుండవు. వ్యవసాయదారులకు వారియొక్క ఇళ్లకు, పొలాలకు నష్టపరిహారం కోరే అవకాశం వుంటుంది. ఈ నష్టపరిహారాన్ని కోరే హక్కు 60%కి మాత్రమే పరిమితమైంది. మిగిలిన వారంతా వ్యవసాయ కూలీలు. ఈ చిత్రాన్ని మనస్సులో వుంచుకొని ఇంద్రావతి ప్రాంతాన్ని సందర్శిస్తే మనం విభ్రాంతికి లోనవుతాం. అక్కడ వ్యవసాయ కూలీలుగా చిత్రీకరించబడినవారంతా వాస్తవానికి భూమిని సాగుచేసుకునే వ్యవసాయదారులే అని స్పష్టమవుతుంది. వారు సాగుచేసేది డొంగారు భూమికావచ్చు. ఆక్రమణలో వున్న భూమికావచ్చు. పోరంబోకు భూమికావచ్చు. లేక భూస్వామి కౌలు భూమికావచ్చు. ఈ రకమైన సాగంతా అక్కడ స్థానికుల అంగీకారంతోను చిన్న పెద్ద ఉద్యోగులకు తెలిసి జరుగుతూ వుంటుంది. ఈ చర్యలకు వీరు కొంత జరిమానా కూడా చెల్లించి వుండవచ్చు.

వాళ్ళు ప్రధానంగా వారియొక్క స్వంత వినియోగం కోసం అక్కడ మిగిలిన సమాజంకోసం, అప్పుడప్పుడూ మార్కెట్‌లో అమ్మే వంటి పంటలను సాగుచేస్తూ జీవిస్తారు. అధికారిక చిత్రాలు వీటికి అనుగుణంగా వుండవు. దీని కారణంగా అక్కడ నష్టపరిహారం చెల్లించే విషయంలో చాలామందికి అన్యాయం జరుగుతున్నది. ఒక నిజమైన వ్యవసాయదారుణ్ణి ప్రభుత్వ రికార్డులు వ్యవసాయ దారుడుగా

గణించటం లేదు. అతనికి చట్టబద్ధమైన హక్కులు లేవు. నిజానికి అతను గ్రామంలో వ్యవసాయం చేస్తున్నప్పటికీ ప్రభుత్వ రికార్డుల ప్రకారం వ్యవసాయ కూలీగా మాత్రమే గుర్తింపు పొందుతున్నాడు. వాస్తవాలకు, ప్రభుత్వ రికార్డులలోని చిత్రాలకు మధ్య విపరీతమైన అంతరమేర్పడినదని నా అభిప్రాయం.

ఇకపోతే స్త్రీల పరిస్థితి కూడా ఇదేవిధంగా హెచ్చు ప్రాధాన్యతను కలిగివున్నది. ఇక్కడ చిత్రాలు వాస్తవాలకు మరీ దూరంగా వున్నాయి. 1981 జనాభా లెక్కల ప్రకారం 64.34% పనిచేయనివారు. 15.01% కొంతకాలం పనిచేసేవారు. 7.9% వ్యవసాయ కూలీలు. 10.31% వ్యవసాయదారులు. పై లెక్కలు ఈ ప్రాంతపు స్త్రీలను గూర్చి దురభిప్రాయాన్ని కలిగిస్తున్నవి. వీరు కేవలం పిల్లల్ని కనిపెంచే గృహ పనులకు మాత్రమే పరిమితమైన సోమరిపోతులుగా, కాలం గడిపేవారుగా చిత్రీకరిస్తున్నది. కాని వాస్తవం ఇందుకు పూర్తిగా విరుద్ధం. ఇక్కడ గ్రామాలలో ఆర్థిక వ్యవస్థకు స్త్రీలే కేంద్రం. అతి చిన్న వస్తువులైన చీపుర్ల తయారీ నుండి పెద్దపెద్ద వస్తువుల తయారీ వరకు స్త్రీలే చేస్తారు. అడవి ఉత్పత్తులు సేకరించటంలోను, గృహాలను తీర్చిదిద్దుకోవటంలోను, కూరగాయలు పెంచటంలోను, కొండవాలు తలాలలో వ్యవసాయం చేయటంలోను, ఉత్పత్తుల నిలువ చేయటంలోను, అమ్మటంలోను, చేపలు పట్టటంలోను, మంచినీటిని సమకూర్చటంలోను వగైరా విషయాల్లోను, ఒక్కమాటలో చెప్పాలంటే మొత్తం ఆర్థిక కార్యక్రమం స్త్రీల చుట్టూ అల్లుకుని వుంటుంది. కాని ప్రభుత్వ లెక్కలలోని చిత్రీకరణ వీరికి కొంతకాలం పనిచేసేవారిగాను, అసలు పనిచేయనివారుగాను చూపుతున్నది. ఈ రకంగా అవాస్తవమైన ప్రభుత్వ చిత్రీకరణ వలన నిర్వాసితులైన కుటుంబాల వాస్తవ జీవన పరిస్థితులు చాలా దుర్భరమైన పరిస్థితులకు లోనయ్యాయి. అంతేగాక ఆ చిత్రీకరణలు వాస్తవాలను అర్థం చేసుకోవడానికి ఉపయోగంగా లేకపోవడమే గాక, అసంపూర్ణ చిత్రీకరణకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడనిదే నష్టపరిహారం లభించే పరిస్థితి కూడా లేదు.

ఇదే విధమైన పరిస్థితి భూమికి విలువ కట్టడంలో కూడా జరుగుతున్నది. సాధారణ పరిస్థితులలో ఎక్కువభాగం ఆర్థిక వ్యవస్థలలో భూమిని ద్రవ్యంగా మార్చుకునే పరిస్థితి వుండదు. సరుకులకు ప్రధానపాత్ర వుండదు. సరుకు విలువను కల్గి వుండటంకంటే భూమిని కలిగివుండటమే ఆ సమాజ జీవనవిధానంలో ఒక భాగంగా వుంటుంది. సాధారణంగా భూ అమ్మకాలుండవు. ఒకవేళ అమ్మకం జరిగినా అప్పులు, తనఖాలు తీర్చటం కోసం అయినకాడికి తెగనమ్మబడుతూ వుంటాయి. ఎవరైనా ఈ కొండ ప్రాంత పరిస్థితులతో ఎక్కువ సంబంధాలు కలిగివున్నట్లయితే వారికి ఇక్కడ భూ అమ్మకాల పరిస్థితి బాగా అర్థమవుతుంది. చాలా తీవ్రమయిన ఆర్థికేతర వత్తిడుల మూలంగానే ఇవి జరుగుతూ వుంటాయి. కనుక ఇరుపక్షాలు కూడా పట్టాలలో వాస్తవ అమ్మకపు విలువలను ప్రకటించరు. కాని ప్రభుత్వం వీటినే నిజమైన భూమి విలువగా ప్రకటించి నష్టపరిహారాన్ని నిర్ణయిస్తున్నారు. ఇక్కడ అమ్మకాలు, అమ్మకపు వెల, పట్టాలలో చూపిన అమ్మకం వెల, అక్కడి ప్రజల దుర్భర స్థితిని తెలియపరుస్తున్నాయి.

ఇది ఒక సంపూర్ణ ఆరోగ్యవంతునికి, రోగికి పెట్టే ఆహారం పెట్టినట్లున్నది. ఇది వాస్తవాలను వక్రీకరించటమే. బాగా పంటపండే పొలానికి చెల్లించే నష్టపరిహారం సుమారు రు. 2,000 లు. ఆనకట్ట నిర్మాణంవలన నిర్వాసితులైన వారు వేరేచోట అదేరకమైన పొలాన్ని కొటానికి రు. 10,000 చెల్లించాల్సి వస్తున్నది.

ఆనకట్టలు, నిర్వాసితులను గూర్చి నేను చేసిన అధ్యయనం, అనుభవం ద్వారా కొన్ని విషయాలు చెప్పగల్గాను. మనకు బాగా పరిచయమున్న ప్రాంతాలకు సంబంధించి చేయబడిన చిత్రీకరణలు నిజజీవితంలో మనకు చాలా వ్యతిరేకంగా వుంటాయి. నేను ఈ విధమైన అవాస్తవ చిత్రీకరణలతో తరచూ వ్యతిరేకిస్తూ వుంటాను. వాస్తవానికి సంబంధించి నాకున్న అవగాహన ప్రభుత్వ చిత్రీకరణకన్నా చాలా భిన్నంగాను, పెద్దదిగాను వుంటాయి. కేవలం అవి ఆనకట్ట నిర్మాణానికి సంబంధించి చేసిన అధ్యయనానికి సంబంధించి మాత్రమే కాదు. మన పరిసర ప్రాంతాలకు సంబంధించి కూడా చేసిన అధ్యయనం నుంచి నాకు అదే అవగాహన కలిగింది. నేను వ్యతిరేకిస్తున్న ఈ చిత్రీకరణలు వాస్తవ జీవనానికి ప్రతిరూపాలు కావు. ఇవి నిజానికి అరువు తెచ్చుకున్నట్టివి. బ్రిటిష్ పాలనా కాలంలో వారి నుండి, తర్వాత అభివృద్ధి, ఆధునికీకరణ పేరుతో సామ్రాజ్యవాద దేశాలనుండి అరువు తెచ్చుకోవడం జరుగుతున్నది. ప్రస్తుతం మనం మన రాజకీయ పరిస్థితినే తీసుకొందాం. ఇప్పుడు మనదేశం ఎన్నికల జ్వరంలో వున్నది. ప్రజాస్వామ్యానికి ఒక చిత్రంగా గత 40 సంవత్సరాలుగా పార్లమెంటు ఎన్నికలను అనుసరిస్తూ తర్వాత రాజకీయ పార్టీలు ఏమి చేయాలో, ఏమి చేయరాదో నిర్ణయించాల్సి రావటం ఒక వింతదృశ్యం. నిజానికి నిరక్షరాస్యులుగా వున్న, విద్యా విహీనులగు ఓటర్లకు ఆ విషయాలు విశదపర్చాల్సి వస్తే అర్థం చేసుకోవచ్చు. కాని దేశానికి ప్రధానమంత్రులు కావాలనుకుంటున్న పార్లమెంటు సభ్యులకు, దేశాన్ని పాలించాలనుకుంటున్న రాజకీయ పార్టీల వారికి చెప్పవలసి రావడం చాలా దురదృష్టకరం. ఎన్నికల నమూనా లేక చిత్రం అసలైన వాస్తవానికి చాలా భిన్నంగాను,

చిన్నదిగాను వున్నది. ఈ సమాజం కుల, మత, భాషాపరమైన ఆర్థికేతర లక్షణాలపై విభజింపబడి వున్నది. కాని పార్లమెంటు ఎన్నికల చిత్రం, సరకు ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన ఆర్థిక విభజన మాత్రమే. సామాజిక వాస్తవం ఎన్నికల నమూనాకు లేక చిత్రానికి అనుగుణంగా మారుతుందని ఇంతవరకు ప్రజలు ఆశిస్తూ వచ్చారు. కాని నలుబయి సంవత్సరాల, తొమ్మిదిసార్ల అనుభం ఏమి చెప్తుతున్నది? సామాజిక వాస్తవమే ఎన్నికల నమూనాను లేక చిత్రాన్ని మార్చింది కాని ఆ నమూనాకు లేక చిత్రానికి దగ్గరకు చేరలేదని రుజువుపరుస్తున్నది. వాస్తవానికి ఎన్నికలలో నిలబెట్టడానికీ, అభ్యర్థులను ఎంపిక చేయడంలో గాని, వారికి ప్రచారం చేయడంలో గాని, కుల, మత భాషావరమైన విభజనలను వాడుకోని రాజకీయ పార్టీలేదని చెప్పవచ్చును. ప్రాథమిక పాఠశాల నుండి న్యాయవ్యవస్థ వరకు ఇదే ఉదాహరణ వర్తిస్తుంది.

ఉపాధ్యాయులుగా మనకు ఈ వ్యవస్థ తెచ్చి పెట్టే చిక్కులు ఏమిటి? సాంఘిక శాస్త్రాలలో, మానవశాస్త్రాలలో సాధారణంగా కొన్ని నమూనాలను లేక చిత్రాలను అనుసరిస్తూ విద్యార్థి ఆ విజ్ఞానాన్ని పొందాలని మనం బోధిస్తాం. కానీ ఆ రకమైన విజ్ఞానమంతా అమూర్త భావంగా, అస్పష్టంగా వాస్తవానికి చాలా దూరంగా వుండి ఆ యువ విద్యార్థి మేధస్సును కూడా అదేవిధంగా తయారుచేస్తుంది. బోధనా మాధ్యమం అమూర్తంగా, సంక్లిష్టంగా వుంటున్న ప్రాథమిక విద్యాదశలో ఈ రకమైన సమస్యలు చాలా తీవ్రంగా వుంటాయి. మాట్లాడే భాషకు, రాసే భాషకు చాలా వ్యత్యాసముంటుందని ఈ దిశలో పనిచేసే మనందరికి తెలుసు. అందువలన మాతృభాషలో అధ్యయనం చేస్తున్నవారు కూడా రాత భాషలో వున్న ఈ సంక్లిష్టత వలన వారిలోనికి వ్యక్తీకరణ శక్తి నశిస్తున్నది. సమాజంలోని దిగువ కులాల, తెగల పిల్లలలో ఈ సమస్యలు మరీ ఎక్కువ అవుతాయి. నిజానికి భాష ఒక మాధ్యమం కాలేకపోతున్నది. పైపెచ్చు అది ఒక అడ్డంకిగా మారి విద్యార్థులలోని అంతర్లీనమైన శక్తిని బయటకు రానివ్వని పదార్థమైంది.

నిజానికి ఈ మాధ్యమం అనే పదానికి రెండు అర్థాలున్నాయి. ఒక పదార్థం ద్వారా ఒక ఫలితాన్ని పంపగల్గాలి. అదేవిధంగా దాని ద్వారా వ్యక్తీకరణను కూడా చేయగల్గాలి. ఇది మాధ్యమం యొక్క ఒక అర్థం. రెండవ అర్థం ఏమనగా ఏదైన ఒక మధ్యవర్తిత్వం వహించే ఒక సాధనం లేక పరికరం లేక సంస్థ. మొదటి అర్థంలో మనం కాంతిని లేక విద్యుత్తునుగాని ఉదాహరణగా తీసుకుంటే అవి ఒక యానకం ద్వారా ప్రసరిస్తాయి. ఇక్కడ యానకం దానిలో ప్రసరించే పదార్థాన్ని మార్చదు. దాని గుణాన్ని మార్చదు. ఒకానొక భాష కూడా మాధ్యమంగా అదేవిధమైన పాత్ర నిర్వహించాలి. ఈ బోధనా భాషపై దాని పాత్రను సాధ్యమైనంత ఎక్కువగా నిర్వహించగల్గుతుంది. ఆ పరిస్థితులలో ఉపాధ్యాయుడు విద్యార్థులకు ఏమి చెప్పదలచుకున్నాడో చెప్పటంలో చాలా తటస్థ పాత్రను మాధ్యమం నిర్వహిస్తుంది. ఇక్కడ మౌలికంగా ఊహించే విషయం ఇంకొకటి వున్నది. అది ఏమనగా విద్యార్థులు కూడా ఆ మాధ్యమంపై పట్టు, వ్యక్తీకరణ నైపుణ్యాలు కల్గి వుండాలి. అయితే ఉపాధ్యాయునికంటే తక్కువగా వుంటుంది. ఆ విధమైన పట్టు ఇరువురికి వున్నప్పుడు ఉపాధ్యాయుడు తనకు తెలిసిన విషయాన్ని విద్యార్థికి అర్థమయ్యే విధంగా బోధించగల్గుతాడు. మాతృభాష బోధనా మాధ్యమంగా వుండాలనే వాదనకు ఇదే కేంద్రకం మరియు అర్థం.

కాని మన విద్యావిధానం బోధనా మాధ్యమానికి సంబంధించి రెండవ అర్థాన్నే తీసుకుంటున్నది. దీనికి దగ్గర ఉదాహరణ మన వంట పద్ధతి. వంటలో ముఖ్యమైన మాధ్యమంగా ఉపయోగపడే నూనె, పదార్థం యొక్క రూపాన్ని మార్చివేస్తుంది. అంతేగాక తాను కూడా మార్పు చెందుతుంది. బోధనా మాధ్యమాన్ని ఈ విధమైన అర్థంలో ఉపయోగిస్తే చాలా దురదృష్టకరమైన పరిణామాలు ఎదురౌతాయి. ఇవే మనం సాధారణంగా ప్రస్తుత బోధనలో చూస్తున్నటువంటివి. బోధనా మాధ్యమం ద్వారా వెళ్లిన విజ్ఞానం విద్యార్థి గ్రహించేటప్పటికి మార్పుకు లోనవుతుంది. అంతేగాక అతను తదుపరి క్లాసుకు వెళ్లడం తన పరీక్షకు ఉపయోగపడే విజ్ఞానాన్ని మాత్రమే గ్రహించగలిగే స్థితికి తీసుకువస్తుంది. ఆ విధంగా విజ్ఞానం ఉపాధ్యాయుడి నుండి విద్యార్థికి వెళ్లే ఒక సమాచారమై పోతుంది. ఇక్కడ ఉపాధ్యాయునికి విషయం అంతా తెలుస్తుందని విద్యార్థికి ఏమీ తెలియదని భావం ఏర్పడుతుంది. ఈ భావం కేవలం బోధనా మాధ్యమానికే కాక విద్యావ్యవస్థలోని అనేక పార్శ్వాలకు కూడా వర్తిస్తుంది. ఉదాహరణకు ఒకానొక విషయంలో అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ ప్రపంచంలో విపరీతమైన విజ్ఞానం ప్రోది చేయబడి వున్నదనేది తెలిసిన వాస్తవం. ఢిల్లీలో కూర్చున్న వారికి ఈ విజ్ఞానాన్నంతా భారతీయ విద్యార్థులకు అందించాలని ఆతృత. ఇలా పొందిన వివేకంతో ఎన్.సి.ఇ.ఆర్.టి.వారు సమాచారంతో నిండిన పుస్తకాలను తయారు చేశారు. ఇక ఎన్.సి.ఇ.ఆర్.టి.వారు ఆ పుస్తకాలను వివిధ మాతృభాషలలోకి తర్జుమా చేసి అక్కడి ఉపాధ్యాయులకు ఎప్పుడన్నా ఒకసారి అవసరమైన శిక్షణనిస్తారు. వారి విజ్ఞానస్థాయిని పెంచటం కోసం అరుదైన ప్రయత్నం చేస్తారు.

చూడ్డానికి ఈ కార్యక్రమం ఒక యుద్ధ ప్రాతిపదికతో అమలు జరుపుతున్నట్లనిపిస్తుంది. జాగ్రత్తగా పరిశీలించినపుడు ఒక విధానం స్కూలు స్థాయి నుండి విశ్వవిద్యాలయస్థాయికి చేరింది. విశ్వవిద్యాలయాల గ్రాంట్ల సంఘం దేశవ్యాప్తంగా పాఠ్యాంశాలను ఏకీకృతం చేయడానికి ప్రయత్నించింది. స్కూలు టీచర్లతో ప్రారంభమైన శిక్షణా కార్యక్రమం వేసవి స్కూళ్ల రూపంలో కళాశాల టీచర్లకు కూడా ప్రాకింది. ఇప్పుడది యూనివర్సిటీలకు కూడా వ్యాపించింది. కొన్ని యూనివర్సిటీలలో వున్న ఎకడమిక్ స్టాఫ్ కాలేజీలు ఈ విజ్ఞానాన్ని యూనివర్సిటీ టీచర్లకు అందించడంలో సాధనాలుగా ఉపయోగపడుతున్నవి. ఈ విశ్వవిద్యాలయాల టీచర్లు ఆ విజ్ఞానాన్ని పోస్టుగ్రాడ్యుయేట్ విద్యార్థులకు, ఎం.ఫిల్, విద్యార్థులకు అందిస్తున్నారు. ఇందిరాగాంధీ ఓపెన్ యూనివర్సిటీ మొత్తంగా ఈ సమాచారానికి గిడ్డంగిగా తయారై యూనివర్సిటీ స్థాయిలో నైపుణ్యాన్ని పెంచే కర్తవ్యాన్ని చేపట్టాలని అనుకుంది. ముందుగా మనం యూనివర్సిటీలవైపు చూస్తున్నప్పుడు ఏమనిపిస్తుందంటే, విపరీతమైన వేగంతో అభివృద్ధి చెంది ప్రోగుపడుతున్న ఈ విజ్ఞానాన్ని అందుకొనకపోతే మన దేశ అభివృద్ధి కుంటుపడుతుందేమోననిపిస్తుంది. పై విషయాన్నట్లుంచి కాస్త వేచి చూచి, ఆలోచిస్తే మనం తయారు చేసుకున్న నమూనాలు లేక చిత్రాలు వాస్తవాలకు దగ్గరవుతున్నాయా లేక నమూనాలను, చిత్రాలను మార్చివేస్తున్నాయా అనే విషయాన్ని అర్థం చేసుకోవాలి. అప్పుడే మనం ఏరకమైన సంక్షోభంలో వున్నామో అర్థం చేసుకోగల్గుతాం. అభివృద్ధి చెందిన దేశాలలోని యూనివర్సిటీలు వాస్తవాలతో ప్రయోగం జరపడానికి నమూనాలను, చిత్రాలను రూపొందించి దాని నుండి లభించిన విజ్ఞానాన్ని వ్యాసాలు, పుస్తకాలు రూపంలో క్రిందిస్థాయికి అందిస్తాయి. పరిశోధనా పత్రాలు, ఫలితాలు ఉపన్యానపు నోట్సులుగాను, ఈ ఉపన్యానపు నోట్లు పాఠ్యపుస్తకాలుగాను వస్తాయి. ఈ కారణంవల్లనే యూనివర్సిటీలకు నిధులిచ్చే విషయం, కళాశాలలకు నిధులిచ్చే విషయంకంటే భిన్నంగా వుంటుంది. కళాశాలలకంటే యూనివర్సిటీ టీచర్లకు పనిగంటలు తక్కువగా వుంటాయి. యూనివర్సిటీలలో స్టడీ లీవులు, పర్యటిస్తూ అధ్యయనం చేసే లీవులు, ప్రమోషన్ పొందడానికి వున్న అవకాశాలు చాలా భిన్నంగా వుంటాయి. ఈ రకమైన నమూనాలను, చిత్రాలను, దిగుమతి చేసుకుని కొద్దిమార్పులతో మన సమాజంలో పెట్టుకున్నాం. నలుబది సంవత్సరాల మన అనుభవం మనకు చెప్పే విషయం ఏమిటి? భారత సామాజిక వాస్తవికత ఈ యూనివర్సిటీలను కేవలం విజ్ఞానానికి రిలే కేంద్రాలుగా మార్చిందేతప్ప విజ్ఞానాన్ని సుసంపన్నం చేయలేదు. ఈ యూనివర్సిటీ వ్యవస్థ భూస్వామ్య లక్షణాలను కలిగి అదేరకమైన వాతావరణానికి ప్రాతినిధ్యమైందే తప్ప ఒక ఉన్నతమైన ఉత్పత్తిశక్తికి, ఆస్తి సంబంధాలకు ప్రాతినిధ్య సంస్థ కాలేకపోయింది.

పై నమూనా వెనుక వున్న ప్రాథమిక భావననుసరించి విజ్ఞానం పైస్థాయిలో వుంది. క్రిందికి వస్తూ వుంటుంది. ఆ మేరకు నమూనా చూడ్డానికి కనబడినా ఇది గతంలోని బ్రాహ్మణ ఆధిపత్య సమాజపు నమూనాను పోలినటువంటిది మాత్రమే. దానికి ఎంతమాత్రం భిన్నమైంది కాదు. క్రిందిస్థాయిలో విజ్ఞానం లేకపోవడమే వారిలో పేదరికం, మూఢనమ్మకాలు, అజ్ఞానం మొదలగు అంశాలకు కారణమని బ్రాహ్మణిక నమూనాలు వాదిస్తాయి. దూరదర్శినిలో ప్రజాదరణ పొందిన వయోజన అక్షరాస్యత కార్యక్రమం యొక్క మకుటగేయం ఈ రకమైన గజిబిజి పద్ధతి నమూనా నుండే చిత్రీకరింపబడినది.

పఢనా లిఖనాసీకో	ఆకలితో అలమటిస్తున్న ప్రజలారా
భూక్‌సే మర్ నెవాలె	చదవడం రాయడం నేర్చుకోండి

రూపంలోను సారంలోను పై విషయం అత్యంత అసంబద్ధమైంది. బహుశ ఈరకమైన అసంబద్ధమైన విషయాన్ని ముందుగా ఊహించి వుండటం వల్లనే కావచ్చు. ఉపాధ్యాయులను విద్యావంతులను చేయాల్సిన అవసరముందని కారల్‌మార్క్స్ హెచ్చరించి వుంటారని నేననుకుంటున్నాను.

నేడు భారత సామాజిక సంక్షోభాన్ని గూర్చి మాట్లాడడం చాలా సామాన్యమైన విషయం అయిపోయింది. ఈ సంక్షోభం, ఆధునిక పురోగామి చిత్రీకరణలకు, భూస్వామ్య తిరోగామి చిత్రీకరణలకు మధ్య సంక్షోభాన్ని సూచిస్తుందని కొందరు విశ్లేషిస్తున్నారు. ఈ రెంటికి మధ్య వున్న సంక్షోభం పైకి కన్పించే విధంగా వాస్తవంగా లేదని నా అభిప్రాయం. అంతేగాక ఈ రెండు చిత్రీకరణలు ఒక దానితో ఒకటి సర్దుకొని కూడా పోతాయి. కనుక నిజమైన సంక్షోభం అనేది నిజానికి ఈనాడు ఈ రెండు చిత్రీకరణలకు, వాస్తవ సామాజిక గమనానికి మధ్య వున్నది. ఈ సామాజిక వాస్తవికత ఈ రోజు ఈ చిత్రీకరణకంటే పెద్దదిగాను, భిన్నంగాను వుండి ఈ సంక్షోభపు కోణాలను, పరిష్కారాన్ని నిర్దేశిస్తున్నది.

(ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 14వ మహాసభలలోని ప్రధాన చర్చనీయాంశం)

(ఎపిటిఎఫ్ ప్రచురణ 'భారతవిద్యారంగం-విమర్శనా దృక్పథం' నుంచి)

*

భారత ఆర్థిక వ్యవస్థ (1947-2004)

-డా॥ మానేపల్లి

ఎకడమిక్ ఫౌండేషన్ (న్యూఢిల్లీ) వారు-ఆర్థిక రాజకీయ-సామాజిక శాస్త్రాలపై ఉత్తమ గ్రంథాల్ని ప్రచురించి సరసమైన ధరలకే అందిస్తున్నారు. ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త, కొంతకాలం ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా కూడా పనిచేసిన రంగరాజన్ గ్రంథాన్ని కూడా ఈ సంస్థ ప్రచురించింది. ఆ వరసలో ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త ఉమాకపిల రచన ఇండియన్ ఎకానమీ సిన్స్ ఇండిపెండెన్స్ అనే గ్రంథాన్ని ప్రచురించింది. ఈ గ్రంథపు 16వ తాజా ఎడిషన్ ప్రస్తుతం పాఠకులకు లభిస్తున్నది. ఏ గ్రంథమయినా 16 సార్లు పునర్ముద్రణ పొందిందంటే-అది విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, ఆర్థిక శాస్త్రాల అధ్యయనం చేసేవారికి ఎంతగా ఉపకరిస్తున్నదో అర్థం చేసుకోవచ్చు.

ఉమా కపిల చాలాకాలం ఢిల్లీ యూనివర్శిటీలో ఆర్థికశాస్త్ర శాఖలో రీడర్‌గా పనిచేసి రిటయిరయి ప్రస్తుతం ఎకడమిక్ ఫౌండేషన్ ప్రచురణ సంస్థలో సీనియర్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. శ్రీమతి ఉమ లోగడ ప్లానింగ్ కమీషన్ స్టడీ గ్రూపులో-భారత తూర్పు ప్రాంతంలోని వ్యవసాయ విధానంపై పనిచేశారు. నూనె గింజల ఉత్పత్తులపై ఆమె అధ్యయనగ్రంథం (1982) మిక్కిలి ప్రసిద్ధి పొందింది. బీకాం (ఆనర్స్) విద్యార్థులకు ఉపయోగపడే అనేక పాఠ్యగ్రంథాలు రచించారు.

డా॥ ఉమ సంపాదకత్వంలో వెలువడిన ఈ గ్రంథంలో సి. రంగరాజన్, ప్రవీణ్ విసారియా, ఎ. వైద్యనాథన్, సి.ఎచ్ హనుమంతరావు, ఆర్. నాగరాజ్, మోంటెక్ అహ్లువాలియా మొదలైన ప్రముఖుల వ్యాసాలున్నాయి.

38 ప్రకరణాలు గల ఈ పుస్తకంలో ఐదు భాగాలున్నాయి. మొదటి భాగంలో ప్లానింగ్, రెండవ భాగంలో వ్యవసాయం, మూడవ భాగంలో పరిశ్రమలు, నాలుగవ భాగంలో విదేశీరంగం, ఐదవ భాగంలో 1950 నుంచీ నేటివరకూ జరుగుతున్న అభివృద్ధిపై సమీక్ష వున్నాయి.

1947 నాటికి భారత ఆర్థిక పరిస్థితి, విధానం ఏ స్థాయిలో వుందీ, క్రమంగా ఏ మార్పులు పొందిందీ ప్రారంభంలో ఉమ వివరించారు. ఇందుకోసం ఆమె ప్రణాళికారచన ఎలా జరిగిందీ, ఏ మేరకు అమలు జరిగిందీ, అభివృద్ధిలో ఏ పొకడలున్నాయి, లోపాలు ఏమిటీ-మొదలైన అంశాల్ని పరిశీలించారు. ప్రభుత్వ, ప్రభుత్వేతర (పరిశోధనా) సంస్థలనుంచి ప్రథమశ్రేణి సమాచారాన్ని సేకరించి విశ్లేషించారు. ఆహార గింజల సరఫరా, మిగులు, కారణాలు-పాలసీలు అనే అంశాన్ని సి.ఎచ్. హనుమంతరావుగారు కూలంకషంగా చర్చించారు. 1960ల మధ్యనుంచీ క్రమంగా ఆహార ధాన్యాల పరిస్థితి మెరుగుపడిన తీరు వివరించారు.

నూతన అంతర్జాతీయ వ్యాపార విధానంలో భారతీయ వ్యవసాయం ఎలా వుందో ఏయే సమస్యల్ని ఎదుర్కొంటుందో మరొక వ్యాసంలో హనుమంతరావుగారు వివరించారు.

వేరు వేరు భాగాల్లో సి. రంగరాజన్‌గారి వ్యాసాలు నాలుగున్నాయి. ఆయన 12వ ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్‌గా, రిజర్వు బ్యాంకు గవర్నర్‌గా, ప్లానింగ్ కమిషన్ సభ్యునిగా పనిచేసి విశేషానుభవం గడించారు. పెట్టుబడులు, విధి విధానాలు, ద్రవ్యోల్బణం-ఆర్థిక విధానం, గ్లోబలైజేషన్ దాని ప్రభావం-మొదలైన అంశాలపై విలువైన సమాచారం అందిస్తూ-నూతన ఆలోచనా విధానాన్ని పాఠకుల ముందుంచారు. ద్రవ్యోల్బణంపై-ఆర్థిక మంత్రిత్వ శాఖ రూపొందించిన వ్యాసం కడకు చదివి తీరవలసినది.

పేదరికం-దానిని తొలగించడానికి అవలంబించవలసిన ఆర్థిక విధానాల గురించి ఎ. వైద్యనాథన్, 1980ల తరువాత ఆర్థిక విధానం గురించి ఆర్. నాగరాజ్, విదేశీ వ్యాపార సూత్రాలు-భారతదేశ అభివృద్ధి గురించి టి.ఎన్. శ్రీనివాసన్, సరళీకరణ-విదేశీ పెట్టుబడుల్లో మారుతున్న పద్ధతుల గురించి నగేష్‌కుమార్-విలువైన వ్యాసాలు రాశారు.

అంతటా సరళమైన ఇంగ్లీషు, అవసరమైన ప్రతిచోటా గణాంక వివరాలూ పట్టికలూ, గ్రాఫులూ (రేఖా చిత్రాలూ), ప్రతి వ్యాసం చివర మరిన్ని వివరణలూ అధ్యయనం చేయదగిన గ్రంథాలు...పాఠకుల్ని సులభంగా చదివింపజేసి, ఆలోచింపజేస్తాయి. విద్యార్థులకు మాత్రమే కాకుండా, ఆసక్తిగల వారందరికీ ఈ గ్రంథం ఉపకరిస్తుందని ప్రొ.వి.కె.ఆర్.వి. రావు వంటి ప్రముఖులు మెచ్చుకున్న గ్రంథం ఇది.

(Indian Economy Since Independence-Ed by Uma Kapila - Academic Foundation, Daryaganj, New Delhi-2. 1040 Pages. Rs. 350/-)

*

PRINTED BOOK
RNI Regn. No. APTEL/2003/11482
Postal Regn. No. LII/RNP/H-HD-1029/2004-06



Owned, Printed and Published by V.Hanumantha Rao at G1 Mythri Residency, 3-6-394, Road No.3, Himayat Nagar, Hyderabad-5000 029 Ph: 55843495 DTP at Samata Graphics, Hyderabad. Printed at Akruti, Chikkadapalli, Hyderabad.
Editor: N.Venugopal

VEEKSHANAM
G1, MYTHRI RESIDENCY,
3-6-394, ROAD NO.3
HIMAYAT NAGAR, HYDERABAD-500029